

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 205

SUNDAY Special | ఆదివారం 15-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అష్ట' దిగ్బంధనం

వన్డే ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ జట్టుపై భారత్ తమ అజేయ రికార్డును కొనసాగిస్తూ వరుసగా ఎనిమిదో విజయం నమోదు చేసింది. అహ్మదాబాద్‌లో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. భారత బౌలర్లు బుమ్రా, సిరాజ్, పాండ్యా, కుల్దీప్, జడేజా తలా రెండు వికెట్లు పడగొట్టి పాకిస్తాన్‌ను 191 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం రోహిత్ శర్మ (63 బంతుల్లో 86; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), అయ్యర్ (62 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి భారత విజయాన్ని ఖరారు చేశారు. - 14లో



హమాస్ కమాండర్ హతం

ఇజ్రాయెల్‌పై మెరుపుదాడికి సారథ్యం వహించిన హమాస్ కమాండర్ అలీ ఖాదీ డ్రోన్ దాడిలో హతమయ్యాడు.

- వివరాలు 6లో



న్యూజిలాండ్ ప్రధానిగా లుక్సన్

న్యూజిలాండ్ నూతన ప్రధానిగా క్రిస్టఫర్ లుక్సన్ పగ్గాలు చేపట్టనున్నారు. ఎన్నికల్లో ఆయన 40% ఓట్లు సాధించారు.

- వివరాలు 6లో



ప్రమాదాలూ.. చికిత్సలు

ఏటా అక్టోబర్ 17ను 'వరల్డ్ ట్రామా డే'గా పాటిస్తున్న నేపథ్యంలో ప్రమాదాలప్పుడు అందించాల్సిన చికిత్సలపై కథనం

- వివరాలు 13లో



ఆర్థిక, దౌత్యంలో నూతనాధ్యాయం

భారత్, శ్రీలంక మధ్య మళ్లీ పడవ ప్రయాణ సేవలు మొదలవడం ద్వైపాక్షిక బంధాన్ని దృఢం చేస్తాయని మోదీ అభిలషించారు.

- వివరాలు 6లో

జంగ్ తెలంగాణ

మేనిఫెస్టో... మా ఇష్టమంటే

కుదరదు

- ఎన్నికల ప్రవర్తన నియమావళిలో విధివిధానాలు
- దీనికి అనుగుణంగానే హామీలు, వాగ్దానాలు ఉండాలి

హామీలను నెరవేర్చిన పార్టీలకే ఓటేయాలి

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ప్రజల మేనిఫెస్టో విడుదల

రికార్డుల జోరు.. కేసీఆరు

ఎనిమిదిసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నేత

- వివరాలు 7, 8 పేజీల్లో

'బీ'.. రె'ఢీ'..!

అభ్యర్థులకు నేడు బీఆర్ఎస్ బీ ఫారాల అందజేత

జనాకర్షక హామీలతో పార్టీ మేనిఫెస్టో సైతం విడుదల

- ఆసరా పింఛను పెంపు, ఉచిత సిలిండర్ లేదా భారీ సబ్సిడీతో సిలిండర్‌కు చోటు
- నేడు తెలంగాణ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం... మరో ఐదుగురు అభ్యర్థుల ఎంపిక కొలిక్కి?
- ముఖ్య నేతలకు ఎన్నికల ప్రచారంపై అధినేత దిశానిర్దేశం
- అభ్యర్థులతో కలిసి మధ్యాహ్న భోజనం
- అనంతరం హుస్నాబాద్ తొలి ఎన్నికల ప్రచార సభకు కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో పరుగులు పెడుతున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆదివారం మరో కీలక ముందడుగు వేస్తోంది. పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు నామినేషన్ల ప్రక్రియకు 18 రోజుల ముందే బీ ఫారాలు అందజేయనున్నారు. ప్రధాన ప్రతిపక్షాలు ఇంతవరకు తమ అభ్యర్థులనే ఖరారు చేయకపోవడం గమనార్హం. కాగా పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే బీఆర్ఎస్ విస్తృతస్థాయి భేటీలో ఎన్నికల మేనిఫెస్టోను కూడా విడుదల చేయనున్నారు. పార్టీ అభ్యర్థులుగా ఇప్పటికే ఖరారైన వారితో పాటు రాష్ట్ర కార్యవర్గం, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,

మిగతా 2వ పేజీలో ▶



శనివారం పొన్నాల లక్ష్మయ్యను ఆయన నివాసంలో కలిసిన మంత్రి కేటీఆర్

నేడు కేసీఆర్‌తో పొన్నాల భేటీ

- బీఆర్ఎస్‌లో చేరాల్సిందిగా కేటీఆర్ ఆహ్వానం... సూత్రప్రాయంగా అంగీకరించిన మాజీ పీసీసీ చీఫ్
- సీఎంతో సమావేశం తర్వాత నిర్ణయం చెబుతానని వెల్లడి

2లో

ప్రేమ వ్యవహారం వల్లే..

ప్రవల్లిక ఆత్మహత్య కేసులో పోలీసుల వివరణ

- ప్రియుడు మోసం చేశాడనే ఆమె ఉరివేసుకుందని వెల్లడి
- ఎలాంటి గ్రూప్స్ పరీక్షలకు ఆమె అప్లయ్ చేయలేదు
- ఏ పోటీ పరీక్షలు కూడా రాయలేదు
- సూసైడ్ లెటర్, సెల్‌ఫోన్ కాల్ రికార్డులు, ఇతర ఆధారాలు గుర్తించాం
- సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు వెల్లడి





సాక్షి, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ ఆత్మహత్యకు పాల్పడిన మర్రి ప్రవల్లిక (23) కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రేమ వ్యవహారమే ఆమె ఆత్మహత్యకు కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రియుడు తనని కాదని మరొకరితో వివాహానికి సిద్ధం కావడంతో మనస్తాపం చెంది ఆమె సూసైడ్ చేసుకుందని సెంట్రల్ జోన్ డీసీపీ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు శనివారం డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన ప్రవల్లిక అశోక్‌నగర్‌లోని ఓ వసతి గృహంలో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ''ఆత్మహత్యపై శుక్రవారం రాత్రి సమాచారం రావడంతో అక్కడికి వెళ్లాం. ఆమె గదిలో సూసైడ్ లెటర్

మిగతా 5వ పేజీలో ▶

ఉద్రిక్తత నడుమ ప్రవల్లిక అంత్యక్రియలు

- బిక్కాజిపల్లిలో పోలీసుల భారీ బందోబస్తు
- మృతదేహం తరలించే సమయంలో చిక్కడపల్లిలో ఉద్రిక్తత.. పోలీసులపై రాళ్లు.. స్వల్ప లాఠీచార్జి

- వివరాలు 12లో



ఒక్కేసి పువ్వేసి సందమామ..

'ఒక్కేసి పువ్వేసి సందమామ.. ఒక్క జాములాయె సందమామ.. రెండేసి పువ్వేసి సందమామ.. రెండు జాములాయె' అంటూ మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. వరంగల్‌లోని చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో శనివారం రాత్రి ఎంగిలి పూల బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకొన్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

నేడే కాంగ్రెస్ తొలి జాబితా

58 మందితో ఫస్ట్ లిస్ట్... 18న మరో జాబితా వచ్చే అవకాశం

రెండు జాబితాలతోనే సరిపెట్టాలని ప్రస్తుతానికి అధిష్టానం నిర్ణయం

2లో

క్లుప్తంగా...

ఈటల, నరేంద్ర, విజయశాంతిని బీఆర్ఎస్ నుంచి వెళ్లగొట్టిందెవరు?

బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని మల్లు రవి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ఈటల రాజేందర్, ఆలె నరేంద్ర, విజయశాంతి లాంటి బీసీ నేతలను బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లగొట్టిందెవరని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత మంత్రి కేటీఆర్‌కు లేదని వ్యాఖ్యానించారు. మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య సహా పార్టీలోని బీసీ నేతలెవ్వరినీ వెళ్లగొట్టలేదని స్పష్టం చేశారు. తనకు టికెట్ వస్తుందో రాదోననే సందేహంతో పొన్నాల పార్టీ వీడి వెళ్లిపోయారని వెల్లడించారు. శనివా రం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చరణ్ కౌశిక్ యాదవ్, లోకేశ్ యాదవ్, బాల లక్ష్మి, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, అధికార ప్రతినిధి రియాజ్, సత్యనారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. బీసీలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, బీసీ నేతలను సీఎంలుగా, పీసీసీ అధ్యక్షులుగా చేసింది కాంగ్రెస్సేనని చెప్పారు.

అన్ని పార్టీలు బీసీలకు 60 టికెట్లు ఇవ్వాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



పంజగుట్ట (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 60 టికెట్లు ఇవ్వాలని, ఈ వర్గాల నేతనే ముఖ్యమంత్రిగా చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ మేనిఫెస్టో –2023 ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అన్ని పార్టీలు వారి కార్యాలయాల్లో మేనిఫెస్టోలు తయారు చేసుకుంటున్నాయని, బీసీల బతుకులు బాగుపడాలంటే వారికి ఏం కావాలో ఆ వర్గాలనే అడగాలని, పార్టీ కార్యాలయాల్లో కూర్చుని రాసుకుంటే సరిపోదని అన్నారు. తాము ఆవిష్కరించిందే నిజమైన బీసీ మేనిఫెస్టో అని స్పష్టం చేశారు. విద్యా, ఉపాధి, సంక్షేమ రంగంలో జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా హక్కుగా ఇవ్వాలని జాజుల డిమాండ్ చేశారు. ఏ పార్టీ బీసీని సీఎంగా చేస్తామని స్పష్టంగా ప్రకటిస్తుందో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

శివసేన తెలంగాణ అధ్యక్షుడు శివాజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో శివసేన ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ తెలిపారు. శనివారం ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి పసుపులేటి గోపీకిషన్ తదితరులతో కలసి ముంబైలోని పార్టీ కేంద్ర కార్య దర్శి అభిజిత్ అడ్సుల్‌ని కలసి తెలంగాణ ఎన్నికల గురించి చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరఫున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను అందజేశారు.

పొన్నాలకు క్షమాపణ చెప్పకపోతే తరిమి కొడతాం

రేవంత్‌పై బీసీ సంక్షేమ సంఘం ఆగ్రహం.. దిష్టిబొమ్మల దహనం

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్యనుద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు ఆసంఘం కార్యకర్తలు, నాయకులు బషీర్‌బాగ్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పొన్నాలపై రేవంత్ వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌ను రెడ్డిభవన్‌గా మార్చి బీసీ నేతలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే రేవంత్‌రెడ్డి పొన్నాలకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాళ్లతో తరిమికొడతామని హెచ్చరించారు.

ఇదండీ సంగతి



మధ్యవర్తిత్వంతో శాంతి నెలకొల్పుతా..!

హిస్టరీ మారుతుందా? హ్యాట్రిక్ కొడుతుందా?



మూడోసారి బీఆర్ఎస్ విజయంపై ఆసక్తికరమైన చర్చ

గతంలో వరుసగా రెండుసార్లే గెలిచిన కాంగ్రెస్, టీడీపీ

అదే ఒరవడిలో 2014, 2018లో బీఆర్ఎస్ విజయం

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదంటున్న విపక్షాలు

ప్రజా వ్యతిరేకత, ఎమ్మెల్యేలపై అసంతృప్తి అడ్డుకట్ట వేస్తుందని అంచనా

ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారనే దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి:

త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు.. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న రెండు టర్మ్‌ల తర్వాత పాలన మార్పు ఒరవడి ఈసారి బ్రేక్ అవుతుందా..? లేక కొనసాగుతుందా..? అనే చర్చకు తావిస్తున్నాయి. 1983లో ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం, కాంగ్రెస్‌లు రెండుసార్లు వరుస విజయాలు సాధించాయి. కానీ మూడోసారి అధికారం చేపట్టడంలో విఫలమయ్యాయి. అయితే మధ్యలో 1989లో ఒకసారి గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ 1994లో మాత్రం రెండోసారి అధికారంలోకి రాలేకపోయింది. కాగా 1983 నుంచి 2014 వరకు కాంగ్రెస్, టీడీపీలకే అధికారం చేజిక్కుతూ వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారం చేపట్టిన టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) రెండోసారి (2018లో) అధికారంలోకి వచ్చింది. తాజాగా 2023 నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గత ఒరవడికి భిన్నంగా వరుసగా మూడో విజయాన్ని బీఆర్ఎస్ నమోదు చేస్తుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే మూడు ప్రధాన పార్టీలూ విజయంపై ధీమా వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

అన్ని ఎన్నికల్లోనూ స్పష్టమైన మెజారిటీ..!

గడిచిన నాలుగు దశాబ్దాల కాలంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ ప్రజలు స్పష్టమైన తీర్పునే ఇచ్చారు. ఎక్కడా అసందిగ్ధతకు తావివ్వలేదు. అయితే ఈసారి ఓ రాజకీయ పార్టీ ప్రముఖుడు తమ అంతర్గత సమావేశంలో మాట్లాడుతూ హంగ్ ఏర్పడుతుందని, అయినా తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని చెప్పడం చర్చనీయాంశమయ్యింది. అయితే తర్వాత ఆ పార్టీ తమ నేత అలా మాట్లాడలేదంటూ హంగ్‌ను కొట్టిపారేసింది. తమ పార్టీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ప్రకటించింది. ఇక మిగతా రెండు ప్రధాన పార్టీలు కూడా హంగ్‌ను కొట్టిపారేయడం గమనార్హం.

బీఆర్ఎస్ నేతల్లో ధీమా

అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి విజయం సాధించడం ద్వారా చరిత్ర సృష్టిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఇతర నేతలు పూర్తి ధీమాతో ఉన్నారు. గత తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని, బంగారు తెలంగాణ దిశగా సాగుతున్న ఈ తరుణంలో కేసీఆర్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని కేటీఆర్ అంటున్నారు. రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోనూ లేవని, దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా మారడం తప్పకుండా సానుకూల ఫలితాన్నిస్తుందని చెబుతున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు హైదరాబాద్ కేంద్ర స్థానంగా మారిందని, బెంగళూరును వెనక్కి నెట్టి ఐటీలో ఉద్యోగాల కల్పన జరుగుతోందని వివరిస్తున్నారు. కేసీఆర్ కూడా తరచూ తలసరి ఆదాయంలో, విద్యుత్ వినియోగంలోనూ దేశంలోనే నంబర్ వన్ తెలంగాణ అని.. సాగు, తాగునీటి రంగాలే కాక గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరిగిందనడానికి కేంద్రం ఇస్తున్న అవార్డులే నిదర్శనం అని నొక్కి చెబుతున్నారు. ఇవన్నీ ఎన్నికల్లో విజయానికి దోహదపడతాయనేది అధికార పక్షం వాదన.

ఢీ అంటే ఢీ అంటున్న మూడు పార్టీలు

గడిచిన రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్యనే ప్రధాన పోటీ ఉండేది. కానీ ఈసారి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ కూడా ప్రధాన పోటీదారుగా ఉండటంతో ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి. ప్రతిపక్షాలు ఎట్టి పరిస్థితుల్లోనూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని ఢంకా బజాయిస్తున్నాయి. సాధారణ ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యేలపై అసంతృప్తి, అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ మూడోసారి అధికార పీఠాన్ని అధిష్టించే అవకాశమే లేదని, తాము గెలుపొందడం ఖాయమనే భావనలో కాంగ్రెస్, బీజేపీలు ఉన్నాయి. విజయ సాధన దిశగా ఎవరికి వారు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ముందుకు సాగే ప్రయత్నం చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలపై అపార నమ్మకం..




అదే సమయంలో తెలంగాణ ఇచ్చిన పార్టీగా, ఆరు గ్యారంటీలతో ఈసారి తాము తప్పనిసరిగా విజయం సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ కూడా విశ్వాసం వ్యక్తం చేస్తోంది. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, అవినీతి, కుటుంబ పాలనతో పాటు నిరుద్యోగులను మోసం చేసిందని ప్రధానంగా ఆరోపిస్తోంది. ప్రభుత్వ భూముల విక్రయంలోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, అనుయాయులకే ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నదని విమర్శిస్తోంది. రాష్ట్రాన్ని పాలించే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తేల్చి చెబుతోంది.

డబుల్ ఇంజన్ నినాదం



రాష్ట్రం, కేంద్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధిలో దూసుకుపోయేందుకు అవకాశం ఉంటుందని బీజేపీ చెబుతోంది. డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో ప్రచారం చేస్తోంది. రాష్ట్రానికి తొమ్మిదేళ్లలో తొమ్మిది లక్షల కోట్ల రూపాయలు కేంద్రం ఇచ్చిందని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద యెత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తోంది. బీసీ నినాదం ఎత్తుకోవడంతో పాటు బీసీలకు అత్యధికంగా టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి చేరువ కావడానికి ప్రయతిస్తోంది. ఉచితాల జోలికి వెళ్లకుండా అభివృద్ధి పథకాలు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టి విజయం సాధించాలనే ఆలోచనలో ఉంది.



నేడు కేసీఆర్‌తో పొన్నాల భేటీ

- బీఆర్ఎస్‌లో చేరాల్సిందిగా కేటీఆర్ ఆహ్వానం
- సూత్రప్రాయంగా అంగీకరించిన పీసీసీ మాజీ చీఫ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య భారత్ రాష్ట్ర సమితిలో చేరేందుకు అంగీకరించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో ఆదివారం ఉదయం జరిగే భేటీ తర్వాత పొన్నాల తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పార్టీ నేతలతో కలిసి శనివారం పొన్నాల నివాసానికి వెళ్లారు. పొన్నాల రాజకీయ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని, బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 16న జనగామలో జరిగే బహిరంగ సభ వేదికపైపార్టీలో చేరాల్సిందిగా ఆహ్వానించారు. కేటీఆర్ ఆహ్వానాన్ని స్వాగతిస్తూ సీఎంతో భేటీ తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని పొన్నాల సమాధానం ఇచ్చారు.

సీనియర్లను రేవంత్ అవమానించారు: కేటీఆర్

కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహించిన సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్యను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించినట్టు ఆయనతో భేటీ అనంతరం కేటీఆర్ విలేకరులకు తెలిపారు. ఆయన పార్టీలోకి వస్తే కె.కేశవరావు, డి.శ్రీనివాస్ తరహాలో సరైన స్థానం కల్పించి గౌరవిస్తామన్నారు. పీవీ నర్సింహారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పొన్నాల లక్ష్మయ్య వంటి సీనియర్ నాయకులను రేవంత్‌రెడ్డి అవమానించారని విమర్శించారు. ఎన్నో పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి.. ఇతరులు తమకు గౌరవం దక్కక పార్టీ బయటకు వెళ్తుంటే తప్పు పడుతున్నారని విమర్శించారు. చచ్చే ముందు పార్టీ మారటం ఏమిటని కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

రేవంత్ కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తున్నారు: పొన్నాల

రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి తాము పార్టీకి, ప్రాంతానికి చేసిన సేవలను కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తూ కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తున్నారని పొన్నాల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన తర్వాత రేవంత్ ఎమ్మెల్యేగా ఓడిపోయారు. ఆయన ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న మల్కాజిగిరి పరిధిలో గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలవలేదు. 2014, 2018లో పొన్నాల లక్ష్మయ్య ఒక్కడే ఓడిపోయాడా? జానారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి ఓడిపోలేదా?..' అని పొన్నాల ప్రశ్నించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలు వాసుదేవరెడ్డి, దాసోజు శ్రవణ్, రాజారాం యాదవ్ తదితరులున్నారు.

'బీ'.. రె'ఢీ'..!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంపీలు, ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఎన్నికలకు సంబంధించిన దిశా నిర్దేశంతో భేటీ ముగిసిన తర్వాత పార్టీ నేతలతో కలిసి కేసీఆర్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అనంతరం హుస్నాబాద్‌లో జరిగే తొలి ఎన్నికల ప్రచార సభకు బయలుదేరి వెళతారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి తెలంగాణ భవన్‌లో శనివారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

119 మంది అభ్యర్థులకు బీ ఫారాలు?

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల పేర్లను సుమారు రెండు నెలల క్రితమే ఆగస్టు 21న కేసీఆర్ ప్రకటించారు. 119 స్థానాలకు గాను 115 మందితో జాబితాను విడుదల చేశారు. వీరిలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడారు. దీంతో పెండింగులో ఉన్న జనగామ, నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్‌తో పాటు మల్కాజిగిరికి కూడా అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగే భేటీలో 114 మందితో పాటు పెండింగ్‌లో ఉన్న మిగతా ఐదు నియోజకవర్గాల అభ్యర్థులకు కూడా కేసీఆర్ బీ ఫారాలు అందజేస్తారని సమాచారం.

పెండింగ్ స్థానాల్లోనూ అభ్యర్థులు ఖరారు?

పెండింగ్‌లో ఉన్న మల్కాజిగిరికి మర్రి రాజశేఖర్ రెడ్డి, జనగామకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సాపూర్‌కు మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డిల పేర్లు ఖరారయ్యాయి. నాంపల్లి నుంచి ఆనంద్‌గౌడ్, గోషామహల్ అభ్యర్థులుగా నందకిషోర్ వ్యాస్ పేర్లు కూడా ఖరారైనట్లు ప్రచారం జరుగుతున్నా వారికి పార్టీ నుంచి ఇంకా సమాచారం అందలేదని తెలిసింది. గతంలో ప్రకటించిన 114 మందిలో ఆలంపూర్ అభ్యర్థితో సహా ఒకరిద్దరి అభ్యర్థిత్వాన్ని మార్చే అవకాశముందనే ప్రచారం కూడా సాగుతోంది. అసంతృప్తి సద్దుమణగక పోవడం, గెలుపు అవకాశాలు, బీసీ సమీకరణాలు దృష్టిలో పెట్టుకుని ఈ మార్పు ఉంటుందని భావిస్తున్నారు.

మేనిఫెస్టో సిద్ధం

ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ, విపక్షాల ఎన్నికల హామీలను కూడా దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ మేనిఫెస్టోను సిద్ధం చేశారు. రైతులు, మహిళలు, యువత, దళిత, గిరిజనులు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని మేనిఫెస్టోకు రూపకల్పన జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జనాకర్షక హామీలతో కూడిన మేనిఫెస్టోను ఆదివారం కేసీఆర్ విడుదల చేయనున్నారు. రైతుబంధు, ఆసరా పింఛను మొత్తం పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ / భారీ సబ్సిడీతో ఇవ్వడం, జర్నలిస్టులకు పింఛను వంటి అంశాలు ఇందులో ఉన్నట్లు సమాచారం.

ప్రచార సభలు, సమన్వయంపై దిశా నిర్దేశం

కేసీఆర్ ఆదివారం నుంచి వచ్చే నెల 9 వరకు 17 రోజుల్లో 41 బహిరంగ సభల్లో ప్రసంగించేలా ఇప్పటికే షెడ్యూలు ఖరారు చేశారు. పోలింగ్ తేదీ నాటికి ఆయన సుమారు వంద సభల్లో పాల్గొనేలా ప్రణాళిక రూపొందించారు. మరోవైపు 54 నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జిలను కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం పార్టీ అభ్యర్థులతో జరిగే సమావేశంలో బహిరంగ సభల నిర్వహణ, జన సమీకరణ, సమన్వయం, ప్రచార అంశాలు తదితరాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తారని తెలిసింది. విపక్ష పార్టీల ఎన్నికల వ్యూహాలు, ప్రచారం తదితరాలపై కూడా పలు సూచనలు చేయనున్నట్టు సమాచారం. కాగా ఆదివారం సాయంత్రం హుస్నాబాద్‌లో జరిగే తొలి ఎన్నికల ప్రచార సభలో మేనిఫెస్టోలోని అంశాలను తొలిసారిగా ప్రజల ముందు పెట్టనున్నారు.

నేడే కాంగ్రెస్ తొలి జాబితా

- 58 మందితో ఫస్ట్ లిస్ట్..
- 18న మరో జాబితా వచ్చే అవకాశం
- రెండు జాబితాలతోనే సరిపెట్టాలని ప్రస్తుతానికి అధిష్టానం నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదలకు ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. గత నెలరోజులుగా అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న అభ్యర్థుల పేర్లను నేడు ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో దాదాపు సగం స్థానాలకు అభ్యర్థులను ఈ జాబితాలో ప్రకటించనుంది. కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఏ సమయంలోనైనా 58 మందితో కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా వస్తుందని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఇంకొక్క జాబితాలోనే మిగిలిన అభ్యర్థులను ప్రకటించాలని కూడా కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఈనెల 18న ఆ జాబితా కూడా వస్తుందని తెలుస్తోంది. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైనా ఒకట్రెండు రోజులేనని, ఈనెల 20లోపు 119 మంది అభ్యర్థుల ప్రకటన పూర్తవుతుందని ఆయా వర్గాలు వెల్లడించాయి. కాగా, అభ్యర్థుల ప్రకటన అంశంలో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఆదివారం 58 మందితో తొలి జాబితా వస్తుందని వెల్లడించడం గమనార్హం.

లెఫ్ట్‌కు 4 సీట్లు.. ఒక ఎమ్మెల్సీ?

- కమ్యూనిస్టులతో పొత్తుపై నేడు కాంగ్రెస్ చర్చలు
- తుది నిర్ణయం వెలువడే అవకాశం
- రాహుల్‌తో భేటీ అయిన తుమ్మల



రాహుల్‌గాంధీని సత్కరిస్తున్న నాగేశ్వరరావు

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. లెఫ్ట్ పార్టీలు పట్టుబట్టినట్లు కాకుండా మధ్యేమార్గంగా చెరో రెండు స్థానాలను కేటాయించేందుకు కాంగ్రెస్ అధిష్టానం సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మునుగోడు, కొత్తగూడెం, మిర్యాలగూడ, భద్రాచలం, హుస్నాబాద్ స్థానాల్లో ఏవైనా నాలుగు స్థానాలను ఉభయ కమ్యూనిస్టులకు కేటాయించే అవకాశం ఉందని అంటున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కమ్యూనిస్టులతో సీట్ల సర్దుబాటుపై చర్చించారు. సీపీఐకి మునుగోడు, కొత్తగూడెం, హుస్నాబాద్‌లలో రెండు స్థానాలు, సీపీఎంకు మిర్యాలగూడ, భద్రాచలం సీట్లు కేటాయించే అంశాన్ని పరిశీలించారు. అయితే భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నందున దీనిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఉభయ కమ్యూనిస్టులు సూచించిన వారికి ఒక ఎమ్మెల్సీ స్థానం ఇచ్చేందుకు కూడా కాంగ్రెస్ చెప్పినట్లు సమాచారం. పొత్తుపై వేణుగోపాల్ నేరుగా కమ్యూనిస్టు పార్టీల పెద్దలతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెబుతున్నారు. అవసరాన్ని బట్టి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర నేతలు ఆదివారం హైదరాబాద్‌లో లెఫ్ట్ పార్టీల నేతలతో చర్చించే అవకాశం ఉంది. ఆ తర్వాతే తుది నిర్ణయం చేసే అవకాశం ఉంది.

ఖమ్మం నుంచి తుమ్మల.. పాలేరు నుంచి పొంగులేటి!

ఖమ్మం జిల్లా నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. సుమారు పది నిమిషాల పాటు జరిగిన సమావేశంలో కమ్యూనిస్టులతో పొత్తు వల్ల కలిసొచ్చే అంశాలపై చర్చించారు. కాగా పాలేరు నుంచి పోటీ చేయాలని తుమ్మల భావించినప్పటికీ రాహుల్ సూచన మేరకు ఖమ్మం నుంచి పోటీ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. పాలేరు నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పోటీ చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

కొడుకును సీఎం చేయడంపైనే ధ్యాస

- తెలంగాణ ఏమైపోయినా ఫర్వాలేదన్నట్టుగా సీఎం కేసీఆర్ తీరు: జి.కిషన్‌రెడ్డి
- వందేమాతరం అనని వారికి ఇక్కడ స్థానం లేదు: కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి



సాక్షి, హైదరాబాద్: తన కొడుకును సీఎం చేయడం తప్ప తెలంగాణ ఏమైపోయినా ఫర్వాలేదన్నట్టుగా సీఎం కేసీఆర్ తీరుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వ్యవసాయం బాగుపడాలంటే సాగునీరు రావాలని, తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాల మీద జరిగిందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసిన నేపథ్యంలో శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుసదస్సులో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయ్యాక ప్రాణహిత చేవెళ్లను రీడిజైనింగ్ పేరుతో రూ.30 వేల కోట్ల బడ్జెట్‌ను రూ.లక్షా 50 వేల కోట్లకు తీసుకెళ్లారని మండిపడ్డారు. అయినా ఆ ప్రాజెక్టుకు ఫీజబిలిటి లేదని, కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి ఉందన్నారు. రూ.20 వేల కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలతో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును రూ.57 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఒక్క పంపు హౌజ్‌ను ప్రారంభించి ఎన్నికల ముందు పాలమూరుకు మొత్తం నీళ్లు ఇచ్చినట్లు మభ్యపెడుతున్నారన్నారు.

చంద్రబాబుకు అమ్ముడుపోయారు: బండి

నాటి ఏపీ సీఎం చంద్రబాబుకు అమ్ముడుపోయి తెలంగాణ ప్రజల నోట్లో మట్టి కొట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు టెండర్ల పేరుతో సీఎంవో రూ. 500 కోట్లు దండుకుని ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. కేసీఆర్ నిర్వాకంవల్ల రూ.40 వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన పౌరసరఫరాల సంస్థను నిండా ముంచేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. 'కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు కాకూడదు.. ప్రజలకు మేలు జరగకూడదన్నదే కేసీఆర్ ఆలోచన. థ్యాంక్స్ చెబితే నీకేమైతుంది? ముత్యాలేమైనా రాలతాయా?'అని అన్నారు.

వారికి స్థానం లేదు: కేంద్రమంత్రి కైలాశ్ చౌదరి

'భారత్ మాతా కీ జై.. వందే మాతరం అనని వారికి ఈ దేశంలో స్థానం లేదు. పాకిస్తాన్ జిందాబాద్ అనే వారు అక్కడికి వెళ్లొచ్చు'అని కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి కైలాశ్ చౌదరి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 24 గంటలు కరెంట్ ఇస్తామని చెప్పి మోసం చేశారని, వచ్చే కొద్దిపాటి కరెంటు కూడా ట్రిప్ అయి వస్తోందని చెప్పారు. 'గతంలో గాంధీ పేరును అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ దోచుకుంది. ఇప్పుడు ఇండియా కూటమి పేరుతో దోచుకోవాలని చూస్తోంది. ఇది ఘమండి, ఘట్ బంధన్ కూటమి'అని మండిపడ్డారు. ఈ సదస్సులో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

నేడు, రేపు పలువురు కేంద్రమంత్రుల పర్యటనలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు కేంద్రమంత్రులు తెలంగాణబాట పట్టారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగే బీజేపీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఆదివారం ముషీరాబాద్ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి మత్స్యకారులతో సమావేశం కానున్నారు. అనంతరం అంబర్‌పేట జరిగే మత్స్య కారుల సమావేశంలోనూ పాల్గొననున్నారు. సోమవారం హుజూరాబాద్ నియోజకవర్గంలో జరిగే జమ్మికుంట బహిరంగసభలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తారని, అదేరోజు మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సభలోనూ పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ మండల బీజేపీ కార్యాలయాన్ని కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ, పశుసంవర్థక శాఖల మంత్రి పురుషోత్తం రూపాలా ప్రారంభించనున్నారు. అనంతరం కల్వకుర్తిలో జరగనున్న బహిరంగ సభలో రూపాలా పాల్గొంటారని తెలియజేశారు.

లక్ష మందితో సభ



హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభా స్థలి

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 20 ఎకరాల విస్తీర్ణంలో లక్ష మందితో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించనున్నారు. 2014, 2018లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ నుంచే కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఆ రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు కూడా తొలి సభను హుస్నాబాద్‌లో నిర్వహించనున్నారు. మంత్రి టి.హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్‌లు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదివారం సాయంత్రం 4 గంటలకు హుస్నాబాద్‌కు చేరుకుని సభలో ప్రసంగిస్తారు.

'వంకర వార్తలు రాస్తే, సక్కగ జేయుండ్రి'

జర్నలిస్టులపై ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'ఈ మీడియాలో కొంతమంది వాళ్లు, వీళ్లు వంకర వార్తలు రాసేటోళ్లందరితో కూడా మీరు మాట్లాడండి, ఈ 45 రోజులు ఎవడూ వంకర వార్తలు రాయకుండా, వాడ్ని సక్కగ జేయుండ్రి'అంటూ జర్నలిస్టులనుద్దేశించి చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ 'వంకర వార్తలు రాసే వారిని సక్కగ చేసేందుకు ఏం చేయాలో అది చేయండి. ఆలోచించేది లేదు, పట్టణ అధ్యక్షులు, ఇతర నాయకులు కలసి ఎట్లా చేస్తారో, ఏం చేస్తారో అది చేయండి'అని వ్యాఖ్యానించారు. శనివారం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జర్నలిస్టులు ఎమ్మెల్యేపై మండిపడుతున్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సుమన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు జరిగాయి.


హార్వర్డ్ వర్సిటీ నుంచి కేటీఆర్‌కు ఆహ్వానం

ఇండియా కాన్ఫరెన్స్ 21వ ఎడిషన్‌లో ప్రసంగించాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన బోస్టన్ యూనివర్సిటీలో వచ్చే సంవత్సరం జరిగే ఇండియా కాన్ఫరెన్స్‌లో మాట్లాడేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.టి.రామారావుకు ఆహ్వానం అందింది. 2024 ఫిబ్రవరి 18న హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగే ఇండియా కాన్ఫరెన్స్ 21వ ఎడిషన్‌లో ఫైర్‌సైడ్ చాట్‌లో మాట్లాడేందుకు కేటీఆర్‌ను ఆహ్వానించారు. 'ఇండియా రైజింగ్: బిజినెస్, ఎకానమీ, కల్చర్' అనే అంశంపై ఈ కాన్ఫరెన్స్ సాగనుంది. 'ఇటీవలి కాలంలో తెలంగాణ సాధించిన వృద్ధిలో చూపిన ప్రభావవంతమైన నాయకత్వం, పోషించిన పాత్ర, తెలంగాణను పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా నిలబెట్టడం, మాకు గొప్ప ప్రేరణగా నిలుస్తుంది' అని ఈ సందర్భంగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వాన



లేఖలో హార్వర్డ్ విశ్వవిద్యాలయం పేర్కొంది. విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, నాయకులు, విధాన నిపుణులతో సహా 1,000 మంది భారతీయ ప్రవాస సభ్యులు ఈ సదస్సులో పాల్గొంటారు. కాగా, హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందడం పట్ల మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు.



కవిత నోట.. బతుకమ్మ పాట

సాక్షి, హైదరాబాద్: భారత జాగృతి రూపొందించిన బతుకమ్మ పాటల ఆల్బమ్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. మొత్తం 10 పాటలున్న ఈ ఆల్బమ్‌ను యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఇందులో ఒక పాటకు కవిత కోరస్ ఇవ్వడం విశేషం. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ఘనంగా జరుపుకొనే పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. మన ఆడబిడ్డల ఆత్మీయ సంగమం, తెలంగాణ ఆత్మగౌరవ సంబరం బతుకమ్మ అని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సెర్ప్ సీఈవోగా సుల్తానియా

- అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు గ్రామీణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవోగా రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. ఆయనతో మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శ్రుతి ఓఝాకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, కమిషనర్‌గా.. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు చేనేత, జౌళి శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేయాల్సి రావడంతో, వారి స్థానంలో ఈ మేరకు ఇన్‌చార్జి అధికారులను నియమించారు.







"దూరములో నున్న సహోదరుని కంటె దగ్గరనున్న పొరుగువాడు వాసి.
– క్రైస్తవ ధర్మం

మార్చింగ్ సాంగ్



నూరు గొడ్లను తిన్న ఒకానొక రాబందు ఓ చిరుగాలి వానకు గాయ పడిందట! ఈ గాయం ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదమట! కానీ, గాయపడిన పిట్టల కోసం, రాలిపడిన పువ్వుల కోసం పరితపించడం మాత్రం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమట! పిట్టల గాయాలు మాన్పి నింగి లోకి ఎగరేయడం నేరమట! రాలిన పువ్వులను మాల కూర్చి మందిరానికి చేర్చడం పాపమట! తీతువులు నీతులు చెబుతున్నాయ్. గ్రద్దలు క్రుద్ధమవు తున్నాయ్. తోడేళ్ల తొడలు చరుస్తున్నాయ్!

ఆంధ్రప్రదేశ్ పెత్తందారీ వ్యవస్థ నేడు ప్రజాస్వామ్య పాఠాలను బోధిస్తున్నది. దాని తాబేదార్లు తందానా అంటున్నారు. పెత్తందారీ ప్రజా స్వామ్యం కోసం వందిమాగధులు, భజంత్రీలు సహస్ర గళార్చన చేస్తున్నారు. రాబందుల స్వేచ్ఛపై ఆంక్షలేమిటి? రామోజీల 'చీట్'లకు ఆటం కాలేమిటని ప్రశ్నిస్తున్నారు. తోడేళ్ల మందలు స్వైర విహారం చేసినంత మాత్రాన బంధిస్తారా? ప్రభుత్వ పెద్దలు ఖజానాకు కన్నం వేస్తే అరెస్టు చేస్తారా? అని కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి గ్రహణం పట్టిందని గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఊరేగుతున్నారు.

ఇప్పుడక్కడ ఒక ప్రజాస్వామ్య యుద్ధం జరుగుతున్నది. కులం, మతం, ప్రాంతం, జాతి, స్త్రీ–పురుష వివక్ష లేకుండా భారత రాజ్యాంగం ప్రజలందరికీ ప్రసాదించిన హక్కులను వారికి దఖలు పరచడానికి, ఆదేశిక సూత్రాలను శిరసావహించడానికి అక్కడి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ప్రతిపక్షం, దాని తైనాతీల రూపంలో ఘనీభవించిన పెత్తందారీ వ్యవస్థ ఈ ప్రయత్నాలను అడ్డుకుంటున్నది. దాని దశకంఠాలు రణరంకెలు వేస్తున్నయ్. దాని వేయి చేతులు కత్తులు దూస్తున్నయ్. పేద ధనిక తేడా లేకుండా పుట్టిన ప్రతిబిడ్డ ఆనందంగా ఆరోగ్యంగా పెరగడం కోసం, ఉన్నత లక్ష్యాల వైపు స్వేచ్ఛగా పరుగెత్తగలగడం కోసం, అందలాలు అందుకోవడం కోసం సమానావకాశాలుండాలని రాజ్యాంగం వాంఛించింది. ఆ వాంఛితానికి వాస్తవ రూపు కట్టడం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. పెత్తందారీ వ్యవస్థ ప్రయోజనాలకు ఈ ప్రయత్నాలు వ్యతిరేకం. కనుకనే తెలుగుదేశం – యెల్లో మీడియాల సేనాధిపత్యంలో మోహరించిన పెత్తం దారీ వ్యవస్థ యుద్ధం ప్రకటించింది. అందుకే రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పోరాటాన్ని 'క్లాస్ వార్'గా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు.

'వర్గ పోరాటానికి' తన సేనావాహినిని సమాయత్తం చేస్తూ ఈ వారం విజయవాడలో వైఎస్ జగన్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలం, ఆ పైస్థాయి పార్టీ నేతలందరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'మీరే నా సేనాపతులు. మీరే నా దళపతులు'... అంటూ ఈ సమావేశంలో ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. నిజానికది ప్రసంగం కాదు. ఒక మార్చింగ్ సాంగ్. కవాతు గీతం. 'పదండి ముందుకు, పదండి తోసుకు... పోదాం పోదాం పైపైకి! కదం తొక్కుతూ పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ' అని శ్రీశ్రీ చెప్పినట్టుగా సాగిందా ప్రసంగ పాఠం. ప్రజలందరికీ సమాన హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం తన ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'మాగ్నా కార్టా'పై ఆయన తన దళపతులకు సంపూర్ణ అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.

నా... నా... నా... నా... నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు, నా అగ్రకులాల పేదలు అని పదేపదే సంబోధిస్తూ ఆయన తన పొలిటికల్ ఫిలాసఫీని ఘంటాపథంగా ప్రకటించారు. ఆ ఫిలాసఫీని పార్టీ నాయకశ్రేణుల మెదళ్లలోకి బలంగా జొప్పించే ప్రయత్నం చేశారు. గడిచిన ఎన్నికల్లో మేనిఫెస్టో రూపంలో ప్రకటించిన 'మాగ్నాకార్టా'ను 99 శాతం అమలు చేశామని ఆయన ఈ సభలో ప్రకటించారు. ''ఈ 52 మాసాల్లో మనం చేసిన మంచే మన బలం... మన ధైర్యమని చెబుతూ ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్న నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాం. దేవుడి దయ మనకు తోడుగా ఉన్నది. చేసిన అభివృద్ధి కళ్లెదుట కనిపిస్తున్నది. కనుక 'వై నాట్ 175' అనేది మన లక్ష్యం కావాల''ని పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచే ప్రయత్నం చేశారు.

ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలుచేస్తూ సాగిన ఐదేళ్ల పదవీ కాలానికి ఒక వినూత్నమైన క్లైమాక్స్ సన్నివేశాన్ని ప్రజా ఉద్యమ రూపంగా మలిచి ఆయన పార్టీ శ్రేణుల ముందుంచారు. ఈ ఉద్యమం నాలుగు రూపాల్లో సంక్రాంతి పండుగ దాకా కొనసాగుతుంది. ఆ తర్వాత పెన్షన్ల పెంపుతో సహా మరో మూడు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖాన్ని పూరించబోతున్నది. ఈ నాలుగంచెల ఉద్యమంలో భాగంగా పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ, ప్రతి ఓటరుకూ చేరువవుతాయి. 'మా పరిపాలనలో మీ ఇంట్లో మంచి జరిగితేనే మాకు ఓటేయండ'ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఒక్క మాటతోనే ఆయన పార్టీ సగం యుద్ధాన్ని గెలిచింది. అదే సందేశాన్ని పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటి గడప ముందు వినిపిస్తారు.

క్లైమాక్స్‌లోని మొదటి ఉద్యమ రూపం – 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం'. ఇది ప్రారంభమై పదిహేను రోజులు విజయవంతంగా నడిచింది. ఇంకో ఇరవై ఐదు రోజులు కొనసాగుతుంది. ఇందులో భాగంగా పదిహేను వేల ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామాన్నీ, ఇంటినీ జల్లెడపడుతున్నారు. ఈ శిబిరాలు అందరికీ పరీక్షలు చేసి, సమస్యలున్నవారికి మందులు ఇవ్వడానికి మాత్రమే పరిమితం కావడం లేదు – జబ్బులున్న వారినీ, దీర్ఘకాలిక రోగా లున్నవారినీ కూడా గుర్తించి వారికి చేయూతనిచ్చి రోగం నయమయ్యే దాకా నిలబెట్టే కార్యక్రమాన్ని కూడా డిజైన్ చేశారు.

ఈ శిబిరాలు జరిగినన్ని రోజులు ఊరూవాడా అంతటా ఆరోగ్య రంగంపై చర్చ జరుగుతుంది. ప్రభుత్వ వైద్య సేవలు నాడు ఎలా ఉన్నాయి, నేడు ఎలా ఉన్నాయనే చర్చ జరుగుతుంది. యాభై వేలకు పైగా వైద్య సిబ్బందిని కొత్తగా నియమించడం, ఊరూరా వెలసిన ఆరోగ్య కేంద్రాలు, పటిష్ఠమైన పీహెచ్‌సీలు, అందు బాటులోకి ఫ్యామిలీ డాక్టర్ పథకం, అంబులెన్స్ సర్వీసులు, కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు వగైరా విషయాలన్నింటిపై జనంలో చర్చ జరుగుతుంది. వారికి అవగాహన పెరిగి, వైద్య సేవలను గరిష్ఠంగా వినియోగించు కోగలుగుతారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' అనేది రెండో దశ కార్యక్రమం. ఇది కూడా నలభై రోజుల దీక్ష. ఇందులో కూడా పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటి తలుపునూ తడతారు. ఐదేళ్లలో వచ్చిన మార్పులను గుర్తు చేస్తారు. పరిపాలనా వికేం ద్రీకరణనూ, కొత్త జిల్లాలను, గ్రామ సచివాలయాలను, వలంటీర్ వ్యవస్థను, వాటి ప్రయోజనాలనూ గుర్తు చేస్తారు. చేరువైన ఆరోగ్య రంగాన్నీ, మెరుగైన విద్యా వ్యవస్థనూ పరిశీలించాలని చెబుతారు. ఆ ఊరికి కొత్తగా వచ్చిన ఆర్‌బీకే సెంటర్లనూ, వాటి ప్రయోజనాలనూ వివరిస్తారు. మొత్తంగా ఆ ఇంటికీ, ఊరికీ, ఆ ప్రాంతానికీ జరిగిన మేలును విడమర్చి చెబుతారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వాల పనితీరును తులనాత్మక పరిశీలనకు పెడతారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులంతా పాల్గొనే సామాజిక బస్సు యాత్రలు రెండు మాసాలపాటు సాగుతాయి. సామాజిక న్యాయానికి జగన్ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత, వేసిన పెద్దపీట ఈ యాత్రలలో హైలైట్ అవుతుంది. రాజకీయ ఆర్థిక ఆధ్యాత్మిక విద్యా రంగాల్లో ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన సామాజిక న్యాయం, బాబు హయాంలో జరిగిన దురన్యాయాలు చర్చకు వస్తాయి. 'ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుం టారు? బీసీలు జడ్జీలుగా పనికిరారు, బీసీల తోకలు కత్తిరిస్తా..' అనే భావజాలానికీ, 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ' అనే భావ జాలానికీ మధ్య ఉన్న తేడాను జనం గుర్తిస్తారు. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా' అనే పురుషాహంకారానికీ, మహిళా సాధికా రత స్వరానికీ మధ్య గల తేడాను ప్రజలు అర్థం చేసుకుంటారు. ఆఖరి దశలో జరిగే 'ఆడుదాం ఆంధ్రా' అనే కార్యక్రమం ఒక యువ చేతనా ఉద్యమం. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా క్రీడా రత్నాలను వెలికితీసే యజ్ఞం. లక్షలాదిమంది యువకులు ప్రత్యక్షంగా ఈ యజ్ఞంలో పాల్గొంటారు. ఎన్ని కల ప్రచారానికి ముందు ఐదేళ్ల పాలనా కాలానికి వైసీపీ అధినేత రూపకల్పన చేసిన భారీ క్లైమాక్స్ సన్నివేశం ఇది. ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రతి గడప తొక్కడానికీ, ప్రతి గుండెను తడమడానికీ ఎంత ధైర్యం కావాలి? 'నేను మంచి చేసి ఉంటేనే నాకు ఓటేయండి' అని చెప్పడానికిఎంత నైతిక స్థైర్యం కావాలి? ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో ముందుకెళుతున్న వైసీపీ ప్రభు త్వంతో తలపడేందుకు ప్రతిపక్ష శిబిరం దగ్గర ఉన్నదేమిటి?

అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా అవినీతికి పాల్పడి చట్టానికి దొరికిపోయి సెంట్రల్ జైల్లో సేద తీరుతున్న అధినాయకుడు. తండ్రి అరెస్టు తర్వాత పార్టీ శ్రేణులకు ధైర్యం ఇచ్చి నిలబడకుండా ఢిల్లీకి పారిపోయిన వార సుడు. నాయకుడు చేసిన అవినీతి గురించి వాదనలొద్దు, గవర్నర్ అనుమతి తీసు కోలేదు కనుక కేసు కొట్టేయాలని వాది స్తున్న ఖరీదైన లాయర్లు. ఒక సిద్ధాంతం, నిబద్ధత, మాట నిలకడ, విలువల కట్టు బాటు వంటివేమీ లేని ఒక నట భాగ స్వామి. ప్రతిపక్ష నేత సొంత పార్టీ కోమాలోకి జారుకోగా ఆయన సొంత కులం వారిని రెచ్చగొట్టి ఏవో కొన్ని కార్య క్రమాలను మమ అనిపిస్తున్న కోటరీ... ఇదీ ప్రస్తుత టీడీపీ, దాని మిత్ర పక్షాల పరిస్థితి. పెత్తందారీ శిబిరానికి అర్థబలం, అంగబలం దండిగానే ఉండ వచ్చు గాక. కానీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో దానికి నైతిక బలం హీనదశలో ఉన్నది. సాను భూతి కోసం నాటకాలాడే దుఃస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. పేదవర్గాలు చైత న్యంతో మెలిగితే మరో ఐదేళ్లలో ఆ వర్గాల సాధికారత ఇంకో వంద రెట్లు పెరుగు తుంది. ✧

'వర్గ పోరాటానికి' తన సేనావాహినిని సమాయత్తం చేస్తూ ఈ వారం విజయవాడలో వైఎస్ జగన్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలం, ఆ పైస్థాయి పార్టీ నేతలం దరూ ఈ సమావేశానికి హాజరయ్యారు. 'మీరే నా సేనాపతులు. మీరే నా దళపతులు'... అంటూ ఈ సమావేశంలో ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. నిజానికది ప్రసంగం కాదు. ఒక మార్చింగ్ సాంగ్. కవాతు గీతం. 'పదండి ముందుకు, పదండి తోసుకు... పోదాం పోదాం పైపైకి! కదం తొక్కుతూ పదం పాడుతూ హృదం తరాళం గర్జిస్తూ' అని శ్రీశ్రీ చెప్పినట్టుగా సాగిందా ప్రసంగ పాఠం. ప్రజలందరికీ సమాన హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం తన ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'మాగ్నా కార్టా'పై ఆయన తన దళపతులకు సంపూర్ణ అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.
నా... నా... నా... నా... నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు, నా అగ్రకులాల పేదలు అని పదేపదే సంబోధిస్తూ ఆయన తన పొలిటికల్ ఫిలాసఫీని ఘంటాపథంగా ప్రకటించారు.



జనతంత్రం

వర్ధెల్లి మురళి

బీసీ 'కమలం'!



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే నాటికి తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ మూడో స్థానంలో ఉన్నది. కర్ణాటక ఎన్నికలకు ముందు కొంతకాలంపాటు అది రెండో స్థానంలో ఉన్న భావన కనిపించింది. రాష్ట్రంలో ఉన్న బలమైన పునాది కారణంగా కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఉత్తేజంతో వేగంగా కోలుకొని, బీజేపీని వెనక్కు నెట్టి, రెండో స్థానాన్ని ఆక్రమించింది. ఇంకొన్ని ఇతర కారణాలు కూడా ఈ పరిణామానికి దోహదపడి ఉండవచ్చు.

ఇప్పుడున్న వరసక్రమం – బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ. ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఇదే క్రమం కొనసాగుతుందా? కచ్చితంగా చెప్పడం కష్టం. వరస మారడానికి అవకాశాలు పుష్కలం. గడచిన కొన్నేళ్లుగా బీజేపీ సృష్టిస్తున్న రాజకీయ సంచలనాలను గమనంలోకి తీసుకుంటే ఆ పార్టీ మన అంచనాలను తలకిందులు చేయగల అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయ లేము. ఇంతకుముందు రెండుసార్లు (1998, 2019) జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఇరవై శాతం ఓట్లను తెలంగాణలో సాధించింది. కానీ అసెంబ్లీ ఎన్నికల్లోనే ఆ పార్టీ పూర్తిగా చతికిలబడుతూ వస్తున్నది.

ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచీ కూడా మన దగ్గర ముఖాముఖి పోటీలకే ప్రాధాన్యత లభించడం చూస్తున్నాం. 1978లో రెడ్డి కాంగ్రెస్, 2009లో ప్రజా రాజ్యం బలంగా ముందుకొచ్చినా ఇరవై శాతం ఓట్లను దక్కించుకోలేదు. ఒక్క టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మాత్రమే ఈ ప్రాంతంలో మూడో పక్షానికి ఆదరణ లభించడం మొదలైంది. గత రాజకీయ చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించిన బీజేపీ నాయకత్వం, ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నప్పటికీ పోలింగ్ నాటికి బలంగా ముందుకు రాగల అవకాశాలున్నాయని గుర్తిం చింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రెండుమార్లు ఇరవై శాతానికి పైగా ఓట్లు సాధించిన అనుభవాన్ని బట్టి, రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించే ఛాన్స్ ఉన్నట్టయితే అంతకంటే ఎక్కువ ఓట్లు రాబట్టడం కష్టం కాదని ఆ పార్టీ అంచనా వేస్తున్నది.

ప్రస్తుతం నెలకొన్న ముక్కోణ పోటీ పరిస్థితుల్లో తమ మూడో కోణాన్ని బీసీ కోణంగా మలచడం ద్వారా సంచలనం సృష్టించాలనే నిర్ణయానికి బీజేపీ వచ్చినట్టు సమాచారం. అధికార బీఆర్ఎస్‌కు వందమందికి పైగా సిటింగ్ ఎమ్మెల్యేలున్న కారణంగా టిక్కెట్ల పంపిణీలో ప్రయోగాలు చేసే అవకాశం దానికి లేకుండా పోయింది. కాంగ్రెస్‌కు ప్రయోగాలు చేసే అవకాశం ఉన్నది. 34 మంది బీసీలకు టిక్కెట్లు ఇవ్వబోతున్నట్టు కూడా ఆ పార్టీ నేతలు ప్రకటిం చారు. కానీ ఇప్పుడు వెలువడుతున్న సూచనలను బట్టి ఆ పార్టీ మాట నిలబెట్టుకునే అవకాశాలు దాదాపుగా లేవని తెలుస్తున్నది. టిక్కెట్లు ఇవ్వక పోగా బీసీ నాయకుల పట్ల కాంగ్రెస్ నాయకత్వం ఈసడింపు ధోరణితో వ్యవహరిస్తున్నదనే వార్తలు గుప్పుమంటున్నాయి.

కొద్దిరోజుల క్రితం రేణుకా చౌదరి నేతృత్వంలో కమ్మవారి ప్రతినిధుల బృందం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలవడానికి వెళ్లింది. ఆగమేఘాల మీద వారికి పార్టీ అగ్రనేతల అపాయింట్‌మెంట్లు లభించాయి. సుమారు 40 నియోజకవర్గాల్లో ఫలితాలను తారుమారు చేసే శక్తి తమ వర్గానికి ఉన్నదనీ, కనీసం పది సీట్లయినా తమకు కేటాయించాలని కోరారట! ఆరు స్థానాల వరకు కేటాయించడానికి అధిష్ఠానం సుముఖత వ్యక్తం చేసినట్టు వార్తలొ చ్చాయి. రెండు శాతం జనాభా గల బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ఆరు సీట్లు ఆఫర్ చేసిన అధిష్ఠానం 54 శాతం జనాభా గల తమకెంత రాచమర్యాదలు చేస్తుందోనని ఊహించుకుని బీసీ నేతలు కొందరు ఢిల్లీ బాట పట్టారు.

వారం రోజులపాటు ఢిల్లీ ఫుట్‌పాత్‌ల మీద కాలక్షేపం చేయడం తప్ప వీరికి అగ్రనేతల దర్శనభాగ్యం మాత్రం లభించలేదు. నానా తంటాలు పడి కాళ్లావేళ్లా పడ్డ మీదట కేసీ వేణుగోపాల్ అనే ప్రధాన కార్యదర్శి ఓ పది నిమిషాలు టైమిచ్చాడట! ఇద్దరు మాజీ ఎంపీలు, ఇతర కీలక బాధ్యతలు వెలగబెట్టిన ప్రముఖ బీసీ నేతలు ఈ బృందంలో ఉన్నారు. ఈ ప్రతినిధులకు మాట్లాడే అవకాశం ఏమాత్రం ఇవ్వకుండానే వేణుగోపాల్ విరుచుకు పడ్డాడని సమాచారం. 'మీకు టిక్కెట్లిస్తే గెలవరు. మీలో పెద్దపెద్ద నాయ కులకు సైతం డిపాజిట్లు రావు. పార్టీ గెలవాలని ఉందా? లేదా? గెలవాలనుకుంటే సర్దుకుపోండి' అంటూ విసుక్కున్నాడట! పొన్నాల లక్ష్మయ్యను సస్పెండ్ చేసి పారేస్తానని కూడా వేణుగోపాల్ హెచ్చరిం చాడట! అదృష్టవశాత్తు ఈ బృందంలో పొన్నాల లేరు. బృంద సభ్యులు అవమాన భారంతో తలలు వంచుకొని వెనుదిరగడం తప్ప మాట్లాడే అవకాశం మాత్రం లభించలేదు.

45 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ అనుబంధాన్ని నిన్న పొన్నాల తెంచే సుకున్నారు. అవమాన భారంతో గుండె మండిపోయిన తర్వాతనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. పీసీసీ అధ్యక్షుని అపాయింట్ మెంట్ కోసం ఏడాది పాటు ప్రయత్నించినా పొన్నాలకు చేదు అనుభవమే మిగిలిందని ఆయన అనుచరులు వాపోయారు. ఢిల్లీలో పది రోజుల పాటు కాళ్లరిగేలా తిరిగినా పొన్నాలకు ఏ నాయకుడి అపాయింట్‌మెంటూ దొరకలేదు. అమెరికాలో ఉన్నతో ద్యోగం చేస్తూ 1980లోనే ఇండియా వచ్చి కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తి పొన్నాల. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, పన్నెండేళ్లు మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్‌కు మొట్ట మొదటి అధ్యక్షుడు. అటువంటి వ్యక్తికి జరిగిన సత్కారాన్ని చూసి పార్టీలోని బీసీ నేతలు ఖిన్నులవుతున్నారు. కాంగ్రెస్ పార్టీలోని యువ నాయకు లకు ఫోన్లు చేసి మరీ 'ఈ పార్టీలో బీసీలకు భవిష్యత్తు లేదు. బీజేపీలోకో, బీఆర్ఎస్‌లోకో వెళ్లండ'ని సీనియర్ బీసీ నేతలు సలహా ఇస్తున్నారు.

ఈ రాజకీయ వాతావరణాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవా లని బీజేపీ ఒక నిర్ణయానికి వచ్చింది. 54 శాతం జనాభా ఉన్న బీసీ బాణాన్ని తన ప్రధానాస్త్రంగా ప్రయోగించేందుకు ఆ పార్టీ సమాయత్తమవుతున్నది. దేశానికి మొట్టమొదటి బీసీ ప్రధానమంత్రిని అందించిన పార్టీ తమదేనని ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. పార్టీ సంస్థాగత పదవుల్లో బీసీలకు ప్రాధాన్యతను ఇవ్వడం ప్రారంభించింది. బీసీ వర్గానికి చెందిన డాక్టర్ కె. లక్ష్మణ్ గతంలో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా పనిచేయడమే గాక ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఓబీసీ మోర్చాకు అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక చేయించి పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యునిగా నియమించారు. దేశవ్యాప్తంగా పదమూడు మంది మాత్రమే ఉండే ఈ బోర్డులో స్థానం దక్కడం ఒక అరుదైన గౌరవం. మొన్నటివరకూ రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన బండి సంజయ్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈటల రాజేందర్‌కు ప్రధానమైన ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ పదవి లభించింది. ఈటల ఆధ్వర్యంలో జరిగిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభ విజయం సాధించడంతో బీజేపీలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ ఎన్నికల్లో బీసీ అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమైంది.

పార్టీ అంతర్గత లెక్కల ప్రకారం ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా ఆరేడు స్థానాల్లో బీజేపీ సులభంగా గెలవగలుగుతుంది. అంటే అక్కడ పార్టీ మొదటి స్థానంలో ఉన్నట్టు లెక్క. మరో పదిహేను నుంచి ఇరవై స్థానాల్లో రెండో స్థానంలో ఉన్నట్టు ఆ పార్టీ భావిస్తున్నది. నాలుగు నుంచి ఎనిమిది శాతం వరకు అదనపు ఓట్లను పొందగలిగితే ఈ రెండో స్థానం సీట్లను గెలవగలుగుతుంది. ఎకాయెకిన అన్ని ఓట్లను అదనంగా సంపాదించే మార్గం బీసీ మంత్రమేనన్న అభిప్రాయంతో బీజేపీ వ్యూహం రూపొంది స్తున్నట్టు తెలుస్తున్నది. వ్యూహం ఫలిస్తే బీజేపీ ఖాతాలో పాతిక సీట్లు పడతాయి. పాతిక సీట్లు గెలిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన గేమ్ తన చేతిలోనే ఉంటుందని దాని అంచనా. మెజారిటీ స్థానాల్లో పార్టీ మూడో స్థానంలోనే ఉన్నందువల్ల ప్రయోగాలు చేయడానికి ఎటువంటి ఇబ్బందీ లేదు. బలంగా ఉన్న 25 సీట్లతోపాటు మిగిలిన అన్‌రిజర్వ్‌డు సీట్లతో కలిపి నలభై స్థానాలకు పైగా బీసీలకు కేటాయించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్టు భోగట్టా.

మొట్టమొదటిసారిగా ఒక బీసీ ప్రధానమంత్రి, కేంద్ర మంత్రిమం డలిలో ఎన్నడూ లేనివిధంగా 27 మంత్రి పదవులూ, పార్టీ పరంగా సంస్థా గత పదవులతోపాటు ఎక్కువ ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించిన పార్టీగా ప్రచారం చేసుకుని బీసీ ఓటర్లలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. తెలంగాణలో జనసంఖ్య పరంగా వరసగా ముదిరాజ్ – గంగపుత్ర, యాదవ – కురుమ, గౌడ, మున్నూరు కాపు, పద్మశాలి, రజక, వడ్డెర బలమైన కులాలు. ముదిరాజ్, మున్నూరు కాపు వర్గాల్లో బీజేపీకి ఇప్పటికే బలమైన నాయకత్వం, పలుకుబడి ఉన్నాయి. ఎమ్మెల్యే టిక్కెట్లను అధికంగా కేటాయించడం ద్వారా మిగిలిన కులాల్లో ప్రాబల్యం సంపాదించడానికి ఆ పార్టీ ప్రయత్నించవచ్చు. యాదవ కులానికి చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లును అత్యంత ప్రాధాన్యత కలిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

సాధారణంగా సామాజిక వర్గా లను ఆకర్షించడానికి రెండు మూడు నెలల ముందు చేసే ప్రయత్నాలు ఫలించవు. కానీ కాంగ్రెస్ పార్టీ వ్యవ హార శైలిని అనుకూలంగా మలచు కోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. పొన్నాల రాజీనామాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పందించిన తీరు బీసీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాం శంగా మారింది. రెండు శాతం జనాభా గల అగ్రవర్ణానికి అడిగిందే తడవుగా అగ్రనేతల అపాయింట్ మెంట్ లభించడం, బీసీ వర్గాల్లో దశాబ్దాల అనుభవం గల నాయ కులకు కూడా దర్శనం దొరక్క పోవడంపై విస్తృతంగా చర్చ జరుగు తున్నది. ఈ చర్చ ఎటు దారితీస్తుందో వేచి చూడాలి.

ప్రస్తుతం నెలకొన్న ముక్కోణ పోటీ పరిస్థితుల్లో తమ మూడో కోణాన్ని బీసీ కోణంగా మలచడం ద్వారా సంచలనం సృష్టిం చాలనే నిర్ణయానికి బీజేపీ వచ్చినట్టు సమాచారం. అధికార బీఆర్ఎస్‌కు వందమందికి పైగా సిటింగ్ ఎమ్మెల్యేలున్న కార ణంగా టిక్కెట్ల పంపిణీలో ప్రయోగాలు చేసే అవకాశం దానికి లేకుండా పోయింది. కాంగ్రెస్‌కు ప్రయోగాలు చేసే అవకాశం ఉన్నది. 34 మంది బీసీలకు టిక్కెట్లు ఇవ్వబోతున్నట్టు కూడా ఆ పార్టీ నేతలు ప్రకటించారు. కానీ ఇప్పుడు వెలువడుతున్న సూచన లను బట్టి ఆ పార్టీ మాట నిలబెట్టుకునే అవకాశాలు దాదాపుగా లేవని తెలుస్తున్నది. టిక్కెట్లు ఇవ్వక పోగా బీసీ నాయకుల పట్ల కాంగ్రెస్ నాయకత్వం ఈసడింపు ధోరణితో వ్యవహరిస్తున్నదనే వార్తలు గుప్పుమంటున్నాయి.
... సాధారణంగా సామాజిక వర్గాలను ఆకర్షించడానికి 2, 3 నెలల ముందు చేసే ప్రయత్నాలు ఫలించవు. కానీ కాంగ్రెస్ వ్యవహార శైలిని అనుకూలంగా మలచుకోవాలని బీజేపీ ప్రయత్ని స్తున్నది. పొన్నాల రాజీనామాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పందించిన తీరు బీసీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

vardhelli1959@gmail.com

రేవంత్‌రెడ్డి (పీసీసీ ప్రెసిడెంట్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు



గాంధీ భవన్‌లో మా మీటింగ్ ఎంతకూ మొదలు కావడం లేదు! నా పక్కన భట్టి విక్రమార్క ఉన్నారు. మాకు ఎదురుగా మాణిక్‌రావ్ ఠాక్రే, దీపాదాస్ మున్షీ, మీనాక్షీ నటరాజన్, పెద్దలు కె. జానారెడ్డి గారు కూర్చొని ఉన్నారు. ఆ నలుగురూ ఏఐసీసీ పంపిన 'టికెట్ కమిటీ' సభ్యులు.

టికెట్ ఎవరికివ్వాలి, ఎవరికి ఇవ్వకూడదు, టికెట్ ఇవ్వనివారికి వేరే ఏం ఇవ్వాలి.. ఇవన్నీ ఫైనల్ చేయడానికి వాళ్లు గాంధీ భవన్‌కి చేరుకుని చాలాసేపే అయింది. వారి నిర్ణయాలకు మర్యాద ఇచ్చి, తద్వారా ఏఐసీసీ ప్రెసిడెంట్ ఖర్గేజీ మర్యాద కాపాడటం పీసీసీ అధ్యక్షుడిగా నా ధర్మం. సీఎల్పీ లీడర్‌గా భట్టి విక్రమార్క ధర్మం కూడా! అందుకే ముందుగా మాట్లాడే చొరవను మేమిద్దరం కూడా ప్రద ర్శించలేకపోతున్నాం.

మాణిక్‌రావు మహారాష్ట్ర నుంచి, దీపాదాస్ పశ్చిమ బెంగాల్ నుంచి, మీనాక్షి మధ్యప్రదేశ్ నుంచి వచ్చారు. పెద్దలు జానారెడ్డి గారు ఇక్కడి వారే కనుక, అంతంత దూరాల్నుంచి ప్రయాణం చేసి అలసిపోయి ఆయనేమీ రాలేదు కనుక.. ఈ మీటింగ్‌ని ఆయన ప్రారంభించవచ్చు కానీ, ఎంచేతనో ప్రారంభించడం లేదు! పైగా... "ఊ.. మొదలు పెట్టండి.." అన్నట్లుగా నా వైపు, భట్టి వైపు చూస్తూ కూర్చున్నారు. అది ఆయన మా పట్ల ప్రదర్శిస్తున్న మర్యాద కావచ్చు.

సమయం గడుస్తోంది. గడవడమే కాదు.. "సమయం లేదు మిత్రమా..." అని బాలయ్య బాబో, బాబు గారో ఏ వైపు నుంచో అంటున్నట్లుగా కూడా అనిపిం చింది. వెంటనే మైక్ చేతిలోకి తీసుకున్నాను.

"ప్రత్యర్థి వీక్ పాయింట్‌లపై దెబ్బ కొడితే అది గెలుపు. ప్రత్యర్థి స్ట్రాంగ్ పాయింట్‌లపై దెబ్బ కొడితే అది విజయం... " అన్నాను.

ఆ మాటకు.. ఎవరూ కూడా కొంచెం కూడా స్పందించలేదు! జానారెడ్డి గారు మాత్రం... "గెలుపుకీ విజయానికీ పెద్ద తేడా ఏముందిలేబ్బా రేవంత్‌రెడ్డీ. పాయింట్‌లోకి రా..." అని అన్నారు.

"అక్కడికే వస్తున్నా జానారెడ్డి గారూ..." అన్నాను.

"ఎక్కడికి!" అన్నారాయన.

"పాయింట్‌లోకి జానారెడ్డి గారు! మన ప్రత్యర్థి విడిగా బీఆర్ఎస్ గానీ, విడిగా బీజేపీ గానీ కాదు. విడిగా ఎంఐఎం కూడా కాదు. ఆ మూడు పార్టీల బలాలు, బలహీనతలన్నీ కలిస్తేనే మన ప్రత్యర్థి. బలహీనతల మీద దెబ్బ కొట్టామా గెలుస్తాం. బలాల మీద దెబ్బ కొట్టామా విజయం సాధిస్తాం..." అన్నాను.

"చెప్పిన మాట ఎంతసేపు చెబుతావులే రేవంత్‌రెడ్డీ! ఏం చేద్దామో చెప్పు..." అన్నారాయన!

"జానారెడ్డిగారూ! బీఆర్ఎస్‌కి కేసీఆర్ స్ట్రాంగ్ పాయింట్ అయితే, కేసీఆర్‌కి కేటీఆర్, కవిత వీక్ పాయింట్స్. బీజేపీకి మోదీ స్ట్రాంగ్ పాయింట్ అయితే, మోదీకి లిక్కర్ స్కామ్ నుంచి కేసీఆర్ బిడ్డను తప్పించడం వీక్ పాయింట్. ఎం.ఐ.ఎం.కి ఒవైసీ స్ట్రాంగ్ పాయింట్ అయితే, ఒవైసీకి 'బీజేపీ బీ–టీమ్ ఎం.ఐ.ఎం.' అనే పేరు వీక్ పాయింట్.

వీక్ పాయింట్‌లపై దెబ్బ కొట్టి గెలవడమా, స్ట్రాంగ్ పాయింట్‌లపై దెబ్బ కొట్టి విజయం సాధించడమా అన్నది... మనం ఎవరెవరికి టికెట్ ఇస్తున్నాం అనేదానిపైన గానీ, ఎవరెవరికి టికెట్ ఇవ్వడంలేదు అనే దానిపైన గానీ ఉంటుంది..." అన్నాను. ఆ మాటకు పెద్దగా నవ్వారు పెద్దలు జానారెడ్డిగారు.

"భలేవాడివయ్యా రేవంత్! ఎవరైనా 'విజయమో వీరస్వర్గమో' అంటారు. నువ్వు విజయమో, మహా విజయమో అంటున్నావ్... రెండో చాయిస్ లేకుండా!" అన్నారు.

టికెట్ కమిటీ మీటింగ్ మొదలైంది.

"పార్టీ పవర్‌లోకి రావడం తేలికే కానీ, పార్టీని పవర్‌లోకి తేలేని వారికి టికెట్‌లు ఇవ్వకుండా ఉండటమే కష్టం అని రేవంత్ రెడ్డి ఇన్‌డైరెక్టుగా మనకు చెబుతున్నాడు..." అనే పికప్ పాయింట్‌తో టికెట్ కమిటీ మీటింగ్‌ని ప్రారంభించారు పెద్దలు జానారెడ్డి గారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, ఆశ్వయుజమాసం, **తిథి:** శు.పాడ్యమి, రా.11.28 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** చిత్త సా.6.21 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.12.13 నుండి 1.53 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.04 నుండి 4.50 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.27 నుండి 12.34 వరకు, శరన్నవరాత్రులు ప్రారంభం ; **రాహుకాలం:** సా.4.30 నుంచి 6.00 వరకు, **యమగండం:** ప.12.00 నుంచి 1.30 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.37.

శవాల మీద పేలాలు ఏరుకుంటున్నారు

- విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నారు
- 'ఎక్స్'లో కవిత వర్సెస్ రేవంత్




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో నిరుద్యోగి ప్రవల్లిక ఆత్మహత్య అంశం బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలు ఎక్స్ వేదికగా శనివారం ఈ ఘటనపై చేసుకున్న విమర్శలు, ప్రతి విమర్శలు చర్చనీయాంశమయ్యాయి. ముందుగా ఈ ఘటనపై స్పందించిన రేవంత్ ప్రవల్లికకు న్యాయం కావాలని వేలగొంతుకలు నినదిస్తున్నా కేసీఆర్ చెవికి వినబడడం లేదని, ఈ పెద్దమనిషి పాలనలో మనుషుల ప్రాణాలకు విలువ లేదని ట్వీట్ చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పండుగ సందర్భంగా ఓ ట్వీట్ చేస్తూ బతుకమ్మ పాటలు మీ కోసం అంటూ వీడియోను షేర్ చేశారు. దీనికి స్పందించిన రేవంత్ ట్వీట్ చేస్తూ.. బతుకమ్మ సంబరాల గురించి రంగురంగుల వీడియోలు పెట్టే ఎమ్మెల్సీ కవితకు ప్రవల్లిక ఆత్మ ఘోష వినబడటం లేదా? ఆడబిడ్డల హక్కులు మీ దృష్టిలో రాజకీయ అంగడి సరుకు, పొలిటికల్ స్లోగన్లు తప్ప మానవీయ ఎజెండాలు కాదు.' అంటూ కౌంటర్ చేశారు.

ఎన్ని ఉద్యోగాలిచ్చారో శ్వేత పత్రం విడుదల చేయండి: రేవంత్

ఈ పోస్టుకు మళ్లీ స్పందించిన రేవంత్ ' లక్షలాది ఉద్యోగాల భర్తీ అంటే ఎంపీగా ఓడిన మీకు ఆగమేఘాలపై ఎమ్మెల్సీ పదవి ఇచ్చి భర్తీ చేయడమా?' అని ఎద్దేవా చేశారు. లక్షలాది ఉద్యోగాల భర్తీ అంటే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడమా అని ప్రశ్నించారు. లక్షలాది ఉద్యోగాల భర్తీ అంటే ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేక విద్యార్థుల ఉసురుపోసుకోవడమా? ఉత్త మాటలు, ఎదురు దాడులు కాదు... ఎన్ని లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారో, ఎన్ని లక్షల ఖాళీలు ఉన్నాయో, ఆ ఖాళీలు ఎందుకు భర్తీ చేయలేదో శ్వేతపత్రం విడుదల చేయించండి.' అని డిమాండ్ చేశారు.

బతుకమ్మ చేస్తాం.. బాధను పంచుకుంటాం: కవిత

రేవంత్ ట్వీట్‌కు స్పందించిన కవిత ఎక్స్ వేదికగానే స్పందించారు. 'బతుకమ్మ చేస్తాము.. బాధను కూడా పంచుకుంటాము. బతుకమ్మ పండుగను కించపరచడం ఒక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యం.' అంటూ ఎదురుదాడి చేశారు. ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవడం విచారకరం. ఏ తల్లిదండ్రులకూ ఇలాంటి పరిస్థితి రాకూడదంటూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదే కాంగ్రెస్ పార్టీయేనని, తెలంగాణలో ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చినా అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ విశ్వప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. గ్రూప్–2ను వాయిదా వేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అసెంబ్లీలో, రేవంత్ బయట డిమాండ్ చేయలేదా అని ప్రశ్నించారు. ' శవాల మీద పేలాలు ఏరుకోవడం మీకు, మీ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. హత్య చేసిన వాళ్లే ఓదార్చుతున్నట్టుంది మీ వ్యవహార శైలి. మీ ఆవేదన బూటకం.... మీ ఆందోళన నాటకమంటూ పోస్టు చేశారు.

ఓట్ల కోసం శవరాజకీయాలు సిగ్గుచేటు

- ప్రతిపక్షాలపై తెలంగాణ రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఎంతో భవిష్యత్తున్న ప్రవల్లిక మృతిచెందడం అత్యంత బాధా కరమని, ఓట్ల కోసం నాయకులు శవరాజకీ యాలు చేయడం సిగ్గుచేటని తెలంగాణ రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్ల మీదకొచ్చి రచ్చ చేసే ముందు కొన్ని ప్రశ్నలకు ప్రతిపక్ష నాయకులు సమాధానం చెప్పాల్సి ఉందని శనివారం ఓ ప్రకటనలో కోరారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షలు వాయిదా వేయాలని ధర్నాలు, ఆందోళనలు చేసిన వారెవరో తెలంగాణ సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు ఎన్నికలున్నా యని పరీక్షలు రద్దు చేస్తే దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని, ఎలక్షన్ కోడ్‌లో ఎలాంటి పోటీ పరీక్షలు నిర్వహించే పరిస్థితి ఉండదని తెలిసి కూడా ఓట్ల కోసం శవరాజకీయాలకు దిగడం అవసరమా అని ప్రశ్నించారు.

ప్రేమ వ్యవహారం వల్లే..

▶ మొదటి పేజీ తరువాయి

దొరికింది. ఆమె సెల్‌ఫోన్ కాల్ రికార్డ్‌లు, వాట్సాప్ చాటింగ్‌లతో పాటు ఆమె స్నేహితులను విచారించాం. ప్రవల్లిక మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి గ్రామానికి చెందిన శివరామ్ రాథోడ్‌తో ప్రేమ వ్యవహారం నడిపినట్లు ప్రాథమిక విచారణలో గు ర్తించాం. ప్రియుడితో ఫొటోలు, సీసీటీవీ ఫుటేజ్‌లు కూడా ఉన్నాయి. తనను మోసం చేసి శివరామ్ మరో యువతిని పెళ్లి చేసుకోబోతున్నట్లు ఇరువురి మధ్య జరిగిన చాటింగ్‌లను గు ర్తించాం. శివరామ్, ప్రవల్లిక ఇద్దరు కలిసి నగరంలో ఓ హో టల్‌కు వెళ్లిన సీసీటీవీ ఫుటేజ్ కూడా లభ్యమైంది. మరింత విచారణ కోసం మృతురాలి సెల్‌ఫోన్, సీసీటీవీ ఫుటేజ్, సూ సైడ్ నోట్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాం. ఫోరెన్సిక్ రి పోర్ట్, ప్రవల్లిక చాటింగ్స్ ఆధారంగా శివరామ్ రాథోడ్‌పై కేసు నమోదు చేస్తామని డీసీపీ వివరించారు. అలాగే సూసైడ్ నోట్, లెటర్‌పై ఉన్న హ్యాండ్ రైటింగ్ ప్రవల్లికదేనా కాదా అనే ది నిర్ధారించేందుకు ఆమె నోట్‌బుక్స్ కూడా సీజ్ చేసినట్లు చెప్పారు.

ఏం జరిగిందంటే..: శుక్రవారం సాయంత్రం హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో ప్రవల్లిక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థులు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. అప్పటికే అక్కడికి చేరుకున్న విద్యార్థి సంఘాల నేతలు అడ్డుకున్నారు. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయడంతోనే ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. అర్ధరాత్రి వరకూ మృతదేహాన్ని హాస్టల్‌లోనే ఉంచి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. రాజకీయ పార్టీలు కూడా రంగంలోకి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రేమ వ్యవహారమే ప్రవల్లిక ఆత్మహత్యకు కారణమని తేల్చారు.

పక్షం రోజుల కితమే హాస్టల్‌లో చేరిక

కాగా, 15 రోజుల క్రితం హాస్టల్‌లో జాయిన్ అయిన ప్రవల్లిక సంధ్య, అక్షయ శ్రుతిలతో కలిసి ఉండేది. ఎక్కువగా ఎవరితో మాట్లాడేది కాదని అంటున్నారు. ప్రవల్లిక ఉరివేసుకున్న రూమ్‌లో సూసైడ్ నోట్‌తో పాటు లవ్ సింబల్స్‌తో ఉన్న ఓ లెటర్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి సెల్ ఫోన్ లో తాను ప్రేమించిన శివరామ్ మరో అమ్మాయితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాడని ఫ్రెండ్స్‌తో చేసిన చాటింగ్స్‌ను పోలీసులు గుర్తించారు.

ప్రేమగురించి కుటుంబసభ్యులకు తెలుసు: డీసీపీ

డిగ్రీ పూర్తి చేసిన తరువాత ప్రవల్లిక ఎలాంటి గ్రూప్స్ పరీక్షలకు అప్లయ్ చేయలేదని డీసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. ఎ లాంటి పోటీ పరీక్షలు కూడా రాయలేదన్నారు. ప్రవల్లిక ప్రే మ విషయం కూకట్‌పల్లిలో డిగ్రీ చదువుతున్న తమ్ముడు ప్రణయ్‌తో పాటు తల్లిదండ్రులకు కూడా తెలుసే ఉంటుంద ని భావిస్తున్నామని చెప్పారు. వారి వద్ద మరింత సమాచా రం సేకరిస్తామన్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు ఆందోళనలు చేసి పోలీసులపై రాళ్లురువ్విన కేసులో బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు.

నివేదిక కోరిన గవర్నర్..

ప్రవల్లిక ఆత్మహత్యపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. ఆమె ఆత్మహత్యపై 48 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిలను ఆదేశించారు. ప్రవల్లిక ఆత్మహత్య పట్ల తీవ్ర బాధను వ్యక్తం చేసిన గవర్నర్, ఆమె కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు.

ప్రవల్లికది ఆత్మహత్య కాదు.. హత్య

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ప్రవల్లిక ఆత్మహత్య దిగ్భ్రాంతికరం: మల్లికార్జున ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: ప్రవల్లిక ఆత్మహత్య ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. ప్రవల్లికది ఆత్మహత్య కాదని.. నిరుద్యోగ యువత కలలు, ఆశలను ప్రభుత్వం హత్య చేసినట్టు ఉందని ఆరోపించారు. ప్రవల్లిక ఆత్మహత్య అత్యంత బాధాకరం అని అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ కలసి తమ అసమర్థతతో తెలంగాణను నాశనం చేశాయని రాహుల్ మండిపడ్డారు. త్వరలోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, తాము రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతేగాక అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే టీఎస్‌పీఎస్సీ బోర్డును పునర్ వ్యవస్థీకరిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

బీఆర్ఎస్‌ను తరిమికొడతారు..: ఖర్గే

ప్రవల్లిక ఆత్మహత్య ఘటనపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఉద్యోగ పరీక్షలను పదేపదే వాయిదా వేయడం, మరో పక్క అవకతవకల కారణంగా ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోవడం తనను దిగ్భ్రాంతికి, తీవ్ర వేదనకు గురిచేసిందన్నారు. అవినీతి, అసమర్థ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణ యువత అధికారం నుంచి తరిమికొడతారని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ కూడా ప్రవల్లిక మరణంపై 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. పరీక్షలను పదే పదే వాయిదా వేయడం వల్ల యువత తీవ్ర ఆవేదనలో ఉన్నారని అన్నారు.

నిరుద్యోగులారా బతికి సాధిద్దాం: ఎంపీ కోమటిరెడ్డి

'నిరుద్యోగులారా బతికి సాధిద్దాం. ఎవరూ ఆత్మహత్య చేసు కోవద్దు. వచ్చేది మన ప్రభుత్వమే. కడుపు నిండా ఉద్యోగా లు ఇచ్చుకుందాం. చేతులెత్తి మొక్కుతున్నా. తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చకండి'అని నిరుద్యోగ యువతకు భువన గిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గ్రూప్ 2 వాయిదాతో వరంగల్‌కి చెందిన ప్రవల్లిక ఆత్మహత్య చేసుకో వడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనే అని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఎంపీ కోమటిరెడ్డి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ప్రవల్లిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, ఆమె కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఉసురు తగిలి బీఆర్ఎస్ ప్రభుత్వం మట్టికొట్టుకుపోతుందన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడొద్దు

- అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు: రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆయన ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం, పదవ తరగతి పరీక్షల నిర్వహణ, 12వ తరగతి పేపర్ దిద్దుబాటు వంటి వాటిలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందంటూ ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల వైఫల్యాల కారణంగానే నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శనివారం ఢిల్లీలో జరిగిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 58 పేర్లతో తొలి జాబితా సిద్ధంగా ఉందని, ఆదివారం విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులతో ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ఆటలాడుతున్నారని, వీరి నిర్లక్ష్యం కారణంగానే అశోక్‌నగర్‌లో ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడిందన్నారు.

నేడు రాహుల్, ప్రియాంకల పర్యటన వివరాలు

ఈనెల 18న కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు రాష్ట్రంలో పర్యటించనున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై ఇప్పటికే ఏఐసీసీ చైర్మన్ మల్లికార్జున ఖర్గే, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, కేసీ వేణుగోపాల్ తదితరులతో కలసి విధి విధానాలను చర్చించడం జరిగిందన్నారు. రాహుల్, ప్రియాంకల సభలు, యాత్రలు, పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ని ఆదివారం మధ్యాహ్నం వరకు వెల్లడిస్తామన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాను విడుదల చేస్తున్నట్లు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ తెలిపారు. ఇప్పటికే 58 పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేశామన్నారు. తొలి జాబితాలో ఉన్న పేర్లను ఆదివారం కాంగ్రెస్ చీఫ్ రాహుల్ ప్రకటించనున్నట్లు తెలిపారు. వామపక్ష పార్టీలతో పొత్తుల అంశంపై చర్చలు జరుగుతున్నాయని, ఒకటి రెండు రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నట్లు వివరించారు.

ఇది కేసీఆర్ సర్కార్ కుట్రపూరిత హత్య

- నిరుద్యోగులారా ఆత్మహత్యలొద్దు.. దయచేసి 60 రోజులు ఓపిక పట్టాలి
- బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపడతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగ యువత దీనావస్థకు రాష్ట్ర ప్రభుత్వ కుట్రపూరిత విధానాలే కారణమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నందున, కేసీఆర్ సీఎం కుర్చీలో కూర్చునే నైతిక హక్కు కోల్పోయారని దుయ్యబట్టారు. ప్రవల్లిక అనే నిరుద్యోగ యువతి ఆత్మహత్య అత్యంత దురదృష్టకరమన్నారు. ఇది కేసీఆర్ ప్రభుత్వం కుట్రపూరితంగా చేసిన హత్య అని ధ్వజమెత్తారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం, కల్వకుంట్ల కుటుంబం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగులారా ఆత్మహత్యలొద్దు.. దయచేసి 60 రోజులు ఓపిక పట్టండని కోరారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువత ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకంగా ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. 'అహంకారపూరిత ప్రభుత్వాన్ని గద్దెదించుదాం.. మీరు కలలు కంటున్న తెలంగాణను సాధించుకుందాం' అని పిలుపునిచ్చారు. నిరుద్యోగుల పరామర్శకు వెళ్లిన ఎంపీ లక్ష్మణ్‌తోపాటు యువతపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నామన్నారు. పోటీపరీక్షలు వాయిదా పడటంతో మనస్తాపానికి గురైందని ప్రవల్లిక కుటుంబసభ్యులే చెప్తుంటే...ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమంటున్న పోలీసులు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ నినాదంలోని 'నియామకాల' విషయంలో ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ యువత దగాపడిందన్నారు. ఇప్పుడు పోటీ పరీక్షలు, డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎన్నికల కోడ్‌ను కారణంగా చూపిస్తున్న కల్వకుంట్ల ప్రభుత్వం.. కోడ్ రాకముందు ఏం చేసిందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. గ్రూప్–1 పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ తర్వాతే.. ఉద్యోగ నియామకాల్లో కల్వకుంట్ల కుటుంబం చిత్తశుద్ధి ఏపాటిదో బయటి ప్రపంచానికి తెలిసిందన్నారు.

చట్టం తన పని తాను చేసుకుపోతోంది

చంద్రబాబు అరెస్టు అంశంపై వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ హైదరాబాద్ టీమ్ నాయకులు



కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ ఐటీ వింగ్ నాయకులు

కూకట్‌పల్లి (హైదరాబాద్): స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో అక్రమాలకు పాల్పడిన ఆరోపణపై అరెస్టైన ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ హైదరాబాద్ టీమ్ నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు మద్దతుగా కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ హైదరాబాద్ టీమ్ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. కరప్షన్ కింగ్ అని నినాదాలు చేస్తూ ప్లకార్డుల్లో ప్రదర్శించారు. చంద్రబాబు ఎందుకు అరెస్టు అయ్యారనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో నిరసన చేస్తున్నామని ఈ సందర్భంగా వారు మీడియాకు తెలిపారు. చంద్రబాబు అరెస్టును వైఎస్సార్‌సీపీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చేసిందంటూ ఎల్లోమీడియా అదేపనిగా తప్పుడు ఆరోపణలతో కథనాలు ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ఐటి వింగ్ విభాగం అధ్యక్షుడు సునీల్ పోసిం రెడ్డి, ఎన్‌టీఆర్ జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ యక్కంటి వెంకటరెడ్డి, ఐటీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు

భారీగా నగదు, బంగారం పట్టివేత

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు, సోదాలు నిర్వహిస్తూ సరైన పత్రాలు లేకుండా, లెక్కలు చూపకుండా తరలిస్తున్న నగదును పట్టుకుంటున్న సంగతి విదితమే. ఈ క్రమంలో శనివారం శివరాంపల్లి చెక్ పోస్టు వద్ద రాజేంద్రనగర్ పోలీసులు ఓ యువకుడి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అత్తాపూర్ పోలీసుల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.10 లక్షలు పట్టుబడ్డాయి. హిమాయత్‌నగర్‌లో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.49,97,500 నగదును నారాయణగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హవాలా డబ్బును తీసుకువెళ్తున్న రాంకోఠికి చెందిన సవాయిశర్మను సెంట్రల్ జోన్ పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.18 లక్షల నగదును, ఒక ఫోన్, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు.

మేడ్చల్‌లో ఇప్పటివరకు రూ.54 లక్షల 90 వేలు స్వాధీనం

తనిఖీల్లో భాగంగా మేడ్చల్ పరిధిలో ఇప్పటి వరకు మొత్తం రూ.54 లక్షల 90 వేల నగదు, 180 గ్రాముల బంగారం సీజ్ చేసినట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు. అదేవిధంగా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు రూ.15 లక్షల నగదు, బెల్టుషాపుల నుంచి అక్రమంగా నిల్వ చేసిన రూ.45 వేల విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నారు.

నగరానికి 'హలో సిక్కిం' కారు ర్యాలీ

జెండాఊపి ఆహ్వానించిన రియర్ అడ్మిరల్ రవ్‌నీష్

సాక్షి, హైదరాబాద్: భారత సైనిక దళాల్లో చేరేలా ఈశాన్య రాష్ట్రాల యువతను ప్రోత్సహించడం, మారుమూల ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా భారత నేవీ 'హలో సిక్కిం'పేరిట చేపట్టిన కారు ర్యాలీ శనివారం హైదరాబాద్ నగరానికి చేరుకుంది. ర్యాలీని డిఫెన్స్ మెషినరీ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ డైరెక్టర్ రియర్ అడ్మిరల్ రవ్‌నీష్ సేథ్ జెండా ఊపి తెలంగాణలోకి ఆహ్వానించారు. మహారాష్ట్రలోని లోనావాలా వద్ద ప్రారంభమై, సిక్కిం చేరుకోనున్న ఈ ర్యాలీలో ఆరుగురు మహిళలతో సహా 14 మంది నౌకాదళ సిబ్బంది పాల్గొంటున్నారు. యాత్రలో భాగంగా సాయుధ దళాల కీలక సంస్థల సందర్శన, భారత సైన్యంలో చేరేలా ఆకర్షించేందుకు వివిధ పాఠశాలలు, కళాశాలల్లో యువతకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రియర్ అడ్మిరల్ రవ్‌నీష్ సేథ్ తెలిపారు.

'దళితబంధు' పేరుతో దగా

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా

సాక్షి, హైదరాబాద్: దళితబంధు పథకం పేరుతో దళితులను సీఎం కేసీఆర్ దగా చేశారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా మండిపడ్డారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా సంక్షేమ పథకాల పేరిట కేసీఆర్ జిమ్మిక్కులు చేసి దళితుల ఓట్లు కొల్లగొట్టి మోసం చేస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. 'హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలప్పుడు 16 బస్సులు పెట్టి ఊరికి నలుగురు చొప్పున దళితులను పిలిపించుకుని దళితబంధుపై ప్రగతిభవన్‌లో చర్చించారు, రెండేళ్లు గడిచినా దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు'అని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా ఏడాదికి 2 లక్షల కుటుంబాలకు దళితబంధు ఇస్తానని హామీ ఇచ్చినా, వాటిలో సగం కుటుంబాలకు కూడా ఇవ్వలేదని అన్నారు.

'ప్రవల్లిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం'



సాక్షి, హైదరాబాద్: పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న ప్రవల్లికది ప్రభుత్వ హత్యేనని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పార్టీ తరఫున పోరాడుతామని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. మృతిచెందిన యువతిపై అపవాదు వేసిన పోలీసు అధికారులపై చర్య తీసుకో వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై గవర్నర్‌ను కలిసి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...ప్రవల్లిక మృతి రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ పతనానికి నాంది అన్నారు. పోస్టుమార్టం నివేదిక రాక ముందే మృతదేహాన్ని ఎందుకు తరలించారని ప్రశ్నించారు. పోలీసులు ఉద్యోగం చేస్తున్నారా అధికార పార్టీకి ఊడిగం చేస్తున్నారా అని నిలదీశారు. మంత్రి కేటీఆర్ నిసిగ్గుగా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, తానే న్యా యమూర్తి అన్నట్లుగా తీర్పునిస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రాగానే జాబ్ కాలెండర్ ప్రకటిస్తామని చెప్పారు.

గ్రామాలకు తరలండి: బండి



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలోని 50 లక్షలమంది నిరుద్యోగులకు చేతులు జోడించి కోరుతున్నా.. మీరు కోచింగ్ సెంటర్లు మొత్తం బంద్ చేసి మీ గ్రామాలకు వెళ్లండి. 50 రోజులపాటు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయండి'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30 కేసీఆర్ సర్కార్‌కు డెడ్‌లైన్ కావాలని, వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలన్నారు. 'వచ్చే నెల 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఫలితాలు, అంటే... త్రీ ప్లస్ త్రీ.. సిక్స్. బీఆర్ఎస్ ఇంటికి పోవడం ఫిక్స్'అని వ్యాఖ్యానించారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించి బీజేపీకి ఓటు వేసేలా చూడాలని యువతను కోరారు.

ప్రవల్లికది ప్రభుత్వ హత్యే..



కాగజ్‌నగర్‌టౌన్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–2 అభ్యర్థిని ప్రవళికది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అసమర్థత, చేతగానితనంతో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలు, పరీక్షలు వాయిదా వేయడంతో పలువురు నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు బీఎస్పీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఓట్లు ఎలా అడుగుతారు?



పార్టీ కార్యాలయంలో బతుకమ్మను పేర్చుతున్న వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: ప్రవల్లికది ముమ్మాటికీ సర్కార్ చేసిన హత్యేనని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఉద్యోగాలు లేక ప్రవల్లిక లాంటి నిరుద్యోగ అభ్యర్థులు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడుతుంటే..కేసీఆర్‌ను చూసి ఓటెయ్యండని ఎలా అడుగుతున్నావని ఆమె మంత్రి కేటీఆర్‌ను శనివారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశ్నించారు. కాగా, వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

మెట్రో రైలులో టీడీపీ నేతల దురుసు ప్రవర్తన

- ఐటీ ఉద్యోగుల ముసుగులో మెట్రో ఎక్కి నినాదాలు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- అటు ప్రయాణికులు, ఇటు పోలీసులతో వాగ్వాదం
- అరగంట సేపు మియాపూర్ మెట్రోస్టేషన్ మూసివేత
- పలువురి అరెస్టు... కేసు నమోదు



పోలీసులతో గొడవ పడుతున్న టీడీపీ మద్దతు దారులు

గచ్చిబౌలి (హైదరాబాద్): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా నల్ల టీషర్ట్‌లతో లెట్స్ మెట్రో పేరిట చేపట్టిన నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. చంద్రబాబు న్యాయ పోరాటం చేస్తున్నారని, మెట్రో రైలులో నిరసన ఏంటని ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించారు. మెట్రో రైలులోకి రావద్దని అడ్డుకున్న మియాపూర్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఐటీ ఉద్యోగుల ముసుగులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకులు హంగామా చేశారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో నల్ల టీషర్ట్‌లు వేసుకుని కొందరు మియాపూర్ మెట్రోస్టేషన్‌కు చేరుకున్నారు. ముందస్తు సమాచారంతో టికెట్ కౌంటర్లు మూసివేశారు. అయితే అవి తెరవాలంటూ గొడవకు దిగారు. దీంతో నిరసనకారులు, సాధారణ ప్రయాణికులతో స్టేషన్‌లో ఒక్కసారిగా భారీ సంఖ్యలో జనం రావడంతో స్టేషన్‌ను మూసి వేశారు. నల్ల టీషర్ట్‌లతో వస్తున్న వారిని ఓ వ్యక్తి అడ్డుకోబోయాడు. ప్రయాణికులకు ఇబ్బంది ఎందుకు పెడుతున్నారని ఓ ప్రయాణికుడు ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో ప్రయాణికుడు నాది విజయవాడని, చంద్రబాబు న్యాయ పోరాటం చేస్తున్నారు కదా, ఎక్కడ ఏమి చేయాలో అక్కడే చేయాలని సూచించారు. ఇక్కడికి వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించడం తగదంటూ టీడీపీ కార్యకర్తలకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. అక్కడ సమస్యకు ఇక్కడ నిరసన ఏంటని ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక ఎదురు దాడికి దిగారు. మెట్రో రైలులో నిరసన ఏంటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీ ఉద్యోగుల పేరిట చేపట్టే కార్యక్రమాలకు టీడీపీ నాయకులే జన సమీకరణ చేసి హంగామా సృష్టిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కాగా, ఈ క్రమంలో అమీర్ పేట్, మియాపూర్ స్టేషన్లలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

ఎల్బీనగర్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం..

కాగా, ఎల్బీనగర్ మెట్రోలో ప్రయాణించేందుకు అనుమతి లేదని తిరిగి బస్సులలో వెళ్లాలని నిరసన కారులకు పోలీసులు సర్ది చెబుతుండగా...వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రోడ్డుపై పాదయాత్ర చేసేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న ఏపీకి చెందిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఎల్బీనగర్ చేరుకుని నిరసనకారులకు మద్దతు తెలిపగా...స్థానిక ఏసీపీ జానకిరెడ్డి, సీఐ అంజిరెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది ఆమె అడ్డుకుని అక్కడ నుంచి పంపించివేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ శనివారం ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసిన 36 మందిపై టీడీపీ ఆందోళనకారులపై ఎల్‌బీనగర్ పోలీసులు ఐపీసీ 151 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా...



గర్బా పాటను రాశా

- నవరాత్రి ఉత్సవాలప్పుడు షేర్ చేస్తా
- 'ఎక్స్'లో ప్రధాని మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: సొంతంగా గర్బా పాటను రాసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ పాటను 15వ తేదీ నుంచి మొదలయ్యే నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలతో షేర్ చేసుకుంటానని చెప్పారు. కొన్నేళ్ల క్రితం తను రాసిన గర్బా పాటను ఆలపించి, సంగీతం సమకూర్చిన ధ్వని భానుశాలి, తనిష్క్ బాగ్చీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ పాట ఎన్నో జ్ఞాపకాలను గుర్తు చేసిందని శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'చాలా ఏళ్లుగా నేను ఏమీ రాయలేకపోయాను. అయితే, గత కొన్ని రోజుల్లో ఒక గర్బా పాటను పూర్తి చేయగలిగాను. నవరాత్రప్పుడు దానిని షేర్ చేస్తాను' అని ఆయన వెల్లడించారు. గుజరాతీ నృత్య రూపమే గర్బా. ఈ నృత్యాన్ని సాధారణంగా తొమ్మిది రోజుల ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. ప్రధాని మోదీ కొన్నేళ్ల క్రితం స్వయంగా రాసిన గర్బా పాటను తనిష్క్ బాగ్చి స్వరాలు సమకూర్చగా జేజస్ట్ మ్యూజిక్ ద్వారా విడుదల చేసినట్లు ధ్వని భానుశాలి 'ఎక్స్'లో పెట్టిన పోస్టుకు ప్రధాని మోదీ పైవిధంగా స్పందించారు.

ఆస్ట్రేలియాలో ఆదివాసీలకు ఎదురుదెబ్బ

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా రాజ్యాంగంలో ఆదివాసీ ప్రజలకు గుర్తింపు కల్పించేందుకు ఉద్దేశించిన రెఫరెండం వీగిపోయింది. ఆదివాసీ తెగల ప్రజలపై ప్రభావం చూపే నిర్ణయాల్లో ప్రభుత్వానికి సలహాల నందించేందుకు కమిటీని ఏర్పాటు చేయడం కూడా ఈ రెఫరెండం లక్ష్యాల్లో ఒకటి. రెఫరెండం అనుకూలవాదులు దీనిని ఒక చారిత్రక అవకాశంగా పేర్కొనగా వ్యతిరేక వాదులు దీనిని విభజన సృష్టిస్తుందని ప్రచారం చేశారు. ఆస్ట్రేలియాలో 1.80 కోట్ల మంది ఆదివాసీలున్నారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ అత్యధికంగా ఆదివాసీలు రెఫరెండంకు నో అంటూ ఓటేశారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తానని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ఆదివాసీలకు గుర్తింపు అంశంపై 1999లో చేపట్టిన రెఫరెండంలోనూ ఇదే రకమైన ఫలితం వచ్చింది.

నకిలీ పాస్‌పోర్టుల రాకెట్.. సీబీఐ దాడులు

న్యూఢిల్లీ: నకిలీ పాస్‌పోర్టుల రాకెట్ గుట్టును సీబీఐ శనివారం రట్టు చేసింది. పశ్చిమ బెంగాల్, సిక్కింలలో 50 ప్రాంతాలపై దాడులు చేసింది. సిక్కింలోని ఒక పాస్‌పోర్టు అధికారిని, మరో వ్యక్తిని అరెస్టు చేసింది. మొత్తం 24 మంది అధికారులు, దళారులు, ఏజెంట్ల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. వీరిలో పలువురు డిప్యూటీ పాస్‌పోర్టు ఆఫీసర్లు కూడా ఉన్నారు. వీరంతా కుమ్మక్కై విదేశీయుల నుంచి లంచాలు తీసుకుని తప్పుడు ఆధారాలు, డాక్యుమెంట్లపై వారికి పాస్‌పోర్టులు జారీ చేసినట్టు సీబీఐ ఆరోపించింది.

న్యూజిలాండ్ ప్రధానిగా క్రిస్టఫర్ లుక్సన్



ఆక్లాండ్: న్యూజిలాండ్ ప్రధానిగా క్రిస్టఫర్ లుక్సన్ (53) పగ్గాలు చేపట్టనున్నారు. నేషనల్ పార్టీ అభ్యర్థి అయిన లుక్సన్ శనివారం జరిగిన ఎన్నికల్లో దామాషా ఓటింగ్ విధానంలో 40 శాతం ఓట్లు సాధించారు. ప్రధాన ప్రత్యర్థి, లిబరల్ పార్టీకి చెందిన ప్రధాని క్రిస్ హిప్కిన్స్‌కు25 శాతం ఓట్లే పడ్డాయి. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. లిబర్టేరియన్ ఏసీటీ పార్టీతో కలిసి లుక్సన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. లుక్సన్ గతంలో యూనిలీవర్ కెనడా, ఎయిర్ న్యూజిలాండ్ సంస్థలకు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. జనవరిలో ప్రధానిగా పగ్గాలు చేపట్టనున్నారు. న్యూజిలాండ్ లేబర్ పార్టీ నేత జెసిండా ఆర్డెర్న్ 2107 ఎన్నికల్లో ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆరేళ్లపాటు కొనసాగాల్సి ఉండగా 2023 జనవరిలో రాజీనామా చేశారు. దీంతో ప్రధాని పీఠమెక్కిన హిప్కిన్స్ 9 నెలలే అధికారంలో ఉన్నారు.

కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే అవినీతి ఉంది

కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ డీఎన్ఏలోనే అవినీతి ఉందని బీజేపీ ఆరోపించింది. శనివారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. 'కర్ణాటకలోని గత బీజేపీ ప్రభుత్వం 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోందంటూ కాంగ్రెస్ తరఫున అంబికాపతి ప్రధాని మోదీకి లేఖ రాసిన విషయం మనం గుర్తుంచుకోవాలి. ఈయన ఇంట్లోనే రూ.42 కోట్లు తాజాగా ఐటీ సోదాల్లో బయటపడ్డాయి. అంబికాపతి, అతడి మిత్ర కాంట్రాక్టర్లు కాంగ్రెస్ తరఫున వకాల్తా పుచ్చుకుని బీజేపీపై తప్పుడు ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారు' అని పేర్కొన్నారు.



గాజా సిటీ నుంచి మూటాముల్లె సర్దుకుని వెళ్తున్న పాలస్తీనియన్లు

ఉత్తరం నుంచి దక్షిణానికి... వలస వ్యథ!

ఉత్తర గాజా నుంచి లక్షల మంది వలసలు

- ఇజ్రాయెల్ హెచ్చరికల ఫలితం
- ఇప్పటికే వలస వెళ్లిన 4 లక్షల మంది
- అదేబాటన మరో 7 లక్షల మంది
- పొంచివున్న భూతల దాడులు

జెరుసలేం: ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్ సంస్థ చేసిన మతిలేని దాడి సొంత ప్రజలైన పాలస్తీనియన్ల పాలిట భస్మాసుర హస్తంగా మారుతోంది. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ హెచ్చరికలతో ఉత్తర గాజావాసులంతా ఇల్లూ వాకిలీ వీడి పొట్ట చేతపట్టుకుని వలసబాట పడుతున్నారు. వందలో, వేలో కాదు! అక్కడి 11 లక్షల మందిలో ఇప్పటికే 4 లక్షల మందికి పైగా వలస వెళ్లగా, ఇజ్రాయెల్ అతి త్వరలో పూర్తి స్థాయి భూతల దాడికి దిగనున్న నేపథ్యంలో మిగతావారూ అదే బాట పట్టారు. బెదిరింపులకు జడవద్దన్న హమాస్ పిలుపులను పట్టించుకుంటున్న దిక్కే లేదు. ఇన్ని లక్షల మందీ మరో దారిలేక దక్షిణ గాజా వైపు సాగుతున్నారు. ఇప్పటికే మౌలిక సదుపాయాలతో పాటు దేనికీ దిక్కులేక కటకటలాడుతున్న దక్షిణ గాజా, అక్కడి జనాభాకు సమాన సంఖ్యలో వచ్చి పడుతున్న తోటి పాలస్తీనియన్లకు ఏ మేరకు ఆశ్రయం కల్పిస్తుందో, ఎలా ఆదుకోగలదో... అంతా అగమ్యగోచరం! ఈ మనకాలపు మహా విషాదానికి ఐక్యరాజ్యసమితితో పాటు అంతర్జాతీయ సమాజం కూడా మౌన ప్రేక్షకురాలిగా మారుతోంది...! పెను ఉత్పాతానికి, మానవ సంక్షోభానికి దారితీయగల ఈ భారీ వలసలు వద్దంటున్న ఐరాస, అందుకు మరో ప్రత్యామ్నాయమేమీ చూపలేని పరిస్థితుల్లో చేష్టలుడిగింది.

సామూహిక వలసలు...

కార్లు, ట్రక్కులు, గాడిదలు, కాలినడకన... ఎలా వీలైతే అలా ఉత్తర గాజావాసులు వలస బాట పట్టారు. భారమైన మనసులతో ఇల్లూ వాకిలీ ఖాళీ చేసి కుటుంబాలతో సహా తరలి వెళ్తున్నారు. చుట్టూ వచ్చి పడుతున్న బాంబులు, రాకెట్లు, క్షిపణుల మధ్యే బిక్కుబిక్కుమంటూ సాగుతున్నారు. ఎట్టకేలకు దక్షిణ గాజా చేరినా సురక్షితంగా ఉంటామో లేదో తెలియని అయోమయం! తాగడానికి, తినడానికి కూడా దిక్కుండదేమోనన్న భయం!! వెరసి అంతులేని దైన్యమే వారిని వెంటాడుతోంది. మరోవైపు ఎటూ కదల్లేక ఆస్పత్రుల్లో దీనావస్థలో ఉన్న వేలాది మంది క్షతగాత్రులు, రోగులు నిస్సహాయంగా కాలం గడుపుతున్నారు.

ఇజ్రాయెలీల ప్రతీకారేచ్ఛ

హమాస్ పాశవిక దాడిపై ఇజ్రాయెలీలు మండిపడుతున్నారు. చీకటిమాటున తీసిన దొంగ దెబ్బపై కనీవినీ ఎరగని రీతిలో ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని నినదిస్తున్నారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా శుక్రవారం రాత్రి ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం వారి భావోద్వేగాలను ప్రతిఫలించింది. హమాస్‌ను సర్వనాశనం చేసి గానీ విశ్రమించేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఉత్తర గాజా ఖాళీ అయ్యాక ఇజ్రాయెల్ ఏ స్థాయి దాడులకు దిగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్కి భవనాలు, నిర్మాణాలు ఇప్పటికే చాలావరకు ఇజ్రాయెల్ రాకెట్ దాడుల్లో నేలమట్టమయ్యాయి. అయితే, అమాయక పాలస్తీనియన్లకు హాని కలగకుండా వీలైనన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి జొనాథన్ కొనిక్రస్ ప్రకటించారు. తక్షణం దక్షిణాదికి వెళ్లిపోవాలంటూ ఉత్తర గాజా అంతటా సైన్యం కరపత్రాలు జారవిడిచింది. సోషల్ మీడియాలోనూ విజ్ఞప్తి చేసింది. రెండు ప్రధాన రహదారులపై ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగింటి వరకూ ఎలాంటి హానీ తలపెట్టకుండా వలసలను అనుమతిస్తామని ప్రకటించింది. అయితే, యుద్ధం ముగిశాక వారు ఉత్తర గాజాకు తిరిగొచ్చేందుకు అనుమతిస్తామన్న హామీని ఇజ్రాయెల్ నిలుపుకోవడంపై ఈజిప్టు తదితర దేశాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

అనుమతిస్తాం: ఈజిప్టు

దక్షిణ రఫా సరిహద్దు క్రాసింగ్‌ను తెరిచి ఉత్తర గాజా వాసులను దక్షిణాదికి అనుమతిస్తామని ఈజిప్టు ప్రకటించింది. గత వారం రోజుల్లో అక్కడ నిర్మించిన తాత్కాలిక గోడలను కూల్చేస్తామని పేర్కొంది. తమవైపు ఇప్పటిదాకా 2,200 మందికి పైగా మరణించినట్టు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. అలాగే హమాస్ దాడుల్లో మరణించిన ఇజ్రాయెలీల సంఖ్య 1,500 దాటినట్టు ఆ దేశ ప్రభుత్వం పేర్కొంది. వలస వెళ్తున్నవారి కార్లపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగిందని హమాస్ ఆరోపించింది. ఈ దాడులు ఏకంగా 70 మంది అమాయకులను బలిగొన్నాయని పేర్కొంది. మరోవైపు ఏ క్షణంలోనైనా హమాస్‌కు దన్నుగా బరిలో దిగేందుకు సిద్ధమని హెజ్బొల్లా తీవ్రవాద సంస్థ పునరుద్ఘాటించింది. గాజావాసుల కోసం ఐరాస పంపిన ఔషధాలు తదితరాలతో కూడిన విమానాలు ఈజిప్టులోనే నిలిచిపోయాయి. పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయెల్ దారుణంగా ప్రవర్తిస్తోందంటూ 57 ఇస్లామిక్ దేశాల కూటమి మండిపడింది. వలసలు పూర్తయ్యేందుకు ఇజ్రాయెల్ మరింత సమయమివ్వాలని యూరోపియన్ యూనియన్ సూచించింది.

కళ్లముందు 1948 వలసలు

ప్రస్తుత సంక్షోభం 1948 నాటి పాలస్తీనా వలసలను గుర్తు తెస్తోంది. ఇజ్రాయెల్ ఆవిర్భావం సందర్భంగా అరబ్ దేశాలతో జరిగిన యుద్ధం సందర్భంగా ఏకంగా 7 లక్షల మంది పాలస్తీనియన్లు ప్రస్తుత ఇజ్రాయెలీ భూభాగాల నుంచి ఇలాగే వలస బాట పట్టారు. దీనినే వారు నక్బా (భారీ ఉత్పాతం)గా పిలుస్తారు. నాటినుంచి వారు ఇప్పటిదాకా తమ స్వస్థలాల ముఖం చూసేందుకు నోచుకోలేదు! వారు, వారి వారసులు కలిపి 60 లక్షల మంది దాకా వెస్ట్‌బ్యాంక్‌తో పాటు లెబనాన్, సిరియా, జోర్డాన్లలో తలదాచుకుంటున్నారు. గాజాలోనూ ఎక్కువ మంది వీరే. నాటి బాధాకరమైన ఉదంతం ఇప్పుడు పునరావృతమవుతోందని వారు ఆక్రోశిస్తున్నారు.

దాడుల్లో హమాస్ కమాండర్ హతం: ఐడీఎఫ్

ఇజ్రాయెల్‌పై మెరుపుదాడికి సారథ్యం వహించిన హమాస్ మిలిటెంట్ సంస్థకు చెందిన కమాండర్ అలీ ఖాదీ హతమయ్యాడు. నక్బా యూనిట్ కంపెనీ కమాండర్‌గా ఉన్న అతన్ని కచ్చితమైన సమాచారం మేరకు డ్రోన్ దాడిలో మట్టుపెట్టినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) శనివారం ప్రకటించింది. 2005లో పలువురు ఇజ్రాయెల్ పౌరుల కిడ్నాపింగ్, హత్య కేసుల్లో అలీని అదుపులోకి తీసుకున్నారు. కానీ గిలాత్ శాలిద్ ఖైదీల మార్పిడి ఒప్పందంలో భాగంగా విడుదల చేయాల్సి వచ్చింది' అంటూ ఆ దేశ వైమానిక దళం ట్వీట్ చేసింది. హమాస్ ఉగ్రవాదులందరికీ అలీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించింది.



గాజాస్ట్రిప్‌లో ఐరాస నడుపుతున్న స్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న పాలస్తీనియన్లు

ఇజ్రాయెల్ 'హెచ్చరిక' మరీ డేంజరస్

ఐరాస ఆందోళన

ఐక్యరాజ్య సమితి: పాలస్తీనాలోని ఉత్తర గాజాపై దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని 24 గంటల్లోగా వీడాలని అక్కడి పౌరులను ఇజ్రాయెల్ హెచ్చరించడాన్ని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా తప్పుబట్టింది. న్యూయార్క్‌లో మీడియా సమావేశంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శనివారం మాట్లాడారు. ' పది లక్షల జనాభా ఉన్న ప్రాంతాన్ని కేవలం 24 గంటల వ్యవధిలో ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ ఆదేశించడం అత్యంత ప్రమాదకరం. అసలు ఇది అసంభవం. ఇలాంటి హెచ్చరికలు దారుణం. యుద్ధానికి కూడా కొన్ని కట్టుబాట్లు ఉంటాయని గుర్తుంచుకోవాలి' అని గుటెరస్ వ్యాఖ్యానించారు. దాదాపు 11 లక్షల జనాభా ఉన్న ఉత్తర గాజాపై దాడులు చేస్తామని, ఆలోపు 24 గంటల్లో ఆ ప్రాంతాన్ని ఖాళీచేసి దక్షిణ గాజా వైపుగా స్థానికులు తరలిపోవాలని ఇజ్రాయెల్ వైమానిక దళం హెచ్చరించడం తెల్సిందే. జనావాసాలు మాత్రమేకాదు ఉత్తర గాజాలోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, చికిత్స కేంద్రాలు, ఐరాస శిబిరాలకూ ఇదే అల్టిమేటమ్ వర్తిస్తుంది. అందరూ ఉత్తర గాజా వైపు వస్తే ఆరోగ్య సంక్షోభం తలెత్తడం ఖాయం. యుద్ధవాతావరణంలో ఇంతటి భారీ వలసలు క్షేమం కాదు. ఆరోగ్య కేంద్రాలపై జరిగిన 34 దాడి ఘటనల్లో 11 మంది ఆరోగ్య సిబ్బంది సైతం ప్రాణాలు కోల్పోయారు. గాజాలో ఇంధనం, ఆహారం, తాగునీరు అవసరాలు తీర్చాల్సి ఉంది' అని ఆందోళన వ్యక్తంచేశారు.


ఇప్పటికే నాలుగు లక్షలకుపైగా వలసలు

ఇజ్రాయెల్ దాడులతో 7వ తేదీ నుంచి ఇప్పటిదాకా 4,23,000కుపైగా స్వస్థలాలను వదిలిపోయారని ఐరాస రిలీఫ్, రెఫ్యూజీ విభాగం తెలిపింది. వీరిలో 2,70,000కుపైగా ఐరాస శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. గాజాలో ప్రస్తుతం 50,000 మంది గర్భిణులు ఉన్నారు. యుద్ధం నేపథ్యంలో వీరికి అత్యవసర ఆరోగ్య సేవలు కరువయ్యాయి. ఆస్పత్రులపైనా రాకెట్ దాడులు జరుగుతుండటంతో రాబోయే రోజుల్లో ఆరోగ్య పరిస్థితి మరింత అధ్వానంగా ఉండనుందని తెలుస్తోంది.

అల్‌ఖైదా కంటే ప్రమాదకరం

'హమాస్'నుద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: పాత మసీదులు, యూదుల పురాతన ఆలయాల ఆనవాళ్లు ఉన్న పవిత్ర ప్రాంతాలపై పట్టు కోసం మొదలైన పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధం పలు మలుపులు తీసుకుంటున్న వేళ హమాస్ సాయుధసంస్థపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. అమెరికాలోని ఫిలడెల్ఫియాలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా బైడెన్ మాట్లాడారు. 2001 సంవత్సరంలో 9/11 సెప్టెంబర్ దాడులకు తెగబడిన అల్‌ఖైదా ఉగ్రసంస్థ కంటే హమాస్ ప్రమాదకరమైనదని అభివర్ణించారు. హమాస్ దాడులకు గురైన ఇజ్రాయెల్‌కు అమెరికా ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. ' ఇజ్రాయెల్‌పై దాడి చేసి హమాస్ ఏకంగా వేయి మందికిపైగా అమాయకులను పొట్టనబెట్టుకుంది. అల్‌ఖైదా సృష్టించిన 9/11 దాడులకంటే ఈ దాడి అత్యంత దారుణం. అల్‌ఖైదా కంటే హమాస్ ప్రమాదకరం. అల్‌ఖైదాను మించిన దుష్టులు వీరు. మొదట్నుంచీ చెబుతున్నట్లే మేం ఇజ్రాయెల్‌కు బాసటగా నిలబడతాం. ఆత్మరక్షణ కోసం, ప్రతిదాడుల కోసం ఇజ్రాయెల్ తీసుకునే ప్రతి నిర్ణయానికి, ప్రతీ చర్యకూ అమెరికా అండగా ఉంటుంది. గాజాలో నెలకొన్న మానవీయ సంక్షోభానికి తక్షణం ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఇందుకోసమే అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇప్పటికే ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు' అని బైడెన్ చెప్పారు.



ఐరాసతోనూ చర్చిస్తున్నాం

'ఇజ్రాయెల్ ప్రభుత్వంతోనేకాదు దాని పొరుగున ఉన్న జోర్డాన్, ఈజిప్ట్ ఇతర అరబ్ దేశాలతో మంతనాలు జరుపుతున్నాం. ఇరువైపులా దాడులు, ప్రతిదాడులతో పాలస్తీనా, ఇజ్రాయెల్‌లలో నెలకొన్న మానవీయ సంక్షోభం పోగొట్టేందుకు ఐక్యరాజ్యసమితితోనూ సమష్టిగా కృషిచేస్తున్నాం. చర్చిస్తున్నాం' అని అన్నారు.

ఆర్థిక, దౌత్యంలో నూతనాధ్యాయం

- నాలుగు దశాబ్దాల తర్వాత మొదలైన భారత్, శ్రీలంక పడవ ప్రయాణ సేవలు
- ద్వైపాక్షిక బంధానికి కీలకమని అభివర్ణించిన ప్రధాని మోదీ

నాగపట్నం/న్యూఢిల్లీ: దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్, శ్రీలంక మధ్య మొదలైన పడవ ప్రయాణ సేవలు ఇరుదేశాల ద్వైపాక్షిక బంధాన్ని సుదృఢం చేస్తాయని ప్రధాని మోదీ అభిలషించారు. శనివారం తమిళనాడులోని నాగపట్నం, జాఫ్నాలోని కంకెసంథురై మధ్య ఫెర్రీ సేవలు మొదలవడం అనేది ఇరుదేశాల మైత్రీ బంధంలో కీలకమైన మైలురాయి అని మోదీ శ్లాఘించారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ హైస్పీడ్ ఫెర్రీ సేవలు మొదలయ్యాయి. సముద్రమార్గంలో 110 కిలోమీటర్ల దూరాన్ని 3.5 గంటల వ్యవధిలో చేరుకోవచ్చు. ఫెర్రీ సేవలను లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా చెరియాపని అనే పడవ 50 మంది ప్రయాణికులతో శ్రీలంకకు బయల్దేరింది. సాయంత్రం కల్లా భారత్‌కు తిరిగొచ్చింది. 'ఇరుదేశాల మధ్య కనెక్టివిటీతో పాటు వాణిజ్యం, బంధాల బలోపేతానికి ఫెర్రీ సేవలు ఎంతో కీలకం' అని ప్రధాని మోదీ తన వీడియో సందేశంలో వ్యాఖ్యానించారు. ' ఈ బంధం ఈనాటిదికాదు. ప్రాచీన తమిళ సాహిత్యంలోనూ దీని ప్రస్తావన ఉంది. సంగం కాలం నాటి పట్టినాప్పలై, మణిమేఖలై సాహిత్యంలోనూ భారత్, శ్రీలంక నౌకల రాకపోకల వివరణ ఉంది. ప్రఖ్యాత కవి సుబ్రమణ్యభారతి రాసిన పాట 'సింధు నదియన్ మిసై'లోనూ రెండుదేశాల బంధాన్ని వివరించారు. చారిత్రక, సాంస్కృతిక బంధాల్లో ఈ పడవ ప్రయాణాల మధుర జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయి. ఇటీవల భారత్‌లో పర్యటించిన సందర్భంగా విక్రమసింఘే అనుసంధాన సంబంధిత విజన్ డాక్యుమెంట్‌ను భారత్‌తో పంచుకున్నారు. 2015లో శ్రీలంకలో నేను పర్యటించాకే ఢిల్లీ, కొలంబో మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి ' అని మోదీ గుర్తుచేసుకున్నారు.

మనసులనూ దగ్గర చేస్తోంది

'ఈ అనుసంధానం రెండు పట్టణాలను మాత్రమే కాదు. రెండు దేశాలను, దేశాల ప్రజలను, వారి మనసులనూ దగ్గర చేస్తోంది. 'పొరుగుదేశాలకు ప్రాధాన్యం' అనే మోదీ సర్కార్ విధానాన్ని మరింత తీసుకెళ్తున్నాం' అని ఈ సేవలను లాంఛనంగా పచ్చజెండా ఊపి ప్రారంభించిన భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నౌకలు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్ పాల్గొన్నారు. రెండు దేశాల మధ్య అనుసంధానం, వాణిజ్యం, పర్యాటకం, సాంస్కృతిక అనుబంధాలను మరింత మెరుగుపరిచేందుకు ఈ సేవలు దోహదపడతాయని శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే వ్యాఖ్యానించారు. గతంలో చెన్నై, కొలంబోల మధ్య తూత్తుకుడి మీదుగా ఇండో–సియోల్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో పడవ ప్రయాణాలు కొనసాగేవి. అయితేశ్రీలంకలో పౌర సంక్షోభం తలెత్తాక 1982లో ఆ సేవలు నిలిచిపోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు ఇలా పడవ సేవలు పునఃప్రారంభమయ్యాయి.

ఇండియా కూటమి రాకతో 33 శాతం అమలు తథ్యం

మహిళా రిజర్వేషన్ బిల్లుపై సోనియా గాంధీ వ్యాఖ్య



కార్యక్రమ వేదికపై సీఎం స్టాలిన్, కనిమొళి, సోనియా గాంధీ, సుప్రియా సూలే

సాక్షి, చెన్నై: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారం చేపట్టి పార్లమెంట్ ఆమోదం పొందిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును అమల్లోకి తీసుకు రావడం తథ్యం అని ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆ పార్టీ మహిళా విభాగం నేతృత్వంలో చెన్నై వైఎంసీఏ మైదానంలో మహిళా హక్కు మహానాడు శనివారం రాత్రి జరిగింది. డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన, డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలో జరిగిన ఈ మహానాడుకు ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ హాజరయ్యారు. ఆమె ప్రసంగిస్తూ, దేశంలో మహిళలు వివిధ రంగాలలో పురోగమిస్తున్నారని అన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాలనే కాంక్షతో ఆది నుంచి కాంగ్రెస్ పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. ఒక మహిళ చదువుకుంటే, ఆ కుటుంబమే చదువుకున్నట్లని వ్యాఖ్యానించారు. మహిళా నాయకత్వం విస్తృతం, మహిళ చేతికి అధికారంలోకి వస్తే దేశం బలోపేతం అవుతుందన్న కాంక్షతో గతంలోనే 33 శాతం రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టామన్నారు. యూపీఏ హయాంలోనే ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందినా, ఏకాభిప్రాయం కుదరక పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందలేక పోయినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు ఆ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిందని గుర్తు చేస్తూ, దీనిని ఎప్పుడు అమలు చేస్తారో అన్నది స్పష్టం చేయడం లేదన్నారు. రేపు చేస్తారా..? ఎల్లుండి చేస్తారా..? ఏడాది తర్వాత చేస్తారా..? రెండేళ్ల తర్వాత చేస్తారా...? అని ప్రశ్నిస్తూ, ఈ బిల్లు అమలు అన్నది రానున్న ఇండియా కూటమి ద్వారానే సాధ్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఈ చట్టం కోసం కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేసిందని గుర్తుచేస్తూ, ఇండియా కూటమి రాకతో ఈ చట్టం అమల్లోకి రావడం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, బిహార్ ఆహార శాఖ మంత్రి లేషి సింగ్, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సుష్మితా దేవ్, ఢిల్లీ డిప్యూటీ స్పీకర్ రాఖీ తదితరులు పాల్గొన్నారు.

235 మందితో రెండో విమానం రాక

కొనసాగుతున్న 'ఆపరేషన్ అజయ్'

న్యూఢిల్లీ: సంక్షుభిత ఇజ్రాయెల్ నుంచి భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. 'ఆపరేషన్ అజయ్' పేరిట భారత సర్కార్ మొదలుపెట్టిన పౌరుల తరలింపు కార్యక్రమంలో భాగంగా శనివారం 235 మందితో ఇజ్రాయెల్ నుంచి బయల్దేరిన విమానం భారత్‌కు చేరుకుంది. ఢిల్లీకి ఈ విమానం చేరుకుందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరీందమ్ బాగ్చీ శనివారం వెల్లడించారు. ఢిల్లీ విమానాశ్రయంలో పౌరులు చేరుకున్న ఫొటోలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో షేర్ చేశారు. టెల్ అవీవ్ నగరం నుంచి తొలి విమానం వచ్చిన సంగతి తెల్సిందే. ఎయిర్ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఆ ఆపరేషన్ కింద తొలి విమానంలో 200కుపైగా భారతీయులు స్వదేశానికి రాగలిగారు. వీరికి విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ స్వాగతం పలికారు. ' మోదీ సర్కార్ తక్షణం స్పందించి తమ పౌరులను స్వదేశానికి తీసుకురావడం పట్ల వీరంతా సంతోషంగా ఉన్నారు' అని మంత్రి ట్వీట్‌చేశారు. దీంతో శనివారంనాటికి మొత్తంగా 400కుపైగా భారత్‌కు చేరుకున్నారు.

మరో రెండు విమానాలూ వస్తున్నాయ్

టెల్ అవీవ్ స్థానిక కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఐదింటికి, రాత్రి 11 గంటలకు మరో రెండు ప్రత్యేక విమానాలు భారత్‌కు బయల్దేరతాయని టెల్ అవీవ్‌లోని ఇండియన్ ఎంబసీ తెలిపింది. సాయంత్రం విమానంలో 230కిపైగా, రాత్రి విమానంలో 330కిపైగా ప్రయాణికులు స్వదేశానికి రానున్నారు. బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఇవి బయల్దేరతాయి. సంబంధిత వివరాలను ఎంబసీ ట్వీట్‌చేసింది. విద్యార్థులు, ఐటీ వృత్తినిపుణులు, వజ్రాల వ్యాపారులు సహా పలు రంగాలకు చెందిన దాదాపు 18,000 మంది భారతీయపౌరులు ఇజ్రాయెల్‌లో ఉంటున్న విషయం తెల్సిందే.

తీసుకొచ్చేందుకు వెళ్తున్నాయ్

భారత్ నుంచి చెరో విమానాన్ని ఇజ్రాయెల్‌కు నడపనున్నట్లు ఎయిర్ఇండియా, స్పైస్‌జెట్ విమానయాన సంస్థలు శనివారం ప్రకటించాయి. టెల్అవీవ్‌కు వెళ్లి అక్కడి భారతీయులను తీసుకొస్తామని సంస్థలు పేర్కొన్నాయి. ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఈ రెండు సర్వీస్‌లు నడవనున్నాయి. ఢిల్లీ నుంచి ఎయిర్ఇండియా విమానం, అమృత్‌సర్ నుంచి స్పైస్‌జెట్ విమానం బయల్దేరతాయి. ఆదివారంకల్లా రెండూ ఢిల్లీకి వస్తాయి.



ఇజ్రాయెల్ నుంచి శనివారం ఢిల్లీకి చేరుకున్న భారతీయులతో మాట్లాడుతున్న మంత్రి రంజన్ సింగ్

సాక్షి | ఆదివారం | 15 | అక్టోబర్ | 2023
హైదరాబాద్ | www.sakshi.com

ఓట్ దిస్ పాయింట్

పోలింగ్ రోజు ఓ వ్యక్తికి బదులు మరో వ్యక్తి ఓటేయవచ్చా?

- లేదు. ఓటరు సమ్మతి ఉన్నా అతడి స్థానంలో వేరే వ్యక్తి ఓటేయడానికి వీలు లేదు. ఒక వేళ చేస్తే ఐపీసీ సెక్షన్ 171డీ కింద కేసు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేరం రుజువైతే జరిమానా లేదా గరిష్టంగా ఏడాది కారాగార శిక్ష, లేదా రెండింటిని న్యాయస్థానాలు విధిస్తాయి.

ఒక వ్యక్తి ఒకటికంటే ఎక్కువ సార్లు ఓటేయవచ్చా? అతడి ఓటు పొరపాటున రెండు సార్లు ఓటర్ల జాబితాలో వచ్చి ఉంటే రెండు సార్లు ఓటేయవచ్చా?

- లేదు. ఒకసారికి మించి ఎవరూ ఓటేయలేరు. ఓటర్ల జాబితాలో పేరు ఎన్నిసార్లు ఉన్నా, ఓటు హక్కు ఒకేసారి వినియోగించుకోవాలి. లేకుంటే కేసులు తప్పవు.

ఓటరు నివాసం నుంచి పోలింగ్ కేంద్రం ఎంత దూరంలో ఉండాలి?

- ఓటరు నివాసం నుంచి 2 కి.మీల లోపు పోలింగ్ కేంద్రం ఉండాలి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 800–1000 మంది ఓటర్లను కేటాయిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో 1,200 మంది వరకు కేటాయించేందుకు అనుమతి ఉంది.

పోలింగ్ కేంద్రానికి వెళ్లాక మీ ఓటును అప్పటికే వేరే వాళ్లు వేసేసి ఉంటే మీరు ఓటు వేయవచ్చా?

- అవును. ఓటేయవచ్చు. అలాంటి సందర్భాల్లో మీకు ఓటు హక్కు కల్పిస్తారు. అయితే మీ బ్యాలెట్ పేపర్‌ను టెండర్ ఓటుగా ప్రిసైడింగ్ అధికారి మార్క్ చేస్తారు. ఈ ఓటును వేరుగా ఉంచుతారు.

మీకు తెలుసా?

- 1962, 1967 ఎన్నికలలో గెలుపొంది మంత్రిగా కూడా పనిచేసిన కార్మిక సంఘం నేత జి.సంజీవరెడ్డి ఇప్పటికీ జీవించి ఉన్నారు. 1962 ఎన్నికలలో పోటీచేసి గెలిచినవారిలో ఈయన ఒక్కరే సజీవంగా ఉండడం విశేషం. ఆయన రాజ్యసభ సభ్యుడిగా కూడా వ్యవహరించారు.
- 1962లో తొలిసారిగా ఉమ్మడి ఏపీలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు కలిపి శాసన సభ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో అధిక సంఖ్యలో ఇండిపెండెంట్లు కూడా గెలవడం ఒక ప్రత్యేకత అని చెప్పాలి. అంతేకాక ప్రస్తుతం బలహీనంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండేది. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ కు 177 సీట్లు వస్తే సీపీఐకి 51 సీట్లు వచ్చాయి. ఇండిపెండెంట్లు 51 మంది నెగ్గారు. తెలంగాణ వరకు తీసుకుంటే కాంగ్రెస్ పక్షాన 64 మంది, సీపీఐ నుంచి 18 మంది, స్వతంత్ర పార్టీ తరఫున ముగ్గురు, సోషలిస్టులు ఇద్దరు గెలవగా, ఇండిపెండెంట్లు 19 మంది గెలుపొందారు.
- 1967 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా రికార్డు స్థాయిలో ఇండిపెండెట్లు గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌కు 165, స్వతంత్ర పార్టీకి 29, సీపీఐ 10, సీపీఎం 9, బీజేఎస్ ముగ్గురు, ఆర్పీఐ ఇద్దరు, ఎస్.ఎస్.పి పక్షాన ఒకరు గెలవగా, మొత్తం 68 మంది స్వతంత్రులు అంటే ఇండిపెండెంట్లు గెలుపొందడం ఒక రికార్డు. కాంగ్రెస్ టికెట్ రానివారు కాని, సొంతంగా బలం ఉన్నవారు కాని ఇలా రాజకీయ పార్టీలను ఓడించి ఇండిపెండెంట్‌గా గెలిచారన్నమాట. తెలంగాణ వరకు తీసుకుంటే కాంగ్రెస్ 64, సీపీఐ 4, సీపీఎం 4, ఎస్ఎస్‌పీ, ఆర్పీఐ, బీజేఎస్ నుంచి ఒక్కొక్కరు చొప్పున గెలవగా, 26 మంది ఇండిపెండెంట్లు గెలిచారు. ఈ ఎన్నికలో తెలంగాణలో 101 అసెంబ్లీ సీట్లే ఉన్నాయి.

మేనిఫెస్టో... మా ఇష్టమంటే కుదరదు

- ఇష్టారాజ్యంగా మేనిఫెస్టోల రూపకల్పన కుదరదు
- ఎన్నికల ప్రవర్తన నియమావళిలో విధివిధానాలు
- దీనికి అనుగుణంగానే హామీలు, వాగ్దానాలు ఉండాలి

సాక్షి, హైదరాబాద్

ఎన్నికల మేనిఫెస్టోల ప్రకటనలో రాజకీయపార్టీల ఇష్టారాజ్యం ఉండదు. ఓటర్లను ఆకర్షించేందుకు హామీలు ఇవ్వడం...గెలిచాక అమలు చేయకపోవడం..లేకపోతే ఆచరణ సాధ్యంకాని హామీలతో ఓట్లు కొల్లగొడదామంటే ఎన్నికల ప్రవర్తన నియమావళి అంగీకరించదు. ఎందుకంటే..ఎన్నికల ప్రవర్తన నియమావళిలో 8వ భాగంగా మేనిఫెస్టో చేర్చుతూ 2015 ఏప్రిల్ 24న కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎన్నికల మేనిఫెస్టోల్లో హామీలు ఎలా ఉండాలి? ఎలా ఉండరాదు? అన్న అంశాలు ఉన్నాయి. దీంతో మేనిఫెస్టోల విషయంలో రాజకీయపార్టీలు, అభ్యర్థులు పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఓటర్లకు వ్యక్తిగత ప్రయోజనం కలిగించే ఉచిత హామీలిచ్చేందుకు ఈ నిబంధనలు అంగీకరించవు.

'హామీలు' రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలి

రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాలు, విలువలకు భంగం కలిగించే అంశాలేమీ మేనిఫెస్టోలో ఉండరాదు. ఎన్నికల ప్రవర్తన నియమావళి స్ఫూర్తికి అనుగుణంగా మాత్రమే ఉండాలి.

పౌరులకు వివిధ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయాలని.. ప్రభుత్వ విధానాలపై రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలు స్పష్టం చేస్తున్నాయి. మేనిఫెస్టోల్లో వాగ్దానాలు చేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగేలా ఆ హామీలు ఉండరాదు. ఓటు వినియోగించే విషయంలో ఓటర్లను అనుచిత ప్రలోభాలకు గురి చేయకూడదు.

మేనిఫెస్టోలో ప్రకటించే హామీలు హేతుబద్ధంగా ఉండాలి. వీటి అమలుకు అనుసరించే మార్గాలు, అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ సైతం సవివరంగా ఓటర్లకు తెలియజేయాలి. నెరవేర్చగలిగే వాగ్దానాల ద్వారానే ఓటర్ల నమ్మకాన్ని కోరాలి.

నిషేధాజ్ఞలు అమల్లోకి వస్తే...

ప్రజాప్రాతినిధ్య చట్టం–195లోని సెక్షన్ 126లో నిర్దేశించిన నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పుడు మేనిఫెస్టోలు విడుదల చేయొద్దు.

- ఒకేవిడత ఎన్నికల విషయంలో పోలింగ్‌కు ముందు అమలుచేసే నిషేధాజ్ఞల కాలవ్యవధిలో మేనిఫెస్టోలు ప్రకటించరాదు.
- ఒకటికంటే ఎక్కువ విడతల్లో ఎన్నికలు జరిగితే..ప్రతి విడత పోలింగ్‌కు ముందు ప్రకటించే నిషేధాజ్ఞల వ్యవధిలో మేనిఫెస్టోలు విడుదల చేయొద్దు.

గతంలో రాజకీయపార్టీలు ప్రజలకు మీడియా ద్వారా మాత్రమే ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించేవి. కానీ ఇప్పుడు మేనిఫెస్టో ఎన్నికల సంఘానికి తప్పనిసరిగా సమర్పించాల్సిందే. ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన మూడు రోజుల్లోగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ)కి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా ఆంగ్ల/హిందీ భాషల్లో మూడు ప్రతులు సమర్పించాలని ఎన్నికల సంఘం నిబంధనలు చెబుతున్నాయి.

సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరి

ఎన్నికల ప్రవర్తన నియమావళిలోని 8వ భాగంలో పేర్కొన్న విధివిధానాలకు అనుగుణంగానే మేనిఫెస్టోలో హామీలు, కార్యక్రమాలు, విధానాలు పొందుపర్చినట్టు స్వీయ ధ్రువీకరణ పత్రం(డిక్లరేషన్) సైతం మేనిఫెస్టోతో పాటు సీఈఓకు సమర్పించాలి. 2016 డిసెంబర్ 27న ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ ఉత్తర్వుల కారణంగా రాజకీయపార్టీల ఎన్నికల మేనిఫెస్టోలను భవిష్యత్ అవసరాల కోసం ఎన్నికల సంఘం భద్రపరుస్తుంది.

'సుప్రీం' చొరవతో మేనిఫెస్టోకు పారదర్శకత

ఎన్నికల మేనిఫెస్టోలో ఉండాల్సిన హామీల విషయంలో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపి మార్గదర్శకాలను నిర్దేశించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ 2013 జూలై 5న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్.సుబ్రమణ్యం బాలాజీ వేసిన కేసులో ఈ నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తన తీర్పులో చేసిన సూచనల ఆధారంగా మేనిఫెస్టోలపై మార్గదర్శకాలను ఈసీఐ రూపకల్పన చేసింది. సుప్రీంకోర్టు చేసిన సూచనలు ఇవే...

- మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం అవినీతి చర్యలుగా పరిగణించడానికి ఆస్కారం లేదు. అయినప్పటికీ, ఏ విధమైన ఉచిత హామీలైనా ప్రజలందరినీ ప్రభావితం చేస్తాయనడంలో అనుమానం లేదు. స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికలకు ఇలాంటి హామీలతో తీవ్రస్థాయిలో కుదుపునకు గురవుతాయి.
- ఎన్నికల్లో పోటీపడే పార్టీలు/అభ్యర్థుల సమాన అవకాశాలను పరిరక్షించడానికి, స్వచ్ఛమైన ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఎన్నికలసంఘం గతంలో సైతం ఎన్నికల ప్రవర్తన నియమావళి కింద ఇలాంటి ఆదేశాలు జారీ చేసింది. స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ద్వారా ఎన్నికల సంఘానికి ఇలాంటి అధికారాలు లభించాయి.
- సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటిస్తాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందటి చర్యలను నియంత్రించే అధికారం ఎన్నికల సంఘానికి ఏ మాత్రం లేదు. అయితే, మేనిఫెస్టోలు ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటాయి కాబట్టి వీటి విషయంలో ఎన్నికల సంఘం మినహాయింపు కలిగి ఉంటుంది.



ప్రధాన దేశాల్లో పార్టీల విధానాలే హామీలు

అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, స్వీడన్, కెనడా, నెదర్లాండ్, ఆస్ట్రియా, ఇతర పశ్చిమ ఐరోపా దేశాల్లో వ్యక్తిగత లబ్ధి కలిగించే ఉచిత హామీలు మేనిఫెస్టోల్లో ప్రకటించరు. రాజకీయపార్టీలు తమ సిద్ధాంతాలకు అనుగుణంగా ఆర్థిక విధానాలు, విదేశీ వ్యవహారాలు, ఆరోగ్య సంరక్షణ, పాలనాసంస్కరణలు, పర్యావరణ అంశాలు, వలసలు వంటి అంశాలపై తమ విధానాలను మాత్రమే ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తాయి.

భూటాన్, మెక్సికో వంటి దేశాల్లో రాజకీయ పార్టీలు/అభ్యర్థుల ఎన్నికల మేనిఫెస్టోలను ఆయా దేశాల ఎన్నికల యంత్రాంగానికి తొలుత సమర్పిస్తాయి. ఎన్నికల యంత్రాంగం పరిశీలించి అవసరమైతే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న హామీలను తొలగించాలని ఆదేశిస్తుంది. యూకేలో సైతం మేనిఫెస్టోలపై మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయి.

మన దగ్గరా మేనిఫెస్టోలు ఈసీ పరిశీలించాలనే డిమాండ్

మన దేశంలో సైతం రాజకీయపార్టీలు మేనిఫెస్టోలను తొలుత ఎన్నికల సంఘానికి సమర్పించాలని, ఎన్నికల సంఘం పరిశీలించి ఆమోదించిన తర్వాతే ప్రజలకు ప్రకటించాలని చాలాకాలంగా డిమాండ్ ఉంది. మేనిఫెస్టోలను ఎన్నికల సంఘం పరిశీలించి ఆచరణకు సాధ్యం కాని, ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఉన్న హామీలను తొలగింపునకు ఆదేశించాలని స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు మేనిఫెస్టోలను తాము పరిశీలించడం ఆచరణలో సాధ్యం కాదని ఎన్నికల సంఘం అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ మేనిఫెస్టోల్లో మార్పులు సూచిస్తే రాజకీయ పార్టీలు న్యాయస్థానాలకు వెళ్లే అవకాశముందని, దీంతో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం కష్టమవుతుందంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరిస్తే ప్రజలు న్యాయస్థానాన్ని ఆశ్రయించొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

విగ్రహాలకు తెల్లటి వస్త్రాలు

బతుకమ్మ చీరల తొలగింపు

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఎన్నికల కోడ్‌లో భాగంగా వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు చుట్టిన బతుకమ్మ చీరలను శనివారం తొలగించారు. నాయకుల విగ్రహాలకు బతుకమ్మ చీరలను చుట్టడంపై 'శారీ.. కోడ్ ఉల్లంఘించారు' శీర్షికతో శనివారం 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో గ్రామంలోని విగ్రహాలన్నింటికి చుట్టిన బతుకమ్మ చీరలను తొలగించి.. తెల్ల వస్త్రాలను చుట్టారు.

సాక్షి ఎఫెక్ట్..

– చిట్యాల



చిట్యాల మండలం వెలిమినేడులోని విగ్రహానికి చుట్టిన తెల్లటి వస్త్రం


హామీలను నెరవేర్చిన.. పార్టీలకే ఓటేయాలి

- మేనిఫెస్టోల్లో ఇంతకుముందు ఇచ్చినవీ నెరవేర్చారో లేదో చూడాలి
- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ప్రజల మేనిఫెస్టో విడుదల
- పార్టీలిచ్చే హామీలు రాష్ట్ర బడ్జెట్‌ను మించిపోతున్నాయని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: 'మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన పార్టీలకు, మంచి చేస్తారనే అభ్యర్థులకే ఓటేయాలి. అధికారంలోకి రావడం కోసం అనేక వాగ్దానాలు చేస్తుంటారు. కానీ అవి అమలయ్యే హామీలా? కాదా? అనేది చూడాలి. అలాగే ఇంతకుముందు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు చేశారో చూడాలి. పార్టీలిచ్చే హామీలు రాష్ట్ర బడ్జెట్‌ను మించిపోతున్నాయి. కొన్ని పార్టీల మేనిఫెస్టోలు ఉత్తుత్తవిగా ఉంటున్నాయి' అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) 'ప్రజల మేనిఫెస్టో–2023'ని విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు, ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం పోయేలా ఉంది. పార్టీలు చట్టాల పరిధిలో లేక తామే ఒక చట్టంగా వ్యవహరిస్తున్నాయి. గెలిచిన పార్టీలు అంతా తమదే అనుకుంటున్నాయి. మార్పు కోసం రాజ్యాంగ సంస్కరణలు రావాలి' అని చెప్పారు. ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ 'మా ఓటు అమ్మకానికి లేదు. మద్యం, డబ్బు సంచులతో రావద్దు' అని ఓటర్లు నినదించాలన్నారు. జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. పార్టీలు రకరకాల తాయిలాలతో విడుదల చేసే మేనిఫెస్టులు చిత్తు కాగితాలతో సమానమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సోమా శ్రీనివాస్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

ఎఫ్‌జీజీ మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు..

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్యానికి 25 శాతం నిధులు కేటాయించాలి.
- సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో 30 శాతానికి మించకుండా కేటాయించాలి.
- పెట్రోలు, డీజిల్‌పై ట్యాక్స్ తగ్గించాలి.
- రైతుబంధు పది ఎకరాల్లోపు రైతులకే ఇవ్వాలి. కౌలు రైతులకూ రైతుబంధు ఇవ్వాలి.
- పంటల బీమా అమలు చేయాలి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మూడు బోర్ల వరకు పరిమితి విధించాలి.
- నీటి పారుదల ప్రాజెక్టులపై ఒక ఉన్నత కమిటీ ఉండాలి.
- ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలి. అవినీతికి అడ్డుకట్ట వేయాలి.
- లోకాయుక్త చట్టాన్ని కర్ణాటకలో మాదిరిగా సవరించాలి.
- కేంద్రంతో రాష్ట్రం మంచి సంబంధాలు కలిగి ఉండాలి.
- పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి.
- దశల వారీగా మద్యనిషేధాన్ని అమలు చేయాలి. మాదక ద్రవ్యాలను ఉక్కుపాదంతో అణచివేయాలి.
- పార్టీలు తమ మేనిఫెస్టోలో చెప్పిన పథకాలకయ్యే వ్యయం వివరిస్తూ, ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో కూడా తెలపాలి.
- ఆహార కల్తీపై గట్టి నిఘా ఉండాలి. నైపుణ్యం, ఉపాధి పెంచాలి.
- సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు తమ ఆస్తి వివరాలు వెల్లడించాలి.
- మహిళలకు 25శాతం టికెట్లు కేటాయించాలి.
- నేర చరిత్రులకు టికెట్ ఇవ్వొద్దు.
- ప్రభుత్వ భూముల అమ్మకంపై నిషేధం విధించాలి. ధరలపై నియంత్రణ ఉండాలి.
- గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలి.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో పీపుల్స్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, జస్టిస్ రామలింగేశ్వరరావు, ఫోరమ్ ఫర్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు

రికార్డుల జోరు.. కేసీఆరు



కొమ్మినేని శ్రీనివాసరావు

- తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన కేసీఆర్
- ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం రెండుసార్లు పార్టీ ఎమ్మెల్యేలతో రాజీనామాలు
- ఒకే టర్మ్‌లో ఒక సాధారణ ఎన్నికతో సహా రెండు ఉప ఎన్నికల్లో గెలుపు
- తెలంగాణలో ఎనిమిది సార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నేత
- తెలంగాణ నేత ఇన్నేళ్లపాటు సీఎంగా ఉండడం కూడా రికార్డే

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తన రాజకీయ జీవితంలో పలు రికార్డులు సృష్టించారు. తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేతితో నడిపి రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా ప్రజాస్వామ్య చరిత్రలో తనకంటూ స్థానాన్ని కేసీఆర్ సుస్థిరం చేసుకున్నారు. ప్రముఖ నటుడు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొలి రోజుల్లో ఆ పార్టీలో చేరిన వ్యక్తుల్లో కేసీఆర్ ఒకరు. మూడు భాషల్లో చాతుర్యం ఆయనకు కలిసి వచ్చింది. 1983 ఉమ్మడి ఏపీ శాసనసభ ఎన్నికలలోనే సిద్దిపేట నుంచి ఆయనకు పోటీచేసే అవకాశం వచ్చింది. కానీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ ఓటమి చెందారు. వైఫల్యాలే సాఫల్యాలకు మెట్లు అన్న సూక్తి కేసీఆర్ విషయంలో బాగానే వర్తిస్తుంది. తొలిసారి పరాజయం చెందినా, ఆ తర్వాత 1985లో అక్కడి నుంచే గెలుపొందారు. ఆ తర్వాత ఆయన వెనుతిరిగి చూడలేదు. సిద్దిపేటను ఆయన తన కంచుకోటగా మార్చుకున్నారు. నిత్యం ప్రజలలో ఉండడం, వాగ్దాటితో వారిని ఆకర్షించడం ఆయనకు కలిసి వచ్చింది. 1989 ప్రాంతంలో కొద్దికాలం కరువు పరిస్థితులను పర్యవేక్షించే వారిలో ఈయన కూడా ఒకరయ్యారు. వీరికి కేబినెట్ హోదా ఉండడంతో కరువు మంత్రులని పిలిచేవారు. కేసీఆర్ 1985, 1989, 1994, 1999, 2001, 2004లలో సిద్దిపేట నుంచి గెలిచారు. 2014, 2018లలో గజ్వేల్ నుంచి విజయపతాకను ఎగురవేశారు. ఈ చరిత్రను పరిశీలిస్తే 1995లో టీడీపీలో తిరుగుబాటు సమయంలో కేసీఆర్ కూడా చంద్రబాబునాయుడి పక్షంలోనే ఉన్నారు. అయినా చంద్రబాబు తన కేబినెట్‌లో చోటివ్వలేదు. అది ఆయనకు అసంతృప్తి కలిగించింది. సిద్దిపేట నుంచి వచ్చిన ఈయన మద్దతుదారులు రాజ్‌భవన్ వద్ద ఆందోళన చేసినంత పనిచేశారు. కాగా తదుపరి విస్తరణలో మంత్రి పదవి ఇచ్చారు. జన్మభూమి వంటి ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పనలో ఈయనకు పాత్ర ఉంది.

అప్పట్లో చంద్రబాబు మంత్రి పదవి ఇచ్చి ఉంటే..

1999 ఎన్నికలలో వాజ్‌పేయి సానుభూతి అస్త్రం పనిచేసి టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు ఎందువల్లో కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వడానికి ఇష్టపడలేదు. సీబీఐ డైరెక్టర్‌గా పనిచేసి రిటైరైన విజయ రామారావుకు తటస్థుల కోటా అంటూ ఖైరతాబాద్ టికెట్ ఇవ్వడం ఆయన గెలుపొందడం, మంత్రి కావడం జరిగింది. అదే ఉమ్మడి ఏపీ రాజకీయాలలో పెద్ద మలుపు అని చెప్పవచ్చు. కేసీఆర్ దీనిని తీవ్ర అవమానంగా భావించారు. దీంతో ఆయనను శాంతింప చేయడానికి ఉప సభాపతి పదవిని చంద్రబాబు ఇచ్చారు. అయినా ఆయన సంతృప్తి చెందలేదు. కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా చంద్రబాబు చారిత్రక తప్పిదం చేశారని చాలా మంది సమైక్య రాష్ట్ర వాదులు భావిస్తుంటారు. అప్పట్లో మంత్రి పదవి ఇచ్చి ఉంటే ప్రత్యేక రాష్ట్ర ఆలోచన వైపు కేసీఆర్ వెళ్లకపోయేవారన్నది చాలామంది అభిప్రాయం. కాగా అప్పట్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ మాజీ మంత్రి ఇంద్రారెడ్డి వంటివారు, కొన్నివర్గాలు డిమాండ్ చేస్తుండేవారు. ప్రొఫెసర్ జయశంకర్ వంటివారు తెలంగాణ మేధావులుగా అప్పటికే గుర్తింపు పొందారు. అలాంటి వారితో ఆయన చర్చలు జరిపేవారు. అందుకు ఆయన హోదా కూడా బాగా ఉపయోగపడింది. ఈ క్రమంలోనే ఆయన టీడీపీకి, సిద్దిపేట సీటుకు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించారు. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో అదే టికెట్‌పై పోటీచేసి ఉపఎన్నిక ద్వారా చంద్రబాబు కు సవాల్ విసిరారు. కేసీఆర్‌ను ఓడించడానికి చంద్రబాబు సర్వశక్తులు ఒడ్డినా లాభం లేకపోయింది. ప్రస్తుతం కేసీఆర్ మంత్రివర్గంలో ఉన్న తలసాని శ్రీనివాస యాదవ్, బీఆర్ఎస్‌లోనే ఉన్న సీనియర్ నేత వేణుగోపాలాచారి తదితరులు సిద్దిపేటలో టీడీపీ పక్షాన పనిచేశారు.

2004 నుంచి మొదలు..

2004 నుంచి కేసీఆర్‌వి అన్నీ రికార్డులే అని చెప్పాలి. ఆ ఏడాది కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని తన పార్టీకి 26 సీట్లు సాధించారు. అదే టైమ్‌లో ఆయన కరీంనగర్ నుంచి లోక్‌సభకు కూడా పోటీచేసి గెలిచి కేంద్ర మంత్రి అయ్యారు. కానీ తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌పై కాంగ్రెస్ అంత సానుకూలంగా లేదని భావించి పదవికి రాజీనామా చేశారు. ఆ దశలో అప్పటి మంత్రి ఎం.సత్యనారాయణరావు చేసిన కొన్ని వ్యాఖ్యల ఆధారంగా తన ఎంపీ పదవికి కూడా రాజీనామా చేసి ఉపఎన్నికలో మరోసారి గెలుపొందారు. అక్కడితో ఆగలేదు. తన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయాలని ఆయన ఆదేశించగా 16 మంది మాత్రమే దానిని పాటించారు. అయినా పట్టు వీడలేదు. తాను కూడా పదవికి మళ్లీ రాజీనామా చేసి ఇంకోసారి ఉప ఎన్నికలో పోటీచేసి గెలిచారు. ఒక నేత ఇలా ఒకే టర్మ్‌లో ఒక సాధారణ ఎన్నికతో సహా రెండు ఉపఎన్నికల్లో గెలవడం రికార్డు. 2009లో మహబూబ్‌నగర్ నుంచి లోక్‌సభకు పోటీచేసి నెగ్గారు. తిరిగి 2014లో తెలంగాణ వచ్చాక గజ్వేల్ అసెంబ్లీతో పాటు మెదక్ నుంచి లోక్‌సభకు పోటీచేసి మళ్లీ గెలిచారు. అప్పటికి ఏడుసార్లు అసెంబ్లీకి, ఐదుసార్లు లోక్‌సభకు ఒక నేత ఎన్నికవడం తొలిసారి అని చెప్పాలి. 2018లో 8వసారి అసెంబ్లీకి ఎన్నికై తెలంగాణలో అన్నిసార్లు ఎన్నికైన ఏకైక నేతగా రికార్డు సృష్టించారు.

సొంత రికార్డును బ్రేక్ చేసేలా..

2023లో మళ్లీ రెండుచోట్ల శాసనసభకు పోటీ చేస్తూ తన రికార్డును తానే అధిగమించే యత్నంలో కేసీఆర్ ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఇన్నిసార్లు ఎన్నికలలో పోటీచేసింది, గెలిచింది కేసీఆర్ ఒక్కరే అని చెప్పాలి. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు నాలుగు ఎన్నికలలో తొమ్మిది చోట్ల పోటీచేసి ఒకచోట ఓడిపోయి ఎనిమిది చోట్ల గెలిచారు. కేసీఆర్ అలాకాకుండా తొమ్మిది ఎన్నికలలో పోటీచేసి ఎనిమిది సార్లు గెలవడం, మళ్లీ పదోసారి పోటీకి సిద్ధమవడం విశేషం. తెలంగాణ రాష్ట్ర సాధనకు రెండుసార్లు తన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడం మరో రికార్డు. అన్నిటినీ మించి ఒక తెలంగాణ నేత ఇన్నేళ్లపాటు సీఎంగా ఉండడం సరికొత్త రికార్డు అని చెప్పాలి. తెలంగాణ నేతలలో ఎవరూ తొమ్మిదిన్నరేళ్లు సీఎంగా ఉండలేదు. పీవీ నరసింహారావు, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, అంజయ్యలకు ఒక టర్మ్ కూడా పూర్తిగా చేసే అవకాశం రాలేదు. ఈ రకంగా కూడా కేసీఆర్‌ది ఒక రికార్డు.



సర్వేలు.. పిట్ట కథలు



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

పక్షి రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది.

'నేను చాలా తెలివైన పక్షిని. అప్పట్లో నాకు దాహమేసినప్పుడు... చిన్నిచిన్ని గులకరాళ్లు కుండలో వేసి... అడుగునున్న నీళ్లు పైకి రప్పించా. నా ఈ అవిడియాను అడవివ్యాపితం చేసేసి, పక్షి రాష్ట్రంలో నీళ్ల కొరతే లేకుండా చేస్తా. అన్నట్టు... మన ఈ ప్రాజెక్టు పేరు... 'మిషన్ రాయి-కుండ!' దీంతో మన రాజ్యం 'బంగారు పిచ్చుక' అయిపోతుంది' అంటూ తన వాగ్దానాన్ని ప్రకటించింది కాకి.

'చూడండి... పొరుగునే ఉన్న అడవిలో మా జాతి ఈగిల్సు ఓ సరికొత్త ప్రోగ్రాముకు 'రెక్కా'రం చుట్టి పవర్లోకి వచ్చాయి. అదేమిటంటే... మా రెక్కల బలం ఎక్కువ కదా. ఇకపై ఆడ ఈగిల్సు ఎగరక్కర్లే. వాటిని మేమే రెక్కల మీద మోసుకుపోయి, ఎక్కడ కావాలంటే అక్కడ దిగబెడతాం' అంటూ తమ మేనిఫెస్టో ప్రకటించాయి గద్దలు.

ఇలాంటి మేనిఫెస్టోలేవీ ప్రకటించడం లేదని కొందరంటే... కొంగలకు తెగ కోపమొచ్చింది. 'మాకు ఇలాంటివేవీ అక్కర్లేదు. మనం కొంగజాతి. మనది 'జపం' చేసే జాతి. ఆ కొంగజపం కూడా ఒంటికాలి మీద... ఓ తపస్సులా! మన కాళ్లు ఎంతో పొడుగు. మన రంగు తెల్లటి తెలుపు. గెలుపు కోసం మాకు మేనిఫెస్టోలూ, వాగ్దానాలూ అక్కర్లేదు. మా జపాలు, పొడవు కాళ్లూ, పవిత్రమైన తెల్లరంగూ... మాకివే చాలు' ఇదీ కొంగల ధీమా.

వాళ్లవాళ్ల మేనిఫెస్టోలను బట్టీ, గతంలో ఆయా పక్షులు సమస్త పిట్టజాతికి అందించిన సేవల్ని బట్టీ... వీళ్లలో ఎవరు గెలుస్తారో తెలుసుకోడానికి ఓ పిట్ట బృందం సర్వే చేసి, ఓ రిపోర్టు సమర్పించింది. అంతే... ఆ మరుక్షణమే 'పిచ్చి-కా' ఛానెల్‌లో డిబేట్లు మొదలయ్యాయి. గూట్లోని సోఫాలో కూర్చుని తీరిగ్గా టీవీ చూస్తూ... ఆ విశ్లేషణలు వింటున్న ఓ పిట్ట దంపతులు మాట్లాడుకుంటున్న మాటలివి.

''ఆ 'ఎక్స్-ఓటరు' సర్వేవారు కాకి గెలుపు తథ్యం అంటున్నారు. ఇక ఈ 'వై-ప్యాక్' వారు గద్దదే విజయమంటున్నారు. ఇంతకీ ఈ సర్వేల్లో ఏది నిజం? ఎవరు గెలుస్తారంటారు?'' అడిగింది ఆడ-పిట్ట.

''పిచ్చి(క)దానా... మనుషులు మన జంతుజాతిని పాత్రలుగా చేసి 'పంచతంత్రం' రాసుకున్నాయి కదా. అలాగే మనమేమైనా తక్కువా అంటూ మనుషుల్ని పాత్రధారుల్ని చేస్తూ... మన పిట్టజాతి కూడా ఓ కథల పుస్తకం రాసుకుంది. అత్యంత పురాతన, అపురూపమైన ఆ రహస్య గ్రంథం పేరు 'నర-కుతంత్రం'!. అనాదికాలంలోనే ఆర్కియాప్టెరిక్సు అనే రుషిపిట్ట రాసిన 'పరమానందయ్య శిష్యుల కథ'లాంటిదొకటి ఎవరో రాయగా... చదివినట్టో, విన్నట్టో జ్ఞాపకం. ఆ కథ చెబుతా విను.

పరమానందయ్య శిష్యులు కొంతమంది పొరుగూరు వెళ్లారు. వెళ్లేప్పుడు ఓ ఊరి మీదుగా వెళ్తూ, వచ్చేప్పుడు మరోదారిలో వచ్చారు. వెళ్లేదారిలో వంతెన ఉంది కాబట్టి తేలిగ్గానే ఏరు దాటారు. కానీ వచ్చే దారిలో వంతెన లేదు.

ఏరులో ఎక్కువగా నీళ్లు లేవు. తేలిగ్గానే దాటగలరు. మహా అయితే అరికాళ్లు తడుస్తాయంతే. కానీ వాళ్లు మనుషులు కదా. పెద్దగా బుర్రలేదు.

సందెవేళ కావడంతో కాగడా వెలిగించి, 'ఏరూ దాని తీరూ' అంటూ ఏదేదో పరిశీలిస్తున్నారు.

'ఒరేయ్... ఏరు పడుకుందో లేదో చూడాలి. అది ఆదమరచి, మాంచి నిద్రలో ఉండగానే చటుక్కున దాటేయాలి' అన్నాడు ఓ శిష్యుడు.

'నిద్రపోలేదేమోరా... ఏరు హోరు వినిపిస్తోంది కదా' మరొకడి పరిశీలన.

'నేను కాగడాతో చురకేసి దాని నోరూ, హోరూ మూయిస్తా. బెదిరించినట్టూ ఉంటది. కర్రుకాల్చివాత పెట్టినట్టుగానూ ఉంటది'... అది మరొక శిష్యుడి అత్యుత్సాహం.

వాడు కాగడాని నీళ్లలో ముంచగానే 'సుయ్యి'మనే శబ్దంతో అది ఆరిపోయింది.

'అరేయ్... ఏరు మాంచి పొగరుమీదుంది. సుయ్యిమంటూ బుసకొట్టి కాగడా ఆర్పేసింది' అంటూ భయపడుతూ ఒడ్డుకొచ్చాడు.

కాసేపాగాక మరో శిష్యుడు అదే కాగడాతో మరోసారి బెదిరించి చూస్తానంటూ, ఏట్లోకి దిగి, ఆరిపోయిన కాగడానే నీళ్లలో ముంచాడు. ఈసారి సుయ్యి లేదు. 'అరేయ్ చడీ చప్పుడు లేదు. ఏరు బాగా బెదిరిపోయింది. హాయిగా దాటేద్దాం' అంటూ శిష్యులంతా ఏరు దాటేశారు.

ఇప్పుడు చెప్పు... ఏట్లో కాగడా ముంచి, అది అదిరిందా, బెదిరిందా అని తెలుసుకోవడం ఓ సర్వే అనుకుందాం. మొదట ఏరు కస్సుమని, బుస్సునడం వాస్తవమా? ఆ తర్వాత బెదిరి లొంగిపోవడం వాస్తవమా?

అందుకే టీవీ చూసినంత సేపు ఎంజాయ్ చేసేసి, అందరికోసం మాంచి మిల్లెట్ స్పెషలేదైనా చేసేయ్ అంటూ పెళ్లానికి ఓ కథాప్రవచనం చెప్పేసి, రంగురంగుల ఈకల లుంగీ కట్టుకోడానికి వెళ్లాడా భర్తపిట్ట.

మీకు తెలుసా?

తొలి మహిళా ప్రతిపక్ష నాయకురాలు కమలాదేవి



ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆరుట్ల కమలాదేవీ శాసనసభకు తొలిమహిళా ప్రతిపక్ష నేతగా వ్యవహరించి రికార్డు నెలకొల్పారు. 1952 నుంచి వరుసగా ఆలేరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా కమలాదేవి విజయం సాధించారు. 1967వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1962లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. కమ్యూనిస్టు పార్టీ ప్రతిపక్ష స్థానంలో ఉంది. అప్పుడు శాసనసభ ప్రతిపక్ష నేతగా పుచ్చలపల్లి సుందరయ్య ఉండగా.. ఉప నాయకురాలిగా కమలాదేవి ఉన్నారు. అయితే, 1964లో కమ్యూనిస్టు పార్టీ విడిపోయి సీపీఐ, సీపీఎంగా ఏర్పడిన తర్వాత సీపీఐ నుంచి కమలాదేవి శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలిగా వ్యవహరించారు.

–సాక్షి, యాదాద్రి

గాసిప్ టైమ్

కాలం కలిసిరాక ఆగమాగం

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేతకు రాజకీయంగా కాలం కలిసిరావడం లేదంట... అప్పట్లో పచ్చపార్టీలో ఓ వెలుగు వెలిగిన ఆయనకు రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయ స్థిరత్వం లేకుండా పోయిందనే చర్చ జరుగుతోంది. పచ్చ పార్టీ నుంచి కాషాయదళంలో చేరినా అక్కడా ఇమడలేకపోయారు. ఆ తర్వాత మూడు రంగుల కండువా కప్పుకున్నారు. ఈ కండువాతో ఓసారి అదృష్టాన్ని పరీక్షించుకున్నా ఓటర్లు కరుణ చూపలేదు. అప్పటి నుంచి ఆయన అప్పుడప్పుడూ మీడియాలో కనిపించి మాయమై పోతుండేవారు. ఈసారైనా కష్టాల తీరం దాటి అసెంబ్లీలో అడుగుపెట్టాలని సదరునేత ఆశించారు. తాను కాకపోయినా కనీసం కుమారుడి భవిష్యత్తుకైనా దారి చూపాలనుకున్నాడు. కాలం కలసి రాకపోతే ఆయన మాత్రం ఏం చేయగలడు.. పాపం! ఆయన పోటీ చేయాలనుకుంటున్న స్థానంపై గురిపెట్టిన ఇంకో పెద్దాయన అనూహ్యంగా వచ్చి తన కొడుక్కి లైన్ క్లియర్ చేసుకున్నాడు. దీంతో ఏం చేయాలో అర్థం కాక... ఎటువైపు వెళ్లాలో తేల్చుకోలేక ఈ మాజీమంత్రి ఆగమాగం అవుతున్నాడంట. మరి, కాలమా... మజాకా!

సారాంశం

సరికొండ చలపతి

ఆహా.. ఎంతటి ఆర్థికాభివృద్ధి!

ఓ కార్ల సంస్థ కొత్తగా షోరూం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖాయం చేసుకుంది.. కాస్త ఖరీదైన కార్లు కావడంతో ఘనంగా ఉంటుందని ఓ మంత్రి గారిని ఫంక్షన్‌కు ఆహ్వానించారు. వేడుక పూర్తయ్యాక మంత్రి గారిని సంతృప్తి పరుద్దామని ఓ కారు స్వీకరించాల్సిందిగా షోరూం యజమాని కోరాడు.

మంత్రి ససేమిరా అన్నాడు.

షోరూం యజమాని అవాక్కయ్యాడు. ఈ కాలంలో కూడా ఇలాంటి వారుంటారా అని ఆశ్చర్యపోయాడు.

'ప్లీజ్ సర్.. ఎలాగైనా..' అంటూ కాస్త బతిమాలాడాడు.

'నో..నో.. నాకంటూ కొన్ని విలువలున్నాయి. ఫ్రీగా ఎలాంటి కానుకలను స్వీకరించలేను.' – అని నిక్కచ్చిగా చెప్పేశాడు మంత్రి. మన వాడికి మరింత ముచ్చటేసింది. ఆ ఆనందంలో చటుక్కున ఓ ఆలోచన మెరిసింది. 'అలా అయితే , మా ఆనందం కోసం నామ మాత్రంగా ఓ ఐదొందలు చెల్లించి కారు తీసుకెళ్లండి. మీరు కొనుక్కున్నట్టుగా ఉంటుంది. మేమూ బహుమతి ఇచ్చినట్టుగా ఉంటుంది.'– అని ఐడియా చెప్పేశాడు.. తన ఆలోచనకు తానే మురిసిపోతూ.

మంత్రి ప్రశంసాపూర్వకంగా షోరూం యజమానివైపు చూశాడు. కాసేపు అలాగే ఆలోచించాడు.

షోరూం యజమాని..'ఎస్ ..నా ఐడియా వర్కవుట్ అయ్యింది..' అనుకున్నాడు ఆనందంగా.

'ఓకే. మీ మాట ఎందుకు కాదనడం.... ఓ రెండు కార్లు పంపించండి....'– అంటూ వెయ్యి రూపాయలు షోరూం యజమాని చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

ఇక షోరూం యజమాని ముఖం మీరే ఊహించుకోండి

....


ఇలా ఎక్కడా పావలా కూడా వదలని పొలిటికల్ లీడర్స్‌కు ఎలక్షన్ వచ్చేసరికి చేతికి ఎముక లేకుండా పోతుంది. డబ్బు నీళ్లలా ఖర్చుచేసేస్తారు. తమ నియోజకవర్గంలో కోట్లు కుమ్మరిస్తారు.

దీనికి ఇదొక్క ఉదాహరణ చాలు

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా రూ.60 వేల కోట్ల వరకు ఖర్చయిందట.. 'సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) అధ్యయనం చెబుతున్న మాట ఇది. ఓట్ల పండుగ కాదు.. నోట్ల పండుగ మొదలవుతుంది.

పులిహోర.. చికెన్ బిర్యానీ..

విచిత్రం ఏమిటంటే , ఎన్నికల సీజన్ వచ్చిందంటే ఊర్లలో, కార్లలో, బార్లలో కరెన్సీ ఏరులై పారుతుంటే.. ఈసీ మాత్రం లెగ్ పీస్‌ల లెక్కల్లోనే ఉండిపోవడం. ఓ చికెన్ బిర్యానీకి ఎంత లెక్కగడతారు. ఓ రెండు సమోసాలు ఎంత లెక్కేస్తారు. టెంట్ సామాన్ల లెక్క ఎంత.. పులిహోర ప్యాకెట్ ఖరీదు ఎంత..ఇలాంటి అమాయకపు లెక్కలను విడుదల చేస్తుంది. ఎక్కువ ఖర్చు చేస్తే ఈ లెక్కలన్నీ మీ ప్రచారం ఖర్చులోకి జమ అవుతాయి జాగ్రత్త అని హెచ్చరిక జారీ చేస్తుంది.



....

- ప్రజాస్వామ్యం ఎంతగా పరిణతి చెందిందో.. ఎన్నికల్లో పారే నల్ల డబ్బును పట్టు కోవడానికి వీధివీధినా ఏర్పాటు చేసిన టెంట్లే చెబుతాయి.
- బ్లాక్ మనీ కంట్రోల్ చెయ్యడానికి అనవసరంగా మోదీ డీమానిటైజేషన్‌తో హడావుడి చేశారు గానీ, ఎన్నికల టైమ్‌లో ఇలా మరిన్ని టెంట్లు వేస్తే అంతా బయటకి వచ్చేది అని సోషల్ మీడియాలో ఓ కుర్రాడి చురక.

ఇండియా అసలు ఎంత అభివృద్ధి చెందిందో చెప్పడానికి గణాంకాలతో నానాతంటాలు పడతాయి గానీ, ఈ ఎన్నికల ఖర్చు చూస్తే చాలు మన డెవలప్‌మెంట్ గ్రాఫ్‌లో ఎక్కడిదాకా పోయామో ఈజీగా తెలుస్తుంది.

చాలా కాస్ట్లీ

ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వాలు చేసే ఖర్చు ఒకవైపు.. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే అతి భారీ ఖర్చు మరోవైపు.. కలిపి భారతదేశంలోని ఎన్నికలను ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన (ఖర్చుతో కూడుకున్న) ఎన్నికల్లో రెండో స్థానంలో నిలపడం గమనార్హం.

- 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా రూ.60 వేల కోట్ల వరకు ఖర్చయినట్టు అప్పట్లోనే దీనిపై అధ్యయనం చేసిన 'సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్)' తమ నివేదికలో వెల్లడించింది. ఒక్కో ఓటరుపై జరిగిన ఖర్చు రూ.700గా తేల్చింది.
- అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలు, మీడియాలో, సోషల్ మీడియాలో ప్రకటనలు, కార్యకర్తల కోసం చేసిన ఖర్చు వంటి అన్నిరకాల ప్రచార, ఇతర వ్యయాలను కలిపి ఈ లెక్క వేసింది.

అధికార పార్టీల వ్యయమే ఎక్కువ..

ప్రతి ఎన్నికలోనూ కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు, వాటి అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తున్నట్టుగా సీఎంఎస్ నివేదికలో పేర్కొంది. ఇందుకోసం గత ఆరు లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలైనబీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు మిగతా పార్టీలన్నీ చేసిన ఖర్చుల అంచనాలనూ వెల్లడించింది.

- 1998 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా రూ.9 వేల కోట్లు ఖర్చు అయితే అందులో బీజేపీ రూ.1,800 కోట్లు, కాంగ్రెస్ రూ.2,700 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.4,500 కోట్లు వ్యయం చేశాయి.
- 1999లో మొత్తం వ్యయం 10 వేల కోట్లు అయితే.. బీజేపీ రూ.2,000 కోట్లు, కాంగ్రెస్ రూ.3,500 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.4,500 కోట్లు వ్యయం చేశాయి.
- 2004లో మొత్తం ఖర్చు 14 వేల కోట్లుకాగా.. బీజేపీ రూ.4,200 కోట్లు, కాంగ్రెస్ రూ.5,600 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.4,200 కోట్లు వ్యయం చేశాయి.
- 2009లో 20 వేల కోట్లు వ్యయం చేయగా.. బీజేపీ రూ.7,500 కోట్లు, కాంగ్రెస్ రూ.8,500 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.4,000 కోట్లు వ్యయం చేశాయి.
- 2014లో అన్ని పార్టీలు కలిపి 30వేల కోట్లు ఖర్చుపెట్టగా.. బీజేపీ రూ.12,750 కోట్లు, కాంగ్రెస్ రూ.9,300 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.7,950 కోట్లు వ్యయం చేశాయి.
- 2019లో మొత్తంగా 60వేల కోట్లు వ్యయమవగా.. బీజేపీ రూ.27,500 కోట్లు, కాంగ్రెస్ రూ.9,625 కోట్లు, ఇతర పార్టీలన్నీ కలిపి రూ.17,875 కోట్లు వ్యయం చేశాయి.

20 ఏళ్లలో ఆరు రెట్లు ...

లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు తీరును పరిశీలిస్తే.. 1998తో పోలిస్తే కేవలం 20 ఏళ్లలోనే ఎన్నికల 'ఖరీదు' ఏకంగా ఆరు రెట్లు పెరగడం గమనార్హం. 2019 నాటి మొత్తం వ్యయంలో 25శాతానికిపైగా సొమ్ము అంటే రూ.15 వేల కోట్లు నేరుగా ఓటర్లకు పంచేందుకు ఖర్చు చేసినదేనని సీఎంఎస్ నివేదికలో పేర్కొంది.

టాప్-30లో తెలుగు రాష్ట్రాల్లోనే ఎనిమిది

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఖర్చయిన టాప్-30 నియోజకవర్గాలనూ సీఎంఎస్ అంచనా వేసింది. అందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవే ఎనిమిది సెగ్మెంట్లు ఉండటం గమనార్హం.

అగ్రరాజ్యంలోనూ అంతే

2020లో జరిగిన అమెరికా అధ్యక్ష/పార్లమెంటు ఎన్నికలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా నిలిచాయి. అక్కడి ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ లెక్కలు, ఓపెన్ సీక్రెట్స్ సంస్థ అధ్యయనం ప్రకారం.. 2016లో రూ.54 వేల కోట్లు (650 కోట్ల డాలర్లు) ఖర్చవగా, 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రూ.1.16 లక్షల కోట్లు (1,400 కోట్ల డాలర్లు) ఖర్చు చేశారు. అంటే నాలుగేళ్లలో ఏకంగా రెండింతలు అయింది... ఈ ఖర్చు మడగాస్కర్ లాంటి దేశాల జీడీపీ మొత్తం కంటే ఎక్కువ కావడం గమనార్హం.

పంచతంత్రం

ఆ లాకర్లలో రూ. 500 కోట్ల నల్లధనం

- 50 కేజీల బంగారం కూడా
- ఆరోపిస్తూ ధర్నాకు దిగిన బీజేపీ ఎంపీ

జైపూర్: బీజేపీ రాజ్యసభ సభ్యుడు కిరోడి మీనా రాజస్తాన్‌లో ఎన్నికల వేడిని మరింత రాజేశారు. జైపూర్‌లోని ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలోని లాకర్లలో ఏకంగా రూ.500 కోట్ల నల్లధనం దాగుందని సంచలన ఆరోపణలు చేశారు. '50 కేజీల బంగారం సైతం దాచిపెట్టారు. రాష్ట్రంలో ప్రశ్నాపత్రాల లీకేజీ స్కామ్, ఐటీ స్కామ్, జల్‌జీవన్ మిషన్ స్కామ్‌లతో దీనికి సంబంధం ఉంది. పోలీసులు వచ్చి ఈ లాకర్లను తెరవాలి' అంటూ నగరంలో ఆ లాకర్లను నిర్వహించే సంస్థ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. లాకర్ల విషయం తేల్చేందుకు ఆదాయ పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు ఇప్పటికే అక్కడికి చేరుకున్నాయని బీజేపీ తెలిపింది. అయితే ఈ విషయంపై ఐటీ, ఈడీ స్పందించలేదు. '50 లాకర్లు ప్రస్తుతం నిర్వహణలోనే ఉన్నాయి. వాటిలో పది కొందరు ఉన్నతాధికారులకు చెందినవి' అని కిరోడి చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ స్పందించారు. 'లాకర్ల విషయంలో మేం మాత్రం ఏం చేయగలం?. మీడియాను వెంటేసుకొచ్చి కిరోడి ధర్నాలో కూర్చున్నారు. ఈడీ ఆఫీస్‌కెళ్లి తప్పుడు ఫిర్యాదులిచ్చారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కిరోడి, మోదీ సర్కార్ చేస్తున్న కుట్ర ఇది' అని గెహ్లోట్ అన్నారు.

రాజస్తాన్‌లో బీజేపీపై ఏక్‌నాథ్ షిండే పోరు


జైపూర్: మహారాష్ట్రలో బీజేపీ మద్దతుతో ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న శివసేన చీలిక వర్గం నేత ఏక్‌నాథ్ షిండే రాజస్తాన్‌లో మాత్రం భిన్నంగా వ్యవహరించనున్నారు. రాజస్తాన్‌లో పలు చోట్ల షిండే వర్గం అభ్యర్థులు పోటీకి దిగుతూ ఎన్‌డీఏ పక్షానికి సవాల్ విసరనున్నారు. చాలా స్థానాల్లో బీజేపీతో తలపడే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అభ్యర్థుల్ని బరిలో దింపడంపై ఇప్పటికే ఏక్‌నాథ్ షిండే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారని సమాచారం. శివసేన విల్లు, బాణం గుర్తును ఈ రాష్ట్ర ఎన్నికల్లో వినియోగించుకునేందుకు అనుమతించాలని ఈసీని షిండే కోరారని తెలుస్తోంది. ఇటీవల షిండే వర్గంలో చేరిన రాజస్తాన్ మంత్రి రాజేంద్ర సింగ్ తాజాగా 'ఎర్ర డైరీ'ని అసెంబ్లీలో బహిర్గతంచేయడంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. మరోవైపు ఇదే రాజేంద్రసింగ్‌పై బీజేపీ తమ అభ్యర్థి సుభకరణ్ చౌదరీని పోటీకి నిలబెట్టింది.

సంక్షేమం X మౌలికం

ఛత్తీస్‌గఢ్‌లో ఈసారి హోరాహోరీ! • కాంగ్రెస్‌కే స్వల్ప మొగ్గంటున్న సర్వేలు • గిరిజన పార్టీతో చేటెవరికో!



రమణ్‌సింగ్



భూపేశ్ భగేల్

ఛత్తీస్‌గఢ్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికలను పాలక కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు, బీజేపీ మౌలిక సదుపాయాల వాగ్దానాలకు మధ్య పోరుగా భావిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపుగా స్వీప్ చేసిన కాంగ్రెస్, మళ్లీ అదే ఫలితాన్ని పునరావృతం చేయాలని పట్టుదలగా ఉంది. దక్షిణాదిలో కీలకమైన కర్ణాటకలో ఇటీవలే బీజేపీ నుంచి అధికారాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం తెలిసిందే. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్‌తో పాటు రాజస్తాన్‌లో కూడా ఆ పార్టీ అధికారంలో ఉంది. అక్కడ కాస్త కష్టమేనన్న అంచనాల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌ను ఎలాగైనా నిలుపుకోవాలని పట్టుదలగా ఉంది. అందుకే ఇప్పటికే అమల్లో ఉన్నవాటికి తోడుగా మరెన్నో సంక్షేమ పథకాలను సీఎం భూపేశ్ భగేల్ ప్రకటిస్తున్నారు. మరోవైపు చిరకాలం పాటు తమ పాలనలో ఉన్న రాష్ట్రాన్ని గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కోల్పోయిన నేపథ్యంలో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని బీజేపీ పట్టుదలగా ఉంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ కొంతకాలంగా తరచూ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. పుంఖానుపుంఖాలుగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రకటిస్తున్నారు. వాటితో రాష్ట్ర భాగ్యరేఖలే మారతాయని, యువతకు భారీగా ఉపాధి దొరుకుతుందని చెబుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండు పార్టీల ప్రచారంలో ఓటరు దేనికి జై కొడతాడో చూడాలి...

బీజేపీ బలాలు...

- ఇతర అంశాలు ఎన్నున్నా అన్నింటి కంటే ప్రధానమైనది ఎప్పట్లాగే హిందుత్వ కార్డే. కాకుంటే ఈ విషయంలో గ్రామీణ ఓట్లను ఈ మేరకు సంఘటితం చేస్తుందన్నది ఈసారి కీలకం కానుంది.
- 15 ఏళ్ల వరుస పాలనలో చేసిన అభివృద్ధిని కూడా కమలదళం బాగానే ప్రచారం చేస్తోంది.
- కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో అవినీతిలో కూరుకుపోయిందని గట్టిగా ప్రచారం చేస్తోంది.
- అయితే అవినీతి ప్రచారం, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారేలా కనిపిస్తున్నాయి.
- అయితే గతంలో రమణ్‌సింగ్‌లా ఈసారి బీజేపీ సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రచారం చేయడం లేదు. ఇది కాస్త ప్రభావం చూపే అంశమేనని అంటున్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ మంత్రం

- బీజేపీ హిందుత్వ వాదానికి కౌంటర్‌గా రాష్ట్ర కాంగ్రెస్ కొంతకాలంగా ఉదారవాద హిందుత్వ గళం వినిపిస్తోంది. ఇది కొంతవరకు కలిసొస్తుందని భావిస్తోంది.
- సీఎం భగేల్ ఓబీసీ నేత కావడం ఆ సామాజిక వర్గంలో తమ ఓట్లను మరింత సంఘటితపరుస్తుందని ఆశిస్తోంది.
- పేదలకు, రైతులకు అనుకూలంగా అమలు చేస్తున్న పలు పథకాలు ఈసారి కచ్చితంగా గట్టెక్కిస్తాయని భగేల్ నమ్ముతున్నారు.
- వీటికి తోడు ఛత్తీస్‌గఢ్ ఆత్మగౌరవాన్ని ఇటీవలి కాలంలో పదేపదే తెరపైకి తెస్తున్నారు. తద్వారా ఓటర్లను ఆకట్టుకోజూస్తున్నారు.

కీలకాంశాలు

- వరికి సరైన మద్దతు ధర కావాలని రైతులు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నారు. క్వింటాలుకు రూ.2,500 మద్దతు ధర చెల్లిస్తామన్న 2018 నాటి హామీని భగేల్ సర్కారు నెరవేర్చలేదని ఆగ్రహంగా ఉన్నారు.
- కాంగ్రెస్ తరఫున సీఎం భగేల్ అన్నీ తానై నడిపిస్తున్నారు. అయితే పార్టీలో అసమ్మతులు ఆయనకు తలనొప్పిగా మారారు.
- డిప్యూటీ సీఎం కేపీ సింగ్‌దేవ్ రూపంలో భగేల్‌కు సొంత పార్టీలోనే గట్టి ప్రత్యర్థి పొంచి ఉన్నారు.
- ఇక బీజేపీకి ఇప్పటికీ మాజీ సీఎం రమణ్ సింగే రాష్ట్రంలో ఏకైక పెద్ద దిక్కు. 15 ఏళ్లు పాలించిన నేతగా ఈసారి తన అనుభవాన్నంతా రంగరిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో గత మూడు ఎన్నికల్లో ఫలితాలు...

2013 అసెంబ్లీ ఎన్నికలు... (మొత్తం అసెంబ్లీ స్థానాలు 90)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	49	41
కాంగ్రెస్	39	40.3
ఇతరులు	2	18.7

2018 అసెంబ్లీ ఎన్నికలు...

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	15	33
కాంగ్రెస్	68	43
ఇతరులు	7	24

2019 లోక్‌సభ ఎన్నికలు... (రాష్ట్రంలో మొత్తం లోక్‌సభ స్థానాలు 11)

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	9	51
కాంగ్రెస్	2	41
ఇతరులు	0	8



బరిలోకి గిరిజన పార్టీ

ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ సంఘాల సమాహారమైన సర్వ ఆదివాసీ సమాజ్ ఇటీవలే హమార్ రాజ్ పేరుతో రాజకీయ పార్టీగా మారింది. ఒకనాటి కాంగ్రెస్ నేత అరవింద్ నేతం సారథ్యంలో ఎన్నికల బరిలో దిగుతోంది. ఫక్తు గిరిజన ఆచార వ్యవహారాలకు కట్టుబడి పని చేస్తామనే హామీతో దూసుకెళ్తోంది. రాష్ట్రంలో సంఖ్యాధికులైన గిరిజనుల్లో ఇది గట్టిగా ప్రభావం చూపితే అది బీజేపీ, కాంగ్రెస్‌ల్లో దేన్ని దెబ్బ తీస్తుందన్నది ఆసక్తికరం.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓటర్లకు ఉచితంగా పోహా, జిలేబీ

- ఉదయం 9 లోపైతే ఉచితం
- 9 తర్వాత 10 శాతం రాయితీ
- ఇండోర్ దుకాణాదారుల సంఘం ప్రకటన



ఇండోర్: మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల వేళ ఇండోర్ ఓటర్లకు స్థానిక దుకాణాదారులు ప్రత్యేకమైన ఆఫర్‌ను ప్రకటించారు. సాధారణంగా రాష్ట్రాల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి రాజకీయ పార్టీలు ఉచితాలు ప్రకటించడం అందరికీ తెలిసిందే. కానీ మధ్యప్రదేశ్‌లో పార్టీలకు బదులు దుకాణాదారుల సంఘం ఉచితం ఆఫర్‌తో ముందుకొచ్చింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయం ముందుగా ఓటేసే అభ్యర్థులకు ఉచితంగా పోహా, జిలేబీ అందిస్తామని ప్రకటించింది. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే తమ ఆఫర్‌లోని అంతరార్థమని ఆ సంఘం అసలు విషయం బయటపెట్టింది. 230 ఎమ్మెల్యే నియోజకవర్గాలున్న మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఈసారి ఒకేదఫాలో నవంబర్ 17వ తేదీన జరగనున్నాయి. పోహా, జిలేబీ ఆఫర్‌పై '56 దుకాణ్ ట్రేడర్స్' అసోసియేషన్ అధ్యక్షుడు గుంజాన్ శర్మ పీటీఐతో మాట్లాడారు. 'నగర స్వచ్ఛత విషయంలో దేశంలోనే ఇండోర్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఓటింగ్ శాతంలోనూ తొలిస్థానంలో నిలవాలన్నది మా ఆకాంక్ష. అందుకే ఓటర్లను ఉచిత పోహా, జిలేబీతో ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాం. నవంబర్ 17వ తేదీన ఉదయం తొమ్మిది గంటల్లోపు ఎవరైతే ఓటు వేసి వేలికి సిరా గుర్తు చూపిస్తారో వారికే పోహా, జిలేబీ ఉచితంగా ఇస్తాం. ఉదయం తొమ్మిది తర్వాత సిరా గుర్తు చూపిస్తే పది శాతం డిస్కౌంట్ ఇస్తాం' అని శర్మ వివరించారు. ఇండోర్ నగరంలో ఉన్న ఈ '56 దుకాణ్'కు స్వచ్ఛమైన వీధి ఆహార హబ్ గుర్తింపునిస్తూ ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా ఒక సర్టిఫికెట్ జారీచేసింది. ఇండోర్ అర్బన్ పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో మొత్తంగా ఇక్కడ 14.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 67 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 15.55 లక్షలకు పెరిగింది. జిలేబీ ఆఫర్‌ను ఇక్కడి ఓటర్లు ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఎన్నికల హామీలపై... మధ్యప్రదేశ్‌లో నేతల మాటల యుద్ధం



భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల గడువు దగ్గరపడుతున్న కొద్దీ నేతల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా, పీసీసీ చీఫ్ కమల్‌నాథ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాల హామీలపై పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ఉచిత విద్య, విద్యార్థులకు నగదు పురస్కారాలు వంటి కాంగ్రెస్, ప్రియాంకా గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలపై సీఎం చౌహాన్ శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'గతంలో గాంధీ కుటుంబం ప్రతి ఒక్కరినీ మోసం చేసింది. తాజాగా గాంధీ కుటుంబాన్ని సైతం పీసీసీ చీఫ్ కమల్‌నాథ్ మోసం చేస్తున్నారు. తప్పుడు హామీలిచ్చేలా వారిపై ఒత్తిడి తెస్తున్నారు' అని ఆరోపణలు చేశారు. మాండ్లాలో ఈ నెల 12న జరిగిన ర్యాలీలో ప్రియాంకా గాంధీ ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య అందజేస్తామని ప్రకటించడం ఆ తర్వాత దానిని పలు మార్లు మార్చిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సీఎం విమర్శలపై కమల్‌నాథ్ తీవ్రంగా స్పందించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై సీఎం చౌహాన్ అనుచిత భాషను వాడారని ఆరోపించారు. తమ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేయదని స్పష్టం చేశారు. సీఎం చౌహాన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రియాంకా గాంధీ సైతం విమర్శలు చేశారు. భారతీయ జనతా పార్టీలో మాదిరిగా తమ పార్టీలో నియంతృత్వానికి చోటులేదన్నారు. కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ఎందుకు నిలిపివేశారని సీఎం చౌహాన్‌ను ఆమె ప్రశ్నించారు. తమ పార్టీ విద్య, చిన్నారులు, ప్రజల సంక్షేమం గురించి మాట్లాడుతుంటే ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం చౌహాన్ ఇటువంటి విషయాలను ప్రస్తావిస్తున్నారంటూ ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కులం, మతం, వర్గంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉపకారవేతనం అందజేస్తుందని హామీ ఇచ్చారు.నవంబర్ 17వ తేదీన రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు





భాగ్య బతుకమ్మ

ప్రకృతి కాంత పరవశించింది. పూలవుంత పులకరించింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు శనివారం భాగ్యనగరంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆలయాలు, చెరువులు, కూడళ్లు సందడిగా మారాయి. మహిళలు ఆటాపాటలతో అలరించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. పితృఅమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు కొనసాగుతాయి. - సాక్షి, సిటీబ్యూరో

వార్ వన్‌సైడే!

- దశాబ్దాలుగా ఆ పార్టీదే హవా
- ఇక్కడి ఓటర్లపై చెరగని ముద్ర
- పట్టు కోసం బీజేపీ, బీఆర్‌ఎస్
- సర్వశక్తులొడ్డుతున్న ఎంబీటీ
- హిందూ, ముస్లిం ఎజెండాలదే జెండా



పాత బస్తీలో ఏళ్లుగా మజ్లిస్ పాగా

నాలుగు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ప్రాచీన నగరం హైదరాబాద్. ఇక్కడ హిందూ, ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా జీవనం సాగిస్తుంటారు. హైదరాబాద్ పాతనగరం, కొత్త నగరం రాజకీయ పరిస్థితికి భిన్నంగా ఉంటుంది. పాతబస్తీలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయాల 'ఒరవడే' వేరు. మేనిఫెస్టోలు, ప్రచార ఆర్భాటాలు ఇక్కడ నడవవు. బలమైన ముస్లిం, హిందుత్వ సామాజిక ఎజెండాలే ఇక్కడి పార్టీల 'జెండా'లవుతాయి. 'మజ్లిస్'గా అందరి నోళ్లలో నానే ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తేహదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం).. పాతబస్తీ నియోజకవర్గాలపై చెరగని ముద్ర వేసుకుంది. మత రాజకీయాలే ఇక్కడి ఎన్నికల ఫలితాలను శాసిస్తాయి. హిందూ, ముస్లిం ఎజెండాలతో ఇక్కడ మజ్లిస్, బీజేపీ రాజకీయంగా తలపడుతున్నా.. ఫలితం మాత్రం వన్ సైడ్‌గా ఉంటోంది. దశాబ్దాలుగా ఇక్కడ పట్టు కోసం బీజేపీ, బీఆర్‌ఎస్ పోటీ పడుతూనే ఉన్నాయి. –సాక్షి, సిటీబ్యూరో

మజ్లిస్‌కు కంచుకోటలే..

పాతబస్తీలోని గోషామహల్ మినహా మిగిలిన చార్మినార్, యాకుత్‌పురా, బహదూర్‌పురా, కార్వాన్, చాంద్రాయణగుట్ట, నాంపల్లి, మలక్‌పేట అసెంబ్లీ నియోజవర్గాలు మజ్లిస్‌కు కంచు కోటలే. ఇక్కడ దశాబ్దాలుగా మజ్లిస్ తిరుగులేని శక్తిగా రాజకీయాలను శాసిస్తోంది. ఈ ఎన్నికల్లోనూ ఆ పార్టీ తిరిగి పట్టు నిలుపుకోవడం దాదాపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా బీజేపీ హిందుత్వ ఎజెండాతో మజ్లిస్ కంచుకోటను బద్దలు కొట్టి పాగా వేసేందుకు ప్రయత్నిస్తూనే ఉంది. మజ్లిస్ నుంచి చీలి సొంత కుంపటి పెట్టుకున్న ఎంబీటీ కూడా ఢీ అంటూ సర్వశక్తులూ ఒడ్డుతోంది. అయినప్పటికీ ప్రతీ ఎన్నికల్లో నామమాత్ర ప్రభావమే చూపుడం సర్వసాధారణమైంది. వాస్తవంగా ఈ నియోజకవర్గాల్లో ముస్లింల ఓట్లు అధికం. అధికారంలో ఉన్న పార్టీ.. ప్రతి ఎన్నికల వేళ స్నేహపూర్వక పోటీ పేరుతో బలహీన అభ్యర్థులను రంగంలోకి దింపడం మజ్లిస్‌కు కలిసివస్తోంది. పదేళ్ల ముందు కాంగ్రెస్‌తో, ఆ తర్వాత బీఆర్‌ఎస్‌తో మజ్లిస్ దోస్తీ కొనసాగిస్తోంది.

కార్వాన్‌లో కౌసర్

మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ హ్యాట్రిక్ కోసం తహతహలాడుతున్నారు. మరోసారి కౌసర్ బరిలో దిగే అవకాశాలున్నాయి. మజ్లిస్‌కు గట్టి ఓటు బ్యాంకు ఉన్నా.. హిందుత్వ ఎజెండా కూడా బలంగానే ఉంది.. ఆ వర్గం ఓట్లన్నీ బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య చీలిపోవడం మజ్లిస్‌కు కలిసివస్తుంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ కృష్ణయ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా, కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.



బలమైన బలాల..

మలక్‌పేట నియోజకవర్గంలో ఇప్పటికే హ్యాట్రిక్ కొట్టిన మజ్లిస్ మరోసారి పచ్చ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా కనిపిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల తిరిగి రంగంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. బీజేపీకి సంస్థాగతంగా బలంగానే ఉన్నప్పటికీ బలమైన అభ్యర్థి రంగలోకి దిగితే తప్ప మజ్లిస్‌ను ఢీ కొట్టడం అసాధ్యమని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పరిస్థితి అంతంత మాత్రమే. బీఆర్‌ఎస్ తీగల అజితా రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా.. కాంగ్రెస్, బీజేపీలు తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.


'చార్మినార్' ఆవిర్భావం నుంచీ ఆధిపత్యం..

చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్‌కు అనుకూలం. నియోజకవర్గం ఆవిర్భావం నుంచి మజ్లిస్ ఆధిపత్యమే కొనసాగుతోంది. ప్రస్తుతం సీనియర్ శాసన సభ్యుడు ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఐదు పర్యాయాలు యాకుత్‌పురా నుంచి గత పర్యాయం చార్మినార్ నుంచి ఆయన ఎన్నికయ్యారు. ఈసారి ఆయన పోటీకి దూరంగా ఉండే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఆయన పోటీకి దూరంగా ఉంటే ఆయన స్థానంలో మజ్లిస్ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ కుమారుడు నూరుద్దీన్‌ను బరిలో దింపాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి ఇబ్రాహీం లోడి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా, కాంగ్రెస్, బీజేపీ ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పరిస్థితి అంతంత మాత్రమే. ముస్లిం ఓట్లు అధికంగా ఉండటంతో పాటు హిందుత్వ వాదం కూడా బలంగా ఉంది. మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ముస్లిం ఓట్లను చీల్చుకుంటే.. తాము లబ్ధి పొందవచ్చని బీజేపీ భావిస్తోంది. ఇందు కోసం బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపాలని యోచిస్తోంది.

చాంద్రాయణ గుట్ట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మజ్లిస్ ద్వితీయ అగ్రనేత అక్బరుద్దీన్ ఒవైసీ డబుల్ హ్యాట్రిక్ లాంఛనమే. ఈ నియోజకవర్గం ఆది నుంచి మజ్లిస్‌కు కంచుకోట. ఇక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ కూడా గట్టి పోటీనిచ్చే పరిస్థితి కనిపించదు.

డబుల్ ధమాకా కోసం

ఎంబీటీ సైతం గతంలో తలపడి ఆశలు వదులుకుంది. రికార్డు స్థాయి మెజార్టీతో వన్‌సైడ్ ఫలితం ఈ నియోజకవర్గం ప్రత్యేకత. ఇప్పటికే బీఆర్‌ఎస్ సీతారాం రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి రంగలోకి దింపగా, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖరారు కాలేదు.



బహదూర్‌పురాలో దశాబ్దాలుగా..

బహదూర్‌పురా నియోజకవర్గంలో దశాబ్దాలుగా మజ్లిస్ ప్రాతినిధ్యమే. ఇక్కడ మౌజం ఖాన్ సీనియర్ ఎమ్మెల్యే. వయసు రీత్యా మరోసారి ఆయనకు టికెట్ దక్కడం అనుమానమే అన్న ప్రచారం సాగుతోంది. ఆయన స్థానంలో కొత్త అభ్యర్థి బరిలో దిగే అవకాశాలు లేకపోలేదు. మజ్లిస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంది. ప్రతీసారి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పోటీ దిగినా.. ప్రభావం నామమాత్రమే. ఆయా రాజకీయ పక్షాలు సైతం ముస్లిం అభ్యర్థులను రంగంలోకి దింపినా.. పోటీ మాత్రం మజ్లిస్‌కు దరిదాపుల్లో కనిపించదు. భారీ మెజార్టీతో వార్‌వైన్‌సైడ్‌గా ఉంటుంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అలీ బక్రీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ పార్టీల ప్రకటించాల్సి ఉంది. అయితే ఆయా పార్టీల నుంచి టికెట్ల కోసం పోటీ తీవ్రంగానే ఉంది.

అంతా అనుకూలమే

యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం మజ్లిస్‌కు పూర్తి స్థాయిలో అనుకూలంగా ఉంటుంది. గత ఎన్నికల్లో మజ్లిస్‌ను ఢీకొట్టేందుకు ఎంబీటీ శతవిధాలా ప్రయత్నించి విఫలమైంది. బీజేపీకి ఇక్కడ తన వర్గం ఓట్లపై పట్టుంది. కానీ, మజ్లిస్‌కు గట్టి పోటీ ఇవ్వలేకపోతోంది. గత ఎన్నికల్లో సీనియర్ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఈసారి తిరిగి పోటీ చేయడం అనుమానమే. మరో అభ్యర్థి రంగంలోకి దిగే అవకాశాలున్నాయి. బీఆర్‌ఎస్ సామ సుందర్ రెడ్డి అభ్యర్థితాన్ని ఖరారు చేయగా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేయలేదు.

నాంపల్లిలో నువ్వా.. నేనా..?

నాంపల్లి నియోజకవర్గంలో గట్టి పోటీ ఎదుర్కొని మజ్లిస్ బయటపడుతూ వస్తోంది. జాఫర్ హుస్సేన్ మేరాజ్ రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఈసారి అభ్యర్థి మార్పు ఉంటుందని ప్రచారం సాగుతోంది. మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్ పోటీలో దిగే అవకాశాలున్నాయి. మజ్లిస్ చేతిలో మూడు పర్యాయాలు ఓటమి చవి చూసిన ఫిరోజ్ ఖాన్ ఈసారి కూడా కాంగ్రెస్ నుంచి బరిలో దిగే అవకాశాలున్నాయి. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ సైతం తమ అభ్యర్థులను ఇప్పటివరకు ప్రకటించలేదు.

గ్రేటర్.. ఓటర్

- మొత్తం 26 నియోజకవర్గాలు..
- 1.15 కోట్లకుపైగా ఓటర్లు
- ప్రభుత్వ ఏర్పాటులో వీరిదే కీలక పాత్ర
- రాజకీయ పార్టీల ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో మూడోవంతు ఓటర్లు ఈ పరిధిలోనే

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రేటర్ జిల్లాల ఓటర్లపై అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఫోకస్ పెట్టాయి. డిసెంబర్‌లో కొత్తగా ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా.. ఇక్కడి ఓటర్లు ఇచ్చే తీర్పే ప్రధానం కాబోతోంది. తెలంగాణలో 33 జిల్లాలు ఉండగా.. వీటిలో నాలుగు ప్రధాన జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి (పటాన్‌చెరు) గ్రేటర్ పరిసరాల్లోనే ఉన్నాయి. తెలంగాణ మొత్తంగా 119 నియోజకవర్గాలు ఉండగా.. కేవలం ఈ నాలుగు జిల్లాల పరిధిలోనే 26 నియోజకవర్గాలు ఉన్నాయి. అంతేకాదు.. రాష్ట్ర వ్యాప్తంగా 3,17,32,727 మంది ఓటర్లు ఉంటే.. వీరిలో మూడో వంతు అంటే 1,01,61,560 మంది ఓటర్లు వీటి పరిధిలోనే ఉండటం విశేషం. ప్రభుత్వ ఏర్పాటులో ఇక్కడి ఓటర్లు కీలకం కానున్నారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అధికార బీఆర్‌ఎస్ సహా ప్రతిపక్ష కాంగ్రెస్, విపక్ష బీజేపీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కేవలం రాష్ట్ర నేతలే కాదు..ఢిల్లీ నేతలు సైతం గ్రేటర్ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా సభలు నిర్వహించబోతున్నారు. కుల, మత సంఘాల పెద్దలు, ఉద్యోగ, నిరుద్యోగ, యువజన,



ఉద్యోగ, కార్మిక, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ఇక్కడ అంతా భిన్నం..

- నగరంతో పాటు చుట్టు పక్కల నియోజకవర్గాల్లో భిన్న వాతావరణమే కాదు.. విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు కన్పిస్తుంటాయి. ఐటీ, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడుతుండటంతో నగరం సహా శివారు జిల్లాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా కలిసిపోయి ఈ ప్రాంతం ఓ సెమీ అర్బన్‌గా అవతరించింది. ఇక్కడ కేవలం తెలుగు మాట్లాడే వారే కాదు హిందీ, కన్నడ, తమిళం, ఒరియా, బెంగాలీ, పంజాబీ, గుజరాతీ, మరాఠి, ఇతర భాషలు మాట్లాడే వారు ఉన్నారు.
- మెజార్టీ ఓటర్లు చదువుకున్న వారే. పురుషులతో సమానంగా మహిళలు ఉన్నారు. యువత కూడా ఎక్కువే. అక్షరాస్యతలోనే కాదు ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ వీరు రాణిస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులపై వీరికి ఎంతో కొంత అవగాహన కూడా ఉంది. ఓటు హక్కుపై వీరికంటూ ఓ స్పష్టమైన అభిప్రాయం కూడా ఉంది. వీరి నాడి పట్టడం రాజకీయ పార్టీలకు అంత సులభం కూడా కాదు. వీరి ముందు ఎన్నికల తాయిలాలు కూడా పని చేయవు. వీరి ఓటు ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించనుంది. ఎన్నికల్లో వీరు తీసుకునే నిర్ణయంపైనే అభ్యర్థి గెలుపోటములు ఆధారపడి ఉండటంతో ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేక ఫోకస్ పెట్టాయి.

వరుస స్థానాల్లో ఆ నియోజకవర్గాలు..

తెలంగాణలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గాల జాబితాలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని శేరిలింగంపల్లి ముందు వరుసలో (6,98,133 ఓటర్లు) ఉండగా, ఆ తర్వాత స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం(6,69,361 మంది ఓటర్లు) ఉంది. మూడో స్థానంలో మేడ్చల్ (5,95,536 మంది ఓటర్లు) ఉండగా, నాలుగో స్థానంలో ఎల్బీనగర్ (5,66,866 మంది ఓటర్లు) ఉంది. ఇక ఐదో స్థానంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం (5,52,455) ఉండటం విశేషం. కేవలం ఈ ఐదు నియోజకవర్గాల పరిధిలోనే 30 లక్షల మందికిపైగా ఓటర్లు ఉండటం గమనార్హం. ఇక్కడ అభ్యర్థుల ఎంపికే ఆయా పార్టీలకు ఓ పెద్ద సవాల్.



చేతికందేనా!

- నేడు కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా
- 10 నుంచి 16 స్థానాలకు అవకాశం
- నగర కాంగ్రెస్ ఆశావాహుల్లో ఉత్కంఠ

సాక్షి,సిటీబ్యూరో: అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలో నగర పరిధిలోని కొన్ని అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాల ఖరారుకు అవకాశాలు కనిపిస్తున్నాయి. పోటీ ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు మినహాయిస్తే.. మిగతా చోట్ల అభ్యర్థుల ఖరారు దాదాపు పూర్తి కావడంతో ఆదివారం తొలి జాబితా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితమే స్క్రీనింగ్ కమిటీలో ఎంపిక చేసిన జాబితాకు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. మొదటి జాబితాలో గెలుపు గుర్రాలకు మాత్రమే ప్రాధాన్యత లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పూర్వ వైభవం కోసం అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాల ఖరారుపై ఆచితూచి అడుగులు వేస్తునట్లు తెలుస్తోంది. సర్వేలు, ఫ్లాష్ సర్వేలు నిర్వహించి అభ్యర్థిత్వాలపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పాతబస్తీలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై పెద్దగా ఆశలు లేనప్పటికీ మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చే విధంగా సమర్థులైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ స్థానం నుంచి అలీ మస్కతీని ఎన్నికల బరిలో దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.



తొలి జాబితాలో వీరికి చోటు?

కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాలో గ్రేటర్ పరిధిలోని 10 నుంచి 16 అసెంబ్లీ స్థానాల అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాంపల్లి అసెంబ్లీ స్థానానికి ఫిరోజ్ ఖాన్, చార్మినార్‌కు అలీ మస్కతీ, ముషీరాబాద్‌కు అంజన్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్‌కు పి.విష్ణువర్ధన్ రెడ్డి/అజహరుద్దీన్, ఖైరతాబాద్‌కు రోహిణ్‌రెడ్డి/వినోద్ రెడ్డి, సనత్‌నగర్‌కు కోట నీలిమ/మర్రి ఆదిత్య రెడ్డి, మేడ్చల్‌కు తోటకూర వజ్రేశ్ (జంగయ్య) యాదవ్, మల్కాజిగిరికి మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్‌కు కొలన్ హనుమంత రెడ్డి, ఉప్పల్‌కు ఎం. పరమేశ్వర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎల్బీనగర్‌కు మధుయాష్కీ గౌడ్, మహేశ్వరానికి చిగురింత పారిజాత, రాజేంద్రనగర్‌కు బొర్ర జ్ఞానేశ్వర్, శేరిలింగంపల్లికి మారబోయిన రఘునాథ్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు వెన్నెల, పటాన్‌చెరుకు కాటా శ్రీనివాస్‌గౌడ్, అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌ను వీడనున్న 'సింగిరెడ్డి'?



కాప్రా: ఉప్పల్ కాంగ్రెస్ బీ– బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. ఉప్పల్ నుంచి టికెట్ ఆశించిన ఆయనకు అది దక్కకపోవడంతో పార్టీని వీడేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఉప్పల్ టికెట్‌ను అధిష్టానం తనకు కేటాయించలేదని.. అందుకే కాంగ్రెస్ పార్టీని వీడేందుకు నిర్ణయించుకున్నట్లు ఢిల్లీ నుంచి తన అనుచరులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా.. సోమశేఖర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి కూడా పార్టీని వీడనున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆదివారం ఆయన ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన తర్వాత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

Jung telangana-2023

నిబంధనలు పాటించాలి

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

బంజారాహిల్స్: ఎన్నికల నిర్వహణలో సొంత నిర్ణయాలతో కాకుండా ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఎన్నికల విధులు నిర్వహించే ఆర్.ఓలు, స్పెషల్ అధికారులు, నియోజక వర్గ స్థాయి ట్రైనింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి అంశానికి ఎన్నికల కమిషన్ స్టాండర్డ్ ఆఫ్ ప్రిసెడర్స్



రూపొందించినట్లు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, అడిషనల్ కమిషనర్లు శంకరయ్య, శ్రీవత్స, ఖైరతాబాద్ జోనల్ కమిషర్ వెంకటేష్ దొత్రే, తదితరులు పాల్గొన్నారు.







జయహో భారత్

వన్‌డే ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై భారత్ విజయ భేరి మోగించడంతో శనివారం రాత్రి నగరంలో అభిమానుల ఆనందం అంబరాన్నంటింది. త్రివర్ణ పతాకాలతో సందడి చేశారు. జయహో భారత్ నినాదాలతో నగర వీధులు మార్మోగాయి. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో 64 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ అందరినీ ఆకట్టుకుంది. ఇక్కడ ప్రముఖ సినీనటి శ్రియా శరణ్ పాల్గొని సందడి చేసింది. – సాక్షి, సిటీబ్యూరో

ఆర్.ఎస్ బ్రదర్స్‌లో దసరా-దీపావళి ధమాకా



లక్డీకాపూల్: దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని వచ్చే నెల 19వ తేదీ వరకు ఆర్.ఎస్ బ్రదర్స్‌లో దసరా – దీపావళి ధమాకాను నిర్వహిస్తున్నారు. కొనుగోలుదారులకు వీక్లీ బంపర్ డ్రాల ద్వారా 150 టీవీఎస్ జూపిటర్ బైకులను బహుమతులుగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా ఈ నెల 15, 22, 29 తేదీలతో పాటు వచ్చే నెల 5,12,19 తేదీల్లో కస్టమర్ల సమక్షంలో డ్రా తీయించి విజేతలకు బహుమతులు అందిస్తారు. ఇక రూ.500 విలువ చేసే ప్రతీ కొనుగోలుపై లక్కీ డ్రా కూపన్ ఇవ్వనున్నారు. దసరా పండుగకు సరికొత్త పండుగ కలెక్షన్లలో పట్టుచీరలు, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్‌లను అతి తక్కువ ధరలకే అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆర్.ఎస్ బ్రదర్స్ నిర్వాహకులు పేర్కొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI

స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ - సికింద్రాబాద్ (4106), 5-9-76, 2వ అంతస్తు, ప్రభాత్ టవర్స్, ఎస్‌బిఐ అమరావతి LHO ఎదురుగా, చాపెల్ రోడ్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్-500001. ఇ-మెయిల్: team1samb.sec@sbi.co.in

అధీకృత అధికారి: శ్రీ కే.వీ. మల్లిక్, ఇ-మెయిల్ ఐడి: team1samb.sec@sbi.co.in, మొబైల్ నం. 7997211609

వీరికి: 1) M/s. మాతా ఎనర్జీ లిమిటెడ్, నమోదిత కార్యాలయం & కార్పొరేట్ కార్యాలయం: 503, టోపాజ్ బిల్డింగ్, అమృత హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్ - 500082, 2) శ్రీ కలిదిండి వెంకట రమణ రాజు తండ్రి లేట్ KAN రాజు, 2-9-4/A, బీబీ సెంటర్ రోడ్, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆం.ప్ర., 3) శ్రీ శ్రీనివాస్ రావు తండ్రి శ్రీ శ్రీమన్నారాయణ మూర్తి, 5-577/4/A, చేతన హౌసింగ్ కాలనీ, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్, 4) శ్రీ కలిదిండి సత్యనారాయణ రాజు తండ్రి శ్రీ KAN రాజు, ప్లాట్ నం. 79, రోడ్ నం.9, జూబ్లీహిల్స్, హైదరాబాద్, ఇక్కడ కూడా: 8-2-293/82/A/824, రోడ్ నం. 40, జూబ్లీహిల్స్, హైదరాబాద్-32, 5) M/s. శ్రీ మాతా ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, నమోదిత కార్యాలయం & కార్పొరేట్ కార్యాలయం: 503, టోపాజ్ బిల్డింగ్, అమృత హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్ - 500082, 6) M/s. శ్రీ మాతా ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్, మేళ్ళచెరువు (గ్రామం & మండలం), కోదాడ దగ్గర, నల్గొండ జిల్లా, ఆం.ప్ర.

అనుబంధం-IV A [రూల్ 8 (6)కి నిబంధన చూడండి]

స్థిరాస్తుల అమ్మకం కోసం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి, సెక్యూర్డ్ క్రెడిటార్‌చే నిర్మాణాత్మకంగా స్వాధీనం చేసుకోబడింది, అవి రుణగ్రహీత: M/s. మాతా ఎనర్జీ లిమిటెడ్ మరియు గ్యారంటార్లు: 1) శ్రీ కె. వెంకట రమణ రాజు, 2) శ్రీ కె. సత్యనారాయణ రాజు, 3) శ్రీ శ్రీనివాస రావు మరియు కార్పొరేట్ గ్యారంటీ 4) శ్రీ మాతా ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ నుండి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయి పడిన 30-09-2023 నాటికి రూ. 142,58,44,280/- (నూట నలభై రెండు కోట్ల యాభై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల రెండు వందల ఎనభై రూపాయలు మాత్రమే) + 01-10-2023 నుండి వడ్డీ బకాయి + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు మొ။వి (రుణగ్రహీత / గ్యారంటార్లు / వేలం బిడ్డర్లు కంపెనీచే చెల్లించబడిన మరియు డిమాండ్ నోటీస్ జారీ చేసిన తర్వాత ఆస్తుల వేలం అమ్మకం ద్వారా రికవరీ అయిన మొత్తాలు ఇది వరకే లెక్కించబడినవి) రాబట్టుకొనుట కోసం "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా," "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏముంటే అదే" ప్రాతిపదికన 16-11-2023న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) / గ్యారంటార్ (లు) / తనఖా పెట్టిన వ్యక్తి (లు)కు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

ఆస్తి నం. 1: డాక్యుమెంట్ నం. 2607/2012 తేది: 17-05-2012 ప్రకారం శ్రీ K.S.N. రాజుకి చెంది ఉండి నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి గ్రామంలో గల సర్వే నం. 253లోని ఎ.5.15 గుంటల విస్తీర్ణం గల మెట్ట భూమి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: వట్ల ఎల్లయ్య & ఇతరుల వ్యవసాయ భూమి, దక్షిణం: కొనుగోలుదారు వ్యవసాయ భూమి, తూర్పు: కొనుగోలుదారు వ్యవసాయ భూమి, పశ్చిమం: ఎ. బుచ్చి రెడ్డి యొక్క వ్యవసాయ భూమి.

రిజర్వు ధర: రూ. 1,90,00,000/-; బయానా: రూ. 19,00,000/-; వేలం తేది: 16-11-2023

వేలం సమయం: ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.లు; బిడ్ ఇంక్రిమెంట్: రూ. 1,00,000/-

బయానా చెల్లింపు: కాగోరు బిడ్డర్లు ఇ-వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు ఇండియన్ బ్యాంక్స్ ఆక్షన్ ప్రాపర్టీస్ ఇన్ఫర్మేషన్ (IBAPI) పోర్టల్ (https://www.mstcecommerce.com/ auctionhome/ibapi/index.jsp) లో తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. బిడ్డర్ల రిజిస్ట్రేషన్ కనీసం మూడు పని దినములు పడుతుంది కనుక వేలం తేదీకి తగినంత ముందుగా బిడ్డర్లు తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. కాగోరు బిడ్డరు, తమ బ్యాంకు అకౌంట్ ద్వారా IBAPI పోర్టల్‌లోని IBAPI వ్యాలెట్‌కు బయానా డిపాజిట్ దాఖలు చేయవలెను.

తనిఖీ మరియు ఏవేని స్పష్టీకరణల కోసం కాగోరు బిడ్డర్లు అధీకృత అధికారిని ఫోన్ నంబరు: 7997211609పై లేదా బ్యాంక్ ఆమోదిత రిజల్యూషన్ ఏజెంట్ మెసర్స్ గుడ్‌విల్ అసోసియేట్స్ వారిని సెల్ నం. 9949901281 లేదా 9666247000 పై సంప్రదించవచ్చును.

గమనిక: ఇ-వేలం తేదీలోగా బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించకపోతే పైన తెలిపిన తేదీన ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు సంబంధించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/ గ్యారంటార్లకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ (a) "http://www.sbi.co.in" (b) "https://ibapi.in" లో ఏర్పాటు చేసిన లింక్‌ను రిఫర్ చేయండి.

తేది: 07.10.2023 ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా 'వాక్ ఫర్ ఫ్రీడం'

సాక్షి, సిటీబ్యూరో: మానవ అక్రమ రవాణా పైన ప్రతి ఒక్కరికి అవగాహన పెరగాల్సిన అవసరముందని భారత మాజీ బాస్కెట్ బాల్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ అన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, ప్రజల్లో ఈ అంశం పైన అవగాహన కల్పించడానికి శనివారం 'ది మూవ్‌మెంట్ ఇండియా' ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ ఫ్రీడం' అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వాక్‌ను మహ్మద్ రిజ్వాన్, వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లియోనార్డ్ మైరాన్, కార్యదర్శి సంపత్, గోపులాపురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు కూషిక్, సుధీర్, సుబ్బారావులు ప్రారంభించారు. ఈ వాక్‌లో పులువురు యువత, ఎన్జీవోల సభ్యులు, కాలేజీ విద్యార్థులు పాల్గొని హ్యూమన్ ట్రాఫికింగ్‌కు వ్యతిరేకంగా నినదించారు.

గాంధీ ఆలోచనా విధానం ఆదర్శనీయం



సాక్షి, సిటీబ్యూరో: గాంధీ మహాత్ముని ఆలోచనా విధానం, దేశ భవిష్యత్ కోసం పాటించిన పద్ధతులు అందరికీ ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. మహాత్మా గాంధీ హత్యకు గురై 75 ఏళ్లు గడిచిన సందర్భంగా బంజారాహిల్స్‌లోని గోతెజంత్రం వేదికగా 'రిమెంబరింగ్ గాంధీ, క్వశ్చనింగ్ ఇండియా' అనే 3 రోజుల కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం 'గాంధీ అండ్ డెమొక్రటిక్ డిసగ్రిమెంట్' అనే అంశంపైన చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈ ప్యానల్ చర్చలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి భాంగ్యా భుక్యా, జేఎన్‌యూ ఢిల్లీ నుంచి మృదుల ముఖర్జీ, ప్రముఖ రచయిత గీతా రామస్వామి, మోహన్ గురుస్వామి పాల్గొన్నారు. అనంతరం ఇదే వేదికగా 'గాంధీ అండ్ మోడ్రన్ ఎన్విరాన్మెంటలిజమ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్యానల్ చర్చలో నిషికాంత్ కోల్గే (సీఎస్‌డీఎస్-ఢిల్లీ), విజయ రామదాస్ మందాల (యనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), లావణ్య సురేష్ (బిట్స్ పిలానీ), శివ్ విశ్వనాథన్ (ఓపి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ) తదితరులు పాల్గొన్నారు. గాంధీజీ అహింసా సిద్ధాంతం, ఆయన నిరాడంబర జీవన శైలి, దేశం కోసం చేసిన త్యాగాలపై చర్చించారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో బంపర్ ఆఫర్లు



సాక్షి, సిటీబ్యూరో: రానున్న దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో 'ఆల్ న్యూ కలెక్షన్ ఫర్ ఎంటైర్ ఫ్యామి' పేరుతో సరికొత్త విక్రయాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 7 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు ప్రతివారం లక్కీ డ్రా, బంపర్ డ్రాలను నిర్వహిస్తున్నామని యాజమాన్యం తెలిపింది. అక్టోబర్ 28వ తేదీన బంపర్ డ్రాలో 20 కార్లను, నవంబర్ 11వ తేదీన మరో బంపర్ డ్రాలో 15 కార్ల విజేతలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ పండుగల సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో మొత్తంగా 2500 మంది విజేతలకు రూ.5 కోట్ల విలువ చేసే టీవీలు, వెండి గ్లాసులు, ఖరీదైన వాచ్‌ల వంటి వివిధ బహుమతులను లక్కీ డ్రాలో అందజేస్తామని వివరించారు.

మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని పొందుపర్చాలి

బీఆర్ఎస్ పార్టీకి డీజేహెచ్ఎస్ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు అంశాన్ని పొందుపరచాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారక రామారావును డెక్కన్ జర్నలిస్ట్ హైజింగ్ సొసైటీ కోరింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అత్యంత చురుకుగా, క్రియాశీలకంగా జర్నలిస్టులు పాల్గొన్నారని, రాష్ట్రం ఏర్పాటై దశాబ్దకాలం కావొస్తున్నా జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలు ఇప్పటికీ నెరవేరలేదని డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల చిరకాల స్వప్నం సొంతిల్లు అని, హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న రాష్ట్రస్థాయి వర్కింగ్ జర్నలిస్టుకు 300 గజాల ఇంటి స్థలం కేటాయించాలని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోగా నిర్ణీత ప్రదేశంలో ఇంటి జాగా కేటాయిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంతో పాటు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వమే రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన జర్నలిస్టులకు నెలకు రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి హెల్త్ స్కీం అమలు చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- కత్తులతో పొడిచి చంపిన మరో రౌడీ షీటర్
- 'ఇంకో ఇద్దరు టార్గెట్‌లో ఉన్నారు..ఆ తర్వాతే లొంగిపోతా' అంటూ నిందితుడి సవాల్
- పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఘటన జరిగిందని స్థానికుల ఆరోపణ



రౌడీషీటర్ సర్వర్ (ఫైల్)

రాజేంద్రనగర్: అత్యాచారం కేసులో నిందితుడుగా ఉన్నందున పోలీసులకు లొంగిపోవాలని సూచించినందుకు ఓ రౌడీషీటర్‌ను మరో రౌడీషీటర్ కత్తులతో పొడిచి హత్య చేశాడు. అనంతరం నిందితుడు తన టార్గెట్‌లో మరో ఇద్దరు ఉన్నారని.. వారిని హత్య చేసిన అనంతరం లొంగిపోతానంటూ పోలీసులకు సవాల్ విసిరాడు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజేంద్రనగర్ డైరీఫామ్ ప్రాంతానికి చెందిన ఖూనీ గౌస్ రౌడీషీటర్. ఇతనిపై ఇప్పటికే హత్య, హత్యాయత్నం, అత్యాచారం, దోపిడీలు, భయభ్రాంతులకు గురి చేయడం తదితర కేసులు నమోదై ఉన్నాయి. గతంలో పీడీ యాక్ట్‌పై జైలుకు వెళ్లిన ఖూనీ గౌస్ గత నెలలో బయటికి వచ్చాడు. బయటికి వచ్చిన అనంతరం తన గ్యాంగ్‌తో పాత సామ్రాజ్యాన్ని కొనసాగించడం ప్రారంభించాడు. ఇందులో భాగంగా తన కదలికలపై పోలీసులకు సమాచారం అందిస్తున్నాడని అనుమానించి ఐదు రోజుల క్రితం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డైరీఫామ్ వద్ద పాలను విక్రయించే ఓ వ్యక్తి దుకాణంపై దాడి చేశాడు. షాపును పట్టపగలే తగులబెట్టాడు. అడ్డొచ్చిన వారిని కత్తులతో బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు..నిందితున్ని మాత్రం పట్టుకోలేకపోయారు. ఇదిలా ఉండగా..రాజేంద్రనగర్‌కు చెందిన మరో రౌడీషీటర్ సర్వర్ (30) ఇటీవల ఖూనీ గౌస్‌ను కలిసి గొడవలు వద్దని, పోలీసులకు లొంగిపోవాలని సూచించాడు. దీంతో ఖూనీ గౌస్ శుక్రవారం రాత్రి కలుద్దామంటూ సర్వర్‌కు తెలిపాడు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో సర్వర్‌కు ఫోన్ చేసి జనప్రియ వెంచర్ ప్రాంతంలోని మొండి ఖత్వా ప్రాంతానికి రావాలని తెలిపాడు. సర్వర్ అక్కడికి వెళ్లగానే.. తననే పోలీసులకు లొంగిపోమంటావా...అంటూ కత్తులతో విక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో సర్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం అక్కడే ఉన్న ఇతర స్నేహితులతో 'మరో ఇద్దరు తన టార్గెట్ అని..వారిని చంపిన అనంతరం పోలీసులకు లొంగిపోతానని' తెలిపి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అప్పుడే అరెస్టు చేసి ఉంటే...

ఐదు రోజుల క్రితం డైరీఫామ్ వద్ద జరిగిన దాడిలో నిందితుడైన ఖూనీ గౌస్‌ను అరెస్ట్ చేసి ఉంటే ఈ హత్య జరిగేది కాదని స్థానికులు వ్యాఖ్యానించారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. ఖూనీ గౌస్ అత్యంత కిరాతకంగా వ్యవహరిస్తాడని... గతంలో అత్తాపూర్, రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన సంఘటనలే ఉదాహరణ అని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పీడీ యాక్ట్ అనంతరం జైలు నుంచి విడుదలైన ఖూనీ గౌస్‌పై నిఘా లేకపోవడంతో ఈ సంఘటనలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుండి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం



యజ్ఞం వివరాలను వెల్లడిస్తున్న మాధవీలత తదితరులు

అబిడ్స్/నాంపల్లి: భారతదేశ సర్వతో ముఖాభివృద్ధి, భారతీయుల శ్రేయస్సుతో పాటు భాగ్యనగర్ ప్రజల హితం కాంక్షిస్తూ లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి భారత భాగ్య సమృద్ధి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు మాధవీలత తెలిపారు. నగరంలోని సీతారాంబాగ్ శ్రీరామ దేవస్థాన ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఆలయంలోనే నిర్వహించే యజ్ఞం నవంబర్ 27 వరకు 45 రోజులపాటు కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. పలు హిందూ ధార్మిక సంస్థలతో కలిసి భాగ్యనగరంలో హిందువుల హితం కోరుతూ ఈ యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. 45 రోజుల పాటు 'సర్వకార్యసిద్ధి సహస్ర చండీసహిత మహా రుద్ర కామేశ్వర కామేశ్వరి యాగం' జరుగుతుందని చెప్పారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ 100% పాస్ గ్యారంటీతో అక్టోబర్ లో 10th, ఇంటర్ & జనవరిలో డిగ్రీ, పీజీ డిప్లొమా పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. ఫెయిల్ అయినా రీకౌంటింగ్ ద్వారా పాస్, ఫైన్ తో అడ్మిషన్స్ కలవు. ఫోన్ 6305979755 [H-793408]

■ Join M.Com, MA English, MA Social work, PLNM Degree College. Opp: ANU. Ladies with 60% / Above 80% get Free Discount. 9177408565 / 9642656449 [G-781723]

■ 10th, Inter One Sitting Telangana Open School. BA, B.com, Bsc, MA, M.Com, Msc, MBA, MCA, BLISC, MLISC Online Exams In December. Cont: 7702669439, 9440027497 [H-193225]

Real Estate

■ హైదరాబాద్ అన్ని ఏరియాల్లో ఫామ్ ల్యాండ్ కి 1సం॥నికే, ఓపెన్ ప్లాట్‌కి 2 సం॥లకే, ఇళ్ళు/అపార్ట్‌మెంట్స్‌కి 3సం॥లకే రెట్టింపు బైబ్యాక్ లీగల్ ఎంఒయుతో Contact: 9618246446 [HA-552]

■ శంకర్‌పల్లి, చేవేళ్ళ, పరిగి, షాద్‌నగర్, శంషాబాద్, తాండూర్, మహబూబ్ నగర్, జడ్చర్లలలో ల్యాండ్స్ & ప్లాట్స్, విల్లాస్ అన్ని రకాల ప్రాపర్టీస్ అమ్మ / కొనబడును. సంప్ర॥ 9440571029 [Y-784275]

COMMERCIAL

■ Commercial Shops for Sale Total 670 sft. Semi Sellar 3 Shetturs Beside Citizen Co-operative Bank, BDL Road, Balapur X Road Ph : 8309062095, 9491273901 [H-793402]

FLAT FOR SALE

■ మల్లంపేట్ గ్రా॥ దుండిగల్ మం॥ మేడ్చల్ – మల్కాజ్‌గిరి జి॥ 2380 చ.అ. విస్తీర్ణం, 66.62 చ.గ. అవిభాజ్య అనిర్దేశ్య స్థల వాటాతో 3 BHK ఫ్లాట్ – ప్రభుత్వ రంగ బ్యాంక్ ద్వారా వేలం. సం. Ph: 9246273514 & 9440201771 [HA-10963]

■ అమ్మడానికి ఫ్లాట్ ఆసిఫ్ నగర్ వద్ద 3వ అంతస్తులో 2BHK ఫ్లాట్, గాంధీ విగ్రహం ఎదురుగా, లిఫ్ట్ & కార్ పార్కింగ్ సౌకర్యం. ఫోన్ : 9849261602 [HA-95247]

■ Risalabazar Near Bolaram Rly Station 3BHK Dlx Flats 1450 sft. Ready to move. GHMC Approved. Ph: 9949221299 [HA-1928]

■ Near Kowkur, Yapral, Sec-Bad, Ready to Occupy 3BHK Flats -1715 SFT & 1945 SFT Gated Community, Clubhouse, Near GHMC Park Must See Call: 8247859501 [H-193221]

■ Affordable 3BHK Flats IN Ready to Occupy Gated Community Must SEE ! Last 2 Flats Available for sale No GST 9490439711 [H-193220]

■ 2 BHK Flats for Sale Shankarpally, Hyderabad. Below 40 Lacs with Bank Loan Available for More Details. Ph : 80193 35262 [V-2200]

■ Secunderabad Near AOC, Beside RK Puram Rythu Bazar, 2&3 BHK DLX Flats Occupation 1 Month, Community of 75 Flats, Ph: 9849529518, 9440148865 [HA-1776]

■ Empire Urbana 2&3 BHK for Sale Middle on Nanakramguda Beside Keystone Public School OC Obtained 7499/- channel Partners are Welcome Ph: 8712317349 [H-193314]

■ HMDA with Rera Approved Ready to move luxury 2BHK Flats for sale at Ghatkesar. Bank loan Avl. Ph: 9182166618 [H-788696]

■ "0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

■ Chakripuram, ECIL, 3BHK, 1450Sft. E/F, N/F, Luxury Flats for Sale. Ready to occupy. Contact : 9866053685, 9949437555, 9392400065 [HA-1754]

HOUSE FOR SALE

■ రామంతాపూర్ టీవీ స్టూడియో దగ్గర కామాక్షి పురం 100 గ॥ ఓల్డ్ ఇల్లు 2 BHK గ్రౌండ్ ఫ్లోర్ ఫస్ట్ ఫ్లోర్ 2 పోర్షన్లు రూ.80 లక్షలు అమ్మబడును. Ph: 7674097299 [H-788334]

■ Opp Jamai Osmania Rly Stn, Lalitha Nagar, 30 Sec Walk To Stn, 410 Yds N/E/F, 2 Sides Rd, 2 Floors Old House, Can Divide 2 Plots, 100% Vasthu, 4car Parks, 1 Lac p yard Fixed, Ph: 9948097719, 9848571719 [HA-3409]

■ Safilguda : 66 yds - 32 L / 34 yds 10 L / 105 yds Duplex 95L / 150 yds, G+1-1.20 Cr / 130 yds G+2-1.05 Cr / 1105 yds G+1 - 1.10Cr / 130 yds G+1 - 1.20 Cr ✆ 93913 71548 [B-2086]

■ Padmavathi Nagar, Venkataramana Colony, Vanastalipuram, N/F 188 Sq. Yards Indp House+Pent House for sale. 8606109635, 9037941951. [H-793366]

■ 2 Villas Triplex at Kismatpur Gated Community with 274 Sq.yds Plot with Builtup 4143 Sft. with 4 Bedroom with Lift, E&W Facing constant MACI Realtors. Ph : 9866338060 [H-189423]

■ Dammaiguda, Raji Reddy Nagar, Opp: National Mart, Independent House G+1, 133 yds, S/F @ 1.15Cr. (Neg.) Ph: 9502253623 [H-189427]

■ 50 Lakhs, East Face, Indp. DLX, House 110, 120, 150, Sqyds for Sale at Rampally Village, Contact : 9392400065, 9391166354 [HA-1755]

LAND FOR SALE

■ ఈస్ట్ ఫేసింగ్ 240 గజాల ప్లాటు అమ్మబడును @ మహేశ్వరం. 100 అడుగుల రోడ్డికి రెండవది. పార్క్‌కు ఎదురుగా & HMDA ఫైనల్ అప్రూవల్. Rs. 9500 గజం. ఫోన్: 9966521191 [H-788391]

■ బాపట్ల జిల్లా, కొరిశపాడు(మం), దైవాలరావూరు గ్రామంలో గల 19 ఎకరాల వ్యవసాయ భూమి (Agri-Land) అమ్మబడును. సం॥ ✆ 99891 57441, 99088 62323. [O-191625]

■ Near Chevella 27 Guntas Farm Land suitable for Farmhouse for sale, contact: 9989992569 [H-193258]

■ Sankarpalley Road 2nd Blt, Thangadapalley (V) Chevelle (M) 7 Acers Land, per Acer 2.65 Cr, Near RRR 2.5 km, Owner Sale : ✆ 78936 60087 [B-2085]

PLOT FOR SALE

■ Fortune Butterfly City ముచ్చర్ల ఫార్మా సిటీకి దగ్గర కడ్తాల్ & ఆమన్‌గల్ D.T.C.P. RERA ఓపెన్ ప్లాట్స్ గజం ॥ 6500/-, 11,500/-, 12,500/- Reasale ప్లాట్స్ కలవు ✆ 8464923343 [B-788043]

■ రాయగిరి archi నుండి 2km దూరంలో 50 acrs old వెంచర్‌లో open plots చ.గ.కే. 3999/- EMI సౌకర్యం కలదు. Ph: 9959711500 [HA-95285]

■ దసరా స్పెషల్ ఆఫర్ ! 5గ్రా॥ గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి. తక్కువ ధరలో రెరా ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి॥ Ph: 8639545438 [H-793470]

■ షాద్‌నగర్ హైవే, శ్రీశైలంహైవేలో DTCP వెంచర్లో Open Plots కలవు, అన్ని డెవలప్‌మెంట్స్‌తో @ 8000/- to 15000/- వరకు. సంప్ర : 9949695027 [H-193309]

■ గజం కేవలం 620/- రూ: మాత్రమే, ఎర్రచందనం, ఫార్మ్‌ల్యాండ్స్, తక్కువ పెట్టుబడి అత్యధిక రాబడి ప్రకాశం కనిగిరి హైవేకు దగ్గర 9700676899, 9966459184 [H-781286]

■ కంపెని డైరెక్ట్ సేల్ (బెస్ట్ ప్రైస్) 14 బ్యాలన్స్ HMDA ఫైనల్ అప్రూవల్ ప్లాట్సు 150-800 Sq. @ BB నగర్ టౌన్, 100' సిటీ బస్సు రోడ్డు ఫేసింగ్ M/r మెట్రో, AIIMS, ఫోన్ : 9949912266 [H-A10836]

■ గజం కేవలం 3000/- మాత్రమే, మీ పెట్టుబడి పదింతలు అయ్యే అవకాశం రామోజీ ఫిలింసిటీ దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్లు అమ్మకానికి కలవు. ఫోన్ : 8919577389 [H-193305]

■ Manikonda Panchavati Colony Semi-Commercial 400 Sq. Yards N/F Plot & 300 Sq. Yards Residential East & South Corner Plot for Sale. Contact : (9AM - 10PM) Ph: 9246546336. [HA-4272]

■ 200 Sq. yds W/F, open plot for Sale at Cheryal Village, Keesara Mandal, 300 Mtrs from Keesara ORR. Ph: 9866447712. [H-189428]

TO-LET

■ హన్మకొండ (వరంగల్)-కలెక్టర్ బంగ్లాస మీపంలో అందమైన ట్రిప్లెక్స్ భవనం (5000+200 గజాల స్థలం) అద్దెకు కలదు. నర్సరీ స్కూల్ / ఫ్యామిలీ రెస్టారెంట్ / లేడీస్ హాస్టల్ / గెస్ట్‌హౌస్‌కు అనుకూలం. ఫోన్ : 9390113169 [HA-781293]

■ 3BHK, 2nd & 3rd Floor 1300 Sft Opp: Ravindra Bharati School, NGO's Colony, Vanasthali puram Call : 9849738694, 9700006495 [H-189609]

■ Uppal Dharmapuri Colony Spacious 1st Floor 3BHK for Rent in Independent House. Close to Metros Little Flower College Rent 18K. Ph: 9100710277 [H-793468]

Services

■ బ్యాంక్,ప్రైవేట్ సంస్థలలోతాకట్టుపెట్టిన బంగారంను మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలలో తక్కువ(88పైసలు)వడ్డీకి,ఎక్కువగ్రాము (4500) రేటుకు తాకట్టు పెట్టించబడును.8977044454. [T-764094]

BUSINESS SERVICE



■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788377]

BUSINESS OFFER

■ పెట్టుబడి పెట్టండి, అధిక లాభాలు పొందండి, మాది అతిపెద్ద సూపర్ మార్కెట్, కిరాణా, బియ్యం, రైస్ మిల్లుల బిజినెస్, పార్ట్‌నర్స్ కావలెను, అన్ని బిజినెస్‌కి మంచి లాభాలు, సంవత్సరానికి రెట్టింపు లాభం, రిటైర్డ్ వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ వారు, కొత్త వ్యాపారం వారు, బిజినెస్‌లో ఆసక్తి గల వారు డైరెక్ట్ Ph: 8008251356 [HA-1545]

■ నెలవారీ రాబడి కావాలా? మీ స్వంత ఫారెక్స్ ట్రేడింగ్ ఖాతా నుండి పొందండి సురక్షితంగా మరియు సురక్షితం సంప్రదించండి. Ph: 8125746262 [H-788699]

■ My City కంపెనీ ద్వారా వ్యాపార అవకాశం. మోర్, బిగ్ బాస్కెట్‌లలో నిత్యవసర వస్తువులు కొనండి కొనిపించండి. ప్రతిరోజు ఆదాయం పొందండి. మహిళలకు అవకాశం. 8074853850, 8688842188 [G-1165]

■ వెల్లుల్లి పొట్టు తీసే మిషనరీస్ అమ్మబడును (Peeled Garlic Missionaries for Sale) సంప్ర : 9396325247 [HA-13204]

■ మా బిజినెస్‌లో ప్రతి 45రోజులకి 10లక్షల టర్నోవర్ కలదు. లక్ష నుండి పెట్టుబడులు కావలెను. మంత్లీరిటర్న్స్. Ph: 9381867282 [HA-13203]

■ స్త్రీ/పు॥ ఎవరైనా పెట్టుబడి లేని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రూ. 50వే నుండి 1లక్షపైన పొందండి ఫ్రీ ట్రైనింగ్ (స్టైఫండ్) ఇవ్వబడును. Ph: 7799195959 [H-788330]

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి. లేదా ఏజెంట్‌గా జాయిన్ కావటానికి సంప్రదించండి. ఫోన్ : 9000543747 [HA-11773]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41395]

■ Wanted Investor's: 100% GURUNTED my Airlines Work Money Exchange Online High Budgets Transfers & MANUFACTURING Business, Months Profit Continue. PH: 9490127861. [HA-30449]

CONSULTANCY

■ రామకృష్ణ గ్రూపు, (Man Power Supply Company) VJA-HYD. టెలీకాలర్స్, సెక్యూరిటీ గార్డ్స్, అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, టీమ్‌లీడర్స్, అడ్మిన్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హౌస్‌కీపింగ్, HR మేనేజర్స్ సప్లయ్ చేయబడును.✆ 92814 52830, 92814 52840 [B-1068124]

INSURANCE

■ కోటి రూ॥లు మొత్తం మెచ్యూరిటీ కొరకు, కోటి రూ॥ల తక్షణమే ఇన్సూరెన్స్ కొరకు ప్రతిరోజు 300/- రూ॥లు చొప్పున పొదుపు చేయండి. పెన్షన్స్, పిల్లల మనీబ్యాక్ LIC పాలసీల కొరకు, కరోనా రక్షక్ హెల్త్ పాలసీ కొరకు, శ్రీరామ్ చిట్స్ & డిపాజిట్ కొరకు సంప్ర: 9246351657. WWW.LICSAMRAT.COM [HA-11762]

SECOND SALES

■ LED TV; ఫ్రిడ్జ్, AC, ఫర్నిచర్ Cash or EMI & Credit Card పై ఇవ్వబడును. పొలము, ప్లాటు, ఇల్లు, కారు, బైక్ కొనబడును/ అమ్మబడును. బంగారం విడిపించబడును. Ph: 7799911759 [HA-2849]

PERSONAL CARE



CHANGE OF NAME

■ I, Ramya Sirisha Kandarpa D/o. of Anantha Subrahmanyam Kandarpa R/o Sai Bhaskar Hub, Hyderabad has Changed my name from Ramya Sirisha Bangari to Ramya Sirisha Kandarpa for all future purposes [WB-31373]

■ I, Arshiya Farheen D/o. Amreen sikandar H.No. 4-81-8, Veerareddy Nagar Colony, Hyd-76, I have Changed my Mother Name as per Aadhar card Amreen W/o. Mohammed Sikandar All Records [H-793509]

■ I, Lohith Bondalapti R/o. Plot No-137, Tirumala Nivas, Mythri Nagar, Phase-1, Madinaguda, Miyapur, Hyderabad, RR-500049, have Changed my name to LOHITH BONDALAPATI. [UA-36762]

■ I, Ram Raj S/o. Late Rayajee Rao S. B.Com, Retd Osmania University Employee. Shall hence forth be as RamRaj Shankapal S/o. Late Rayajee Rao Shankpal for the purpose Correction of Wrong entries Occurred in School Record due to Parental Mistake. [H-793368]

■ I, Hashim Kothalia S/o. Zulfikar Hussain Kothalia, Age 35years, Address, P.No. 160, Opp Sai Ansh Arcade, Durga Vihar Colony, 5th Main Cross, Tirumalagiri, Secunderabad, Hyderabad - 500015, Has Changed my Name from Hashim Kothalia to Hashim Zulfikar Kothalia Vide Affidavit Number 38AA 133749 Dated 09-10-2023 Before Notary By P. Raveendranath. [UA-36755]

OLD AGE HOME

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-189498]

■ శ్రీరామ ఓల్డ్ ఏజ్‌హోమ్ & హోమ్ కేర్ సర్వీసెస్ పక్షవాతంతో మంచాన వున్న ముసలివారికి, పేషెంట్లను మా హోమ్‌లో చేర్చుకోబడును 24గం. మీఇంటి వద్దనే ఉండి సేవ చేయుటకు (కేర్ టేకర్) స్త్రీ&పు॥లను పంపబడును. 8019779801, 9493725800 [HA-550]

■ వంట, ఇంటి పనికి, పిల్లలను, వృద్ధులను, పేషెంట్స్‌ని చూసుకోవడానికి కేర్‌టేకర్, ఆయాలను మీ ఇంటి వద్దకు పంపబడును. 20-40సం. స్త్రీ/పు వర్కర్స్ కావలెను. ఫోన్: 6309807798, 9121099519 [H-788385]

■ Worried About Patient care We Provide you Home Care Nursing or we will Provide you at our Old Age Home Careeing-U Ph: 9381510498 [H-788336]

TOURS & TRAVELS

■ Europe malta US UK Australia. 99% Success, Visit & Job Visa Very Easy Process 25% Refundable AMT Exp Service HNRQ ABROAD C/W: 9390898642 [HA-30450]

Wanted

■ క్యాంటీన్‌లో టీ సప్లయి చేయుటకు హెల్పర్ మరియు ఫుడ్‌మాస్టర్ కావలెను. మంచి జీతం @మినర్వ కాంప్లెక్స్, ప్యారడైజ్, సికింద్రాబాద్. Ph: 8099929143/ 9989762009 [H-189344]

■ రిసెప్షనిస్ట్, టెలికాలర్లు-హోమ్ బేస్డ్ DTP డాటా ఎంట్రీ, వీడియో ఎడిటింగ్, యాంకర్లు, హెల్పర్స్, డ్రైవర్లు, కలెక్షన్ బాయ్స్, సూ॥వైజర్స్, ఇంగ్లీష్ టీచర్లు, మ. జీ॥ 10-16, ఫ్రీ రూం మీల్స్ ఫోన్: 9505261777 [H-788338]

■ ఉప్పల్ దుర్గా క్రటీస్ పాయింట్‌లో పనిచేయుటకు ప్యాకింగ్ బాయ్/ గర్ల్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. Ph: 9030511159 [H-788700]

■ లాండ్రీ సర్వీస్‌లో ఇస్త్రీ / Ironing చేయుటకు మనుషులు కావలెను. టిఫిన్ + మధ్యాహ్న భోజనం + జీతం– 21,000/– ఫోన్ : 8897754655 [H-189613]

■ V.B. Johnson Elevators Lift కంపెనీలో లేడీ రిసెప్షనిస్టు (తెలుగు, హిందీ ఇంగ్లీష్) 2 Years Exp. వారు కావలెను. ఫోన్ : 9154954305, 9177762495 [H-189612]

■ బంజారాహిల్స్ రోడ్‌నం. 3, అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న చిన్న ముస్లిం కుటుంబానికి చిన్న బేబీస్ ను చూసుకొనుటకు ఇంట్లోనే ఉండి, పూర్తి సమయం కోసం ఒంటరి లేదా వితంతువు లేడీ ఒక ఆడమనిషి కావలెను. 8106564907 [H-193316]

■ 24గం. ఇంట్లోనే ఉంటూ ఇంటి, వంట & బేబీ కేర్, వృద్ధులను చూసుకొనుటకు అర్జెంటుగా అనుభవం ఉన్న / లేకున్నా స్త్రీలు కావలెను. Age: 18-45 సం॥, జీతం: 15-18 వేలు, రూం+భోజనం ఫ్రీ. ఫోన్ : 9398165519 [H-193226]

■ ప్రముఖ విద్యాసంస్థకు హైదరాబాదు ఉప్పల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్ ఇవ్వబడును. సంప్రదించండి. సెల్ : 8880118899 [G-4740]

■ హైదరాబాద్ - ఇంట్లో ఉండి వంటపని చేయుటకు అనుభవం కలిగి ఉత్సాహవంతురాలైన 35 లోపు ఏబాదరబంధీ లేని స్త్రీ కావాలి. ఫోన్ : 9581130909 [H-781294]

■ అత్యద్భుత అవకాశం. ఒక ప్రముఖ Industryలో Part Time/Full Time పని చేయుటకు 10th & above qualified వారు కావలెను. సంప్ర:93923 64542. [T-4671]

■ ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి అనుభవం గల క్లర్క్ విత్ కంప్యూటర్ ఆపరేటర్, టూరింగ్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్ : 7989823219 [H-793367]

■ చైతన్యపురిలోని ASPR Marketing Pvt. Ltd., కంపెనీలో పనిచేయడానికి లేడీ టెలికాలర్ కావలెను. (Fluency-Hindi, English & Telugu) ఫోన్ : 9390356112 [H-793412]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ మల్కాజిగిరిలో జ్యూట్/ కాన్వాస్ బ్యాగుల కోసం అనుభవజ్ఞులైన లేడీ టైలర్లు కావాలి. శిక్షణ + నెల నెలా జీతం+ బస్ పాస్. ఫోన్ : 9959430726 [HA-95158]

■ జంటనగరాలలో LIC అడ్వైజర్స్ కావలెను. కనీసం అర్హత 10th పాస్. కమీషన్ & కారు, ఇల్లు ఇంకెన్నో లాభాలు. లిమిట్ లేని ఆదాయం. సంప్రదించండి. Ph: 8919954217 [HA-553]

■ రాఘవి హోంకేర్ సర్వీస్ Govt Reg. పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, ANM, GNM, నర్సులు స్త్రీ/పు కా.జీ: 15-45 వేలు రూం + ఫుడ్ ఫ్రీ. సంప్ర: 8977842502 [HA-788830]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788372]

■ రామకృష్ణ గ్రూపు, విజయవాడ, హైదరాబాద్ కొరకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ అడ్మిన్స్, టీమ్‌లీడర్స్, మేనేజర్లు, అకౌంటెంట్స్, సూపర్ వైజర్స్ 10th ఆపైన చదివిన 20-50 సం. కలిగిన M/F కావలెను. భోజనం+ వసతి+ మంచి జీతం కలదు. VRS, Ex. ఆర్మీ వారికి ప్రాధాన్యత ✆ 94413 81122, 94408 41122 [B-1206746]

■ రామకృష్ణ గ్రూపు, (Man Power Supply Company) VJA-HYD. టెలీకాలర్స్, సెక్యూరిటీ గార్డ్స్, అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, టీమ్‌లీడర్స్, అడ్మిన్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హౌస్‌కీపింగ్, HR మేనేజర్స్ కావలెను. ✆ 92814 52836, 92814 52837 [B-1068125]

■ హైదరాబాద్ లో ఇంటిపని, వంటపనికి & వృద్ధులను, పిల్లలను చూసుకొనుటకు 9am to 6pm & 24 గం॥ స్త్రీలు మాత్రమే అర్జెంటుగా కావలెను. జీతం: 15వేలు, సంప్ర: 9985159897 [H-193213]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 6281208800, 6281208856 [B-1068136]

■ విజన్ సంస్థ HIV ప్రాజెక్టు HYD Shapurలో(2 మహిళ 10th)ఔట్రీచ్ వర్కర్స్‌గా చేయుటకు దరఖాస్తులు కోరుతున్నాం. వివరాలకై Ph: 9963914051 బయోడేటాను email కు పంపాలి. visionorg753@gmail.com [HA-30441]

■ భారతదేశంలోనే Real Estate రంగంలో ప్రథమ స్థానంలో గల కార్పొరేషన్ సంస్థకు Manager's కావలెను, 1-2lacs సంపాదన, Contact: GVReddy Ph: 9491337309 [H-788327]

■ మా షాప్‌లో పనిచేయుటకు కటింగ్, స్టిచింగ్ & మగ్గం వర్క్ తెలిసిన పని వారు కావలెను మంచి పని వాళ్ళకి మంచి జీతం॥ అతి తక్కువ ధరకే ఫాల్స్ అమ్మబడును. Ph: 9963889904 [H-193223]

■ ఫ్లెక్సీ ఆపరేటర్స్ మరియు హెల్పర్స్ Only జెంట్స్ కావలెను. Age: 18-40 సం॥లోపు, సికింద్రాబాద్, సంప్ర : 9705575608, 8886024602 [H-189341]

■ SL హోం కేర్ వైజాగ్ & Hydలో ముసలి వాళ్ళను,మంచాన ఉన్నరోగుల దగ్గర24గం.ఉండి పనిచేయుటకు నర్సులు,కేర్‌టేకర్లు(స్త్రీ/పు)కావలెను.ఫ్రీ భోజనం+వసతి+జీతం. 8125817240. [T-1959]

■ అన్‌లోడర్స్ హెల్పర్స్ కావలెను. 8గం॥ డ్యూటీ, వ:20-40 yrs మంచిజీతం+ బోనస్+ ఇన్సెంటివ్స్+ ESI & PF కలవు. ✆ 9100028528, 7396128206 [G-1145]

■ మెన్స్ టైలర్స్ కావలెను. ప్రముఖ టైలర్ షాప్‌లో పనిచేయుటకు అనుభవంగల ఫ్యాంట్ మేకర్స్, న్యూమలక్‌పేట్ మెయిన్‌రోడ్, రూ॥ 440/-, & హెల్పర్స్ కావలెను. ఫోన్ : 8106293959 [H-189607]

■ శంషాబాద్ నందు పనిచేయుటకు హౌస్ కీపింగ్ సూపర్ వైజర్స్, ఆయమ్మ, వార్డ్ బాయ్స్ & సెక్యూరిటీ గార్డ్స్ (అనుభవం ఉన్న / లేకున్న) వెంటనే కావలెను. జీతం : 10k-15k, ఫోన్ : 6301439731, 9885692860 [H-193253]

■ జీవితాంతం ఎక్కువ సంపాదన ఏ పెట్టుబడి లేకుండా కావాలంటే LIC ఏజెంట్‌గా చేరండి. 10th పాస్ అయి ఆడ/మగ పార్ట్/ఫుల్ టైం పనిచేయుటకు సంప్ర: 9246351657 [HA-11793]

■ Wanted Reporters in Hyderabad Twin Cities, in all the districts, mandals Females/Males (Minimum 3 Months Exp) SWATHI NEWS. Ph: 7997733373 [H-788335]

■ Req. Exp Telecallers(Female) for Reputed Bank DSA @ Tarnaka & Vanasthalipuram. Direct job. Fixed Salary. Ph: 8367610792, 8790153029 [H-793364]

■ Requires Teachers for Lower & Higher Classes for All Subjects & PET, St. Mary's High School RD No. 2, Madhura Nagar, Neredmet X Road, Cont : 9908225151, 040-42215151 [Y-784274]

■ Wanted DTP Operator Full/ Part Time in Siva Reddy Logics Exp- Minimum 1 year Salary 12-20K Call: 9494825132 [H-189611]

■ Dhurya Forex PVT LTD Required: Accounts & Admin Executives fresh/Exp. (0-2yrs) Salary 20K Qly : BCom Computer, MBA, MCom, Mail Id: dhuryafx@gmail.com Ph: 7416493174 [H-193217]

■ Urgently Required Tele-caller for Hotel, Plumber, Electrician In Hyd. Cont: 9160717322, 8309909633, 8096230476 [HA-576]

■ Marketing executive required for Rampally office Bank Home Loans Property Sales & Purchase. Salary Fixed. Ph : 7330760505, 7674840506 [HA-30420]

క్లుప్తంగా...

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



నందినగర్‌లో ఏర్పాటు చేసిన మండపానికి చేరుకున్న అమ్మవారి విగ్రహం

బంజారాహిల్స్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వాడవాడలా దేవీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి విశేష పూజలతో సందడి చేయనున్నారు. ఇందుకోసం యువకులు కమిటీలు ఏర్పాటు చేసుకొని ఈ వేడుకలను వైభవంగా నిర్వహించుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. బంజారాహిల్స్, ఫిలింనగర్, చింతల్‌బస్తీ, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు.

హైలైఫ్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీ తారలు, మోడల్స్

బంజారాహిల్స్: పండగలు, వివాహాది శుభకార్యాల సీజన్‌ను పురస్కరించుకొని ఈ నెల 21 నుంచి 23 వరకు హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన శనివారం బంజారాహిల్స్‌రోడ్ నెం.10లో నిర్వహించారు. సినీ నటి ప్రీతి సుందర్‌తో పాటు ప్రఖ్యాత మోడల్స్ ఈ ప్రదర్శనలో ఉంచబోయే దుస్తులు, ఆభరణాలు ధరించి సందడి చేశారు. ప్రదర్శనలో అరుదైన డిజైన్లతో కూడిన దుస్తులతో పాటు బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, ఫెస్టివ్ వేర్, క్రియేటివ్ ఫ్యాషన్ వేర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక పూజలు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న జూబ్లీహిల్స్ బీజేపీ నేత అలపాటి లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివిధ అభివృద్ధి పథకాల కోసం, సంక్షేమ పథకాల కోసం విడుదల చేసిన నిధులు, అభివృద్ధి పనులతో కూడిన కరపత్రాలు, వాల్ పోస్టర్‌లను జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం విడుదల చేశారు. శనివారం జూబ్లీహిల్స్ బీజేపీ నేత అలపాటి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పలువురు నేతలు అమ్మవారికి ఈ కరపత్రాలు, వాల్ పోస్టర్‌లను పూజలు నిర్వహించి అనంతరం నియోజకవర్గంలో ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అమ్మవారి సన్నిధి నుంచే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అలాగే నరేంద్ర మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించాలని కూడా అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు.

'బతుకమ్మతో సెల్ఫీ' కాంటెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో విశిష్టమైన బతుకమ్మపండుగ సందర్భంగా 'బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్' అనే వినూత్న కార్యక్రమం ప్రారంభమైంది. నగరంలోని ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం తెలంగాణలోని బాలికలు, యువతులు, మహిళల ఆనందాన్ని, సాధికారతని ప్రతిబింబిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో భాగంగా తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా, అందంగా ముస్తాబై బతుకమ్మతో పంపిన సెల్ఫీలలో ఉత్తమమైన 5 ఫోటోలను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు డా.గాధిరాజు స్రవంతి, పిడమర్తి స్నిగ్ధ తెలిపారు. సెల్ఫీలను 9491114616 నంబర్‌కు వాట్సప్ చేయాలని వారు కోరారు.





గౌరీశంకర్ నగర్ బస్తీలో..

ఒక్కేసి పువ్వేసి చందమామా..

బంజారాహిల్స్: ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్క జాములాయే చందమామా.. అంటూ మహిళలు పాదం పాదం కదుపుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడిగా సంబురాలు చేసుకున్నారు. ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు, దేవాలయాల వద్ద పెద్ద ఎత్తున నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వేడుకలను క్లబ్ అధ్యక్షుడు వైవై రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫిలింనగర్ బీజేఆర్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన వేడుకల్లో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో..



బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ క్లబ్‌లో..













ముస్లింలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: ముస్లింలకు అండగా ఉంటాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం పంజగుట్ట మార్కెట్ బస్తీలోని కమ్మర్ అలీ మజ్జిద్‌లో మిలాద్‌-ఉన్‌-నబీ సందర్భంగా ముస్లింల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన దానం నాగేందర్ ముస్లింలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణలో ముస్లింల అభివృద్ధికి ఎన్నో పథకాలు తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఎన్నికలు రాగేనే ఎవరెవరో వచ్చి ఏదో చెపుతారని ఏమీ నమ్మకుండా అభివృద్ధికే ఓటు వేయాలని సూచించారు.



ముస్లింలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

మీకు ఏ అర్ధరాత్రి ఏ కష్టం వచ్చినా నా ఇంటికి రావొచ్చునని ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మజిద్ కమిటీ అధ్యక్షుడు సోహెల్, రజాక్, అగ్సర్, అబ్రార్, మెట్టు రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అంటే పీజేఆర్..పీజేఆర్ అంటే అభివృద్ధి'



సిద్ధార్థనగర్ పార్కు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

వెంగళరావునగర్: కాంగ్రెస్ అంటే పీజేఆర్ అని పీజేఆర్ అంటేనే కేరాఫ్ అభివృద్ధి అని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ పార్కు, యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్కు తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా పార్కులకు వచ్చిన వాకర్స్‌తో కొద్దిసేపు మాట్లాడారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను కాంగ్రెస్ తరఫున పోటీ చేయబోతున్నానని, మీరంతా తనకు మద్దతును తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌కుమార్, అర్జున్, పెద్ద కృష్ణకుమార్, సురేందర్ యాదవ్, ఆలీస్, అశోక్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీ

వెంకటేశ్వరకాలనీ: గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి బినామీ కాంగ్రెస్ పార్టీ అని ఈ రెండు పార్టీలు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేందుకే కలిసికట్టుగా ప్రజాక్షేత్రంలోకి వస్తున్నాయని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజక వర్గ ప్రజలు వీరిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



నందినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహన తనిఖీలు చేస్తున్న ఖైరతాబాద్ పోలీసులు

బంజారాహిల్స్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశాయి. అడుగడుగునా పోలీసులు పికెటింగ్‌లు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని 11 పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలు ఎక్కడికక్కడ నిర్వహిస్తూ అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఖైరతాబాద్, పంజగుట్ట, బంజారాహిల్స్, సైఫాబాద్, దోమల్‌గూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన చౌరస్తాలతో పాటు అంతర్గత రహదారుల్లో నిఘా ఉంచి వాహనాలను ఆపుతూ ఈ తనిఖీలు చేపడుతున్నారు.

రాజ్‌భవన్ కమ్యూనిటీలో అవగాహన కార్యక్రమాలు



ఆటో క్యాంపెయిన్ నిర్వహిస్తున్న రూమ్ టూ రీడ్ సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో బాలికా విద్యా కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రత-నేను నా డిజిటల్ ప్రపంచం అనే అంశంపై వారం రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆటో క్యాంపెయిన్ ద్వారా పలు రకాల మాధ్యమాల ద్వారా రాజ్‌భవన్ పాఠశాలకు చెందిన కమ్యూనిటీలో ప్రజలందరికీ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ ఆటో క్యాంపెయిన్ ఎనిమిది కమ్యూనిటీల్లో నిర్వహిస్తున్నారు రూమ్ టూ రీడ్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సరిత, సీనియర్ సోషల్ మొబిలైజర్ రాధిక, మమత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నదానం

వెంగళరావునగర్: రహమత్‌నగర్ వర్తక సంఘం ఆధ్వర్యంలో శనివారం రహమత్‌నగర్ చౌరస్తా గ్రంథాలయం వద్ద అన్నదానం జరిగింది. అమావాస్యను పురస్కరించుకుని తొలుత మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరం ప్రశాంతంగా ఉండాలని, అందరూ ఐక్యంగా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండటానికి ప్రత్యేక పూజలు చేసినట్టు నేతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రహమత్‌నగర్ వర్తక సంఘం నాయకులు తాడికొండ కృష్ణమూర్తి, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బ్రహ్మానందంగుప్తా, కొవ్వూరి ప్రభు, ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జున గుప్తా తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న వర్తకసంఘం నేతలు

క్యాండిల్ ర్యాలీ



ప్రవల్లిక ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: పోటీ పరీక్ష వాయిదా పడటంతో వరంగల్‌కు చెందిన ప్రవల్లిక అనే విద్యార్థిని అశోక్‌నగర్‌లోని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం సాయంత్రం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఖైరతాబాద్ లైబ్రరి చౌరస్తా వరకు నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బంజారాహిల్స్: కుందన్‌బాగ్ బీఎస్ మక్తాలో కొలువుదీరిన తోట్ల నల్లపోచమ్మ మహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఇందులో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల్లో భాగంగా అమ్మవారు ఈనెల 15న బాలాత్రిపుర సుందరీదేవిగా, 16న గాయత్రిదేవిగా, 17న అన్నపూర్ణాదేవిగా, 18న లలితాదేవిగా, 19న గజలక్ష్మీ దేవిగా, 20న సరస్వతీ దేవిగా, 21న రాజరాజేశ్వరి దేవిగా, 22న దుర్గా దేవిగా, 23న మహిషాసుర మర్ధనీదేవిగా, తోట్ల నల్లపోచమ్మ మహాలక్ష్మి అమ్మవారి అలంకారంలో భక్తులకు దర్శన మిస్తారు. ఈనెల 17న అమ్మవారికి 51 కలశాలతో అభిషేకం, భజన, ఊరేగింపు నిర్వహిస్తారు. 23న విజయదశమి రోజున హోమం, పూర్ణాహుతి, వాహన పూజలు, శమీ పూజ, రథోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కడతల బాలకృష్ణ తెలిపారు.



తోట్ల నల్లపోచమ్మ మహాలక్ష్మి అమ్మవారు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను మధురానగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ బస్తీలో కొందరు లైసెన్స్ లేకుండా మద్యం విక్రయిస్తున్నారని మధురానగర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఎల్లారెడ్డిగూడ పరిసర ప్రాంతాల్లో విచారించారు. ఈ క్రమంలో గుట్టుచప్పుడు కాకుండా ఎల్లారెడ్డిగూడలో మూకుంట్ల బాలమణి అనే మహిళ మద్యాన్ని విక్రయిస్తోంది పోలీసులు ఆమెను పట్టుకుని విచారించగా మొత్తం 27 మద్యం బాటిల్స్ దొరికాయి. దీంతో బాలమణిని అరెస్టు చేసి ఆమె వద్ద ఉన్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. కోఠి నుంచి పఠాన్ చెరువు వెళ్తున్న బస్సు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పి ఫుట్‌పాత్ పైకి వెళ్లింది. ఆ సమయంలో బస్సులో దాదాపు 45 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తొలుత బస్సు బ్రేకులు ఫెయిల్ కావడం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు భావించారు. అయితే ఈ ఘటనపై బర్కత్‌పుర బస్సు డిపో మేనేజర్ వేణుగోపాల్ స్పందించారు. బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని స్పష్టం చేశారు. రెండో షిఫ్టులో వెంకటేష్ గౌడ్ బస్సు తీసుకెళ్లారన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు సమీపంలో బస్సు బ్రేకులు ఫెయిలైనట్లు తమకు సమాచారం అందడంతో వెంటనే మరమ్మతు బృందాన్ని అక్కడికి పంపామని అయితే బస్సు బ్రేకులు బాగానే ఉన్నాయని, ఫెయిల్ కాలేదని తాము గుర్తించినట్లు వేణుగోపాల్ స్పష్టం చేశారు. బస్సును డిపోకు తీసుకెళ్లి అన్ని పరీక్షలు చేశామన్నారు. బస్సు డ్రైవర్ తప్పిదం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకొని ఉంటుందని ఆయన తెలిపారు.


ఏటీఎం చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్



చాంద్‌పాషా

ఫిలింనగర్: ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని సెవన్ టూంబ్స్ సత్య కాలనీలో శనివారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో ఎస్‌బీఐ ఏటీఎం చోరీకి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాయదుర్గం సమీపంలోని హుస్సేన్‌షావలి ప్రాంతానికి చెందిన చాంద్‌పాషా(34) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గంజాయి, మద్యం, జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నాడు. ఏటీఎం చోరీకి యత్నించగా సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను అరెస్ట్ చేశారు గతంలో చాంద్‌పాషాపై రెండు కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ఎర్రగడ్డ మాజీ కార్పొరేటర్ షరీఫ్ మృతి



షరీఫ్ (ఫైల్)

వెంగళరావునగర్: ఎర్రగడ్డ మాజీ కార్పొరేటర్ మహ్మద్ షరీఫ్ (55) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో నాంపల్లిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య షాహీన్‌బేగం ప్రస్తుతం ఎర్రగడ్డ కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. షరీఫ్ తొలుత దివంగత సీఎల్పీ నేత పీజేఆర్‌కు అనుచరుడిగా ఉన్నారు. గతంలో ఉమ్మడి బోరబండ-ఎర్రగడ్డ డివిజన్లకు కార్పొరేటర్‌గా, ఫ్లోర్ లీడర్‌గా ఉన్నారు. అనంతరం ఎంఐఎం నాయకుడిగా తన హవాను కొనసాగించారు. షరీఫ్ మృతి పట్ల వివిధ పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నేతలు తన సంతాపాన్ని తెలియజేశారు.

ఆస్పత్రుల్లో తొలగించని ఫ్లెక్సీలు



ఎన్బీటీ నగర్‌బస్తీ దవాఖానాలో రాజకీయ నేతలు ఉన్న ఫ్లెక్సీలు

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ వచ్చి నాలుగు రోజులు పూర్తవుతున్నా ఇంకా కొన్ని శాఖల్లో అధికారులు మాత్రం మేల్కొనడం లేదు. నిత్యం ప్రజలు సందర్శించి బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజాప్రతినిధుల చిత్రాలు ఉన్న ఫ్లెక్సీలు ఇంకా కనిపిస్తుండటం అధికారుల పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానాలో, జవహర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు నియోజక వర్గంలోని పలు ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకా ఫ్లెక్సీలను తొలగించలేదు. దీంతో పలువురు రాజకీయ పార్టీల నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మహిళా పతంజలి యోగ్ సమితి మహా సమ్మేళనం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: మహిళా పతంజలి యోగ్ సమితి మహిళా మహా సమ్మేళనం వార్షిక కార్యక్రమం క్లాసిక్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యోగా టీచర్లు, యోగా సాధకులు సహా 2 వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ పూజ్య సాధ్వి దేవప్రియాజీ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. యోగా ఆవశ్యకత గురించి తెలియజేశారు. జీవితంలో అన్ని వయసుల వారికి వృద్ధులు మొదలుకొని ప్రతీ స్త్రీకి యోగా అవసరమని దీని వల్ల చురుకైన జీవితాన్ని గడపవచ్చునని తద్వారా కుటుంబంతో పాటు సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటాయన్నారు.



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు శనివారం దర్శించుకున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ..

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా శనివారం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అంగరంగ వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టం నిర్వహించారు. వైఖానస ఆగమంలో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. విత్తనాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం. సూర్యుడు అస్తమించిన తర్వాతే మంచి ముహూర్తంలో అంకురార్పణ నిర్వహిస్తారు. అంకురార్పణంలో నాటే విత్తనాలు బాగా మొలకెత్తుతాయి. విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా నిర్వహించగలుగుతారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

షాపింగ్ మాల్స్‌లో పాకిస్తాన్ జెండాలా?

ఎంపీ బండి సంజయ్



బాణాసంచా పేలుస్తున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: 'షాపింగ్‌మాల్స్ పేరుతో పాకిస్తాన్ జెండాలు తయారు చేసి పెడతారా? షాపింగ్‌మాల్స్ అడ్డా చేసుకుని లవ్ జిహాద్ పేరుతో హిందూ యువతులను మోసం చేసే కుట్రలకు పాల్పడుతుంటే ఏం చేస్తున్నారు? తక్షణమే వాటిని మూసివేయాలి.. లేదంటే ఉరికించి కొడతాం' అంటూ బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ప్రపంచకప్ టోర్నీలో భాగంగా పాకిస్తాన్ జట్టుపై భారత జట్టు శనివారం గెలిచిన నేపథ్యంలో కరీంనగర్‌లో క్రికెట్ అభిమానులు, బీజేపీ కార్యకర్తలు టవర్ సర్కిల్‌లో బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. సంజయ్ బాణాసంచా పేల్చి పలువురికి మిఠాయిలు తినిపించారు. సంజయ్ మాట్లాడుతూ 'రాష్ట్రమంతా భారతమాతాకీ జై అంటూ సంబురాలు చేసుకుంటుంటే కొందరు ఫాల్తు గాళ్లు పాకిస్తాన్ గెలవాలని కోరుకున్నారు. వాళ్లను రోడ్లపై ఉరికించి కొట్టాలి' అని అన్నారు. కాగా, ప్రవళిక మరణం కంటే పోలీసులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌తోనే ఆమె కుటుంబసభ్యులు ఎక్కువగా బాధపడుతున్నారని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల చెల్లింపు లేనట్లే!

ఎన్నికల కోడ్‌తో నిలిచిన వైనం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లింపు తాత్కాలికంగా నిలిచిపోయింది. సంస్థ గత ఆర్థిక సంవత్సరం (2022–23)లో సాధించిన లాభాల నుంచి 32 శాతం వాటా రూ.711.18 కోట్లను 16న కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని యాజమాన్యం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన ఈనెల 5వ తేదీనే వెలువడినప్పటికీ 9వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వాటాల చెల్లింపు అంశంపై శనివారం అధికారులు హైదరా బాద్‌లోని సింగరేణి భవన్‌లో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున లాభాల్లో వాటాల చెల్లింపును నిలిపివేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. కాగా, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ముగిసి కోడ్ తొలగించాకే లాభాల వాటా చెల్లింపుపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది.

మైనార్టీ అధికారులపై రేవంత్ బురదజల్లే యత్నం

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్

సాక్షి, హైదరాబాద్: మైనార్టీలకు వ్యతిరేకంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రవర్తిస్తున్నారని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ ఆరోపించారు. కులాహంకారంతో కావాలనే మైనార్టీ వర్గానికి చెందిన పోలీసు అధికారి స్టీఫెన్ రవీంద్రపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న మైనార్టీ అధికారులపై బురదజల్లేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా పనిచేస్తున్న రేవంత్ మైనార్టీ అధికారులను చూస్తే ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. స్టీఫెన్ రవీంద్రపై ఇప్పటివరకు ఎలాంటి అవినీతి మచ్చలేదని పేర్కొన్నారు. మళ్లీ ఒక్కసారి మైనార్టీ వర్గం, మైనార్టీ అధికారులపై బురద జల్లే యత్నం చేస్తే రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధిచెబుతామని హెచ్చరించారు.



టెకీల కోసం ఓటు బాట

ఐటీ హబ్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కసరత్తు ఐటీ ఉద్యోగులు ఓటు వేసేలా అవగాహన

సాక్షి, హైదరాబాద్: ఐటీ ఉద్యోగులు పోలింగ్‌కు దూరంగా ఉంటారనే అపవాదును తొలగించే దిశగా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు వారికి చేరువలో బూత్‌లను ఏర్పాటు చేస్తోంది. ఓటింగ్ రోజున సెలవు వచ్చింది కదా అని ఎంజాయ్ చేసే టెకీలను పోలింగ్ కేంద్రం వైపు రప్పించేందుకు కార్పొరేట్ సంస్థల సహాయాన్ని కూడా తీసుకుంటోంది. రాజధానిలో ఓటింగ్‌శాతం పెంచేందుకు ఈసీతోపాటు బహుళజాతి సంస్థలు కూడా రంగంలోకి దిగాయి. హైదరాబాద్‌లో ఓటు హక్కు ఉన్న వారు తమ ఓటు వినియోగించుకునేలా సంస్థలు ఉద్యోగులను ప్రేరేపిస్తున్నాయి.

హైరైజ్ భవనాల్లో పోలింగ్ స్టేషన్లు.. ఎన్నికలపై వర్క్ ఫ్రం హోమ్ ప్రభావం

ఆఫీసుల్లో కియోస్క్‌లు

ఇప్పటికీ పలు కంపెనీలు వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను అవలంబిస్తున్నాయి. ఈ విధానాలు ఐటీ హబ్ నియోజకవర్గాల్లో ఎన్నికలపై కొంతమేర ప్రభావాన్ని చూపించవచ్చు. ఇంటి నుంచి పనిచేస్తున్న వారు ఓటు హక్కును వినియోగించుకోవడం కష్టమేనని ఓ ఐటీ కంపెనీ ప్రతినిధి అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ఉద్యోగులకు సహాయం చేయడానికి త్వరలోనే ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టనున్నట్లు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఐటీ కారిడార్‌లోని వివిధ కార్యాలయాల్లో కియోస్క్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐటీ హబ్‌లో పెరిగిన ఓటర్లు..

ఐటీ కేంద్రాలైన మణికొండ, నానక్‌రాంగూడ, నార్సింగి, ఉప్పల్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మియాపూర్ వంటి ప్రాంతాలు శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. ఈ ప్రాంతాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు సంస్థలు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. ఈ ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపితే.. ఆ పార్టీ విజయతీరాలకు చేరుతుంది. ఈ నేపథ్యంలో టెకీలను పోలింగ్ స్టేషన్లకు రప్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నాయి. వారిని పోలింగ్ కేంద్రానికి రప్పించేలా ఏర్పాటు చేస్తున్నాయి.

1,500 గ్రేటర్ హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు

9,05,000 ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగులు..

2,000కు పైగా రాష్ట్రంలో ఉండే స్టార్టప్ కంపెనీలు



ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ అంటే మినీ ఇండియా. తెలుగు రాష్ట్రాల నుంచే కాదు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఇక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారిలో చాలామందికి స్వస్థలాల్లోనే ఓటు హక్కు ఉంటుంది. ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే ఉద్యోగులు స్థానికంగా ఓటు హక్కును నమోదు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలూ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాయి. కనీసం మూడు నెలలపాటు ఇక్కడ పనిచేసే ఉద్యోగులు కచ్చితంగా ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాయి. ఆ తర్వాత బదిలీపై వెళితే ఓటును సంబంధిత నియోజకవర్గానికి మార్పు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఓటరు కార్డులో చిరునామాలను అప్‌గ్రేడ్ చేయడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు సాయం అందిస్తున్నాయి.

హైరైజ్ భవనాల్లో పోలింగ్ స్టేషన్లు..

➤ 'లెట్స్ ఓట్' అనే స్వచ్ఛంద సంస్థ గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలు, విద్యా సంస్థలతోపాటు ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రాం వంటి సామాజిక మాధ్యమాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఓటర్ హెల్ప్‌లైన్, సీవిజిల్ వంటి మొబైల్ యాప్‌లపై ప్రచారం చేస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ పెరగకపోయినా.. దీర్ఘకాలంలో ఇది ప్రయోజనాన్ని చేకూరుస్తుందని ఓ ప్రతినిధి చెప్పారు. మరోవైపు, ఎన్నికల సంఘం గ్రూప్ హౌసింగ్ సొసైటీలు, కమ్యూనిటీ సెంటర్లు, హైరైజ్ భవనాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే అంశంపై కసరత్తు చేస్తోంది.

అంచనా ఓకే..

- పోలవరం తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.38 కోట్లకు సీడబ్ల్యూసీ ఆమోదం
- ఫలిస్తున్న ఏపీ సీఎం జగన్ కృషి



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు విషయంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్న చొరవ.. చేస్తున్న కృషి సత్ఫలితాలిస్తోంది. గత టీడీపీ హయాంలో జరిగిన తప్పిదాలను.. కమీషన్ల వేటలో నాటి సీఎం చంద్రబాబు ప్రాజెక్టు నిర్మాణంలో అవలంబించిన అస్తవ్యస్త విధానాలను ఒక్కొక్కటి సరిదిద్దుతూ ప్రస్తుత ప్రభుత్వం చూపి స్తున్న శ్రద్ధపట్ల సాగునీటి రంగ నిపుణులు సైతం ప్రశంసిస్తున్నారు. ఎందుకంటే.. ఈ ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయాన్ని రూ.31,625.38 కోట్లుగా కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా తేల్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా ఆమోదించి దాన్ని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి శుక్రవారం రాత్రి పంపారు. ఈ ప్రతిపాదనను లాంఛనంగా ఆమోదించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్‌కు ఆమె పంపనున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించాక దానిని కేంద్ర కేబినెట్‌కు నివేదిస్తారు. అంతకుముందు.. తాజా ధరలను పరిగణలోకి తీసుకుని పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయడానికి నిధులిచ్చి సహకరించాలని సీఎం వైఎస్ జగన్ చేసిన విజ్ఞప్తికి ప్రధాని నరేంద్ర మోదీ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో.. సవరించిన అంచనాలకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం దాదాపు ఖాయం. దీంతో పోలవరానికి నిధుల సమస్య తీరడంతోపాటు ప్రాజెక్టు సత్వర పూర్తికి మార్గం సుగమం అవుతుంది. కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేసిన పాపాలను ప్రక్షాళన చేస్తూ పోలవరాన్ని పూర్తిచేయడానికి సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారనడానికి ఇది మరో నిదర్శనమని అధికార వర్గాలు కొనియాడుతున్నాయి. కేంద్ర జల్‌శక్తి శాఖ మార్గదర్శకాల మేరకు తొలిదశ పనులు పూర్తయ్యాక రెండో దశ పనుల సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం సీడబ్ల్యూసీకి పంపుతుంది.

రూ.15,505.81 కోట్ల పనులు మిగులు..

పోలవరం ప్రాజెక్టు తొలిదశలో ఇప్పటికే పూర్తయిన పనులకు చేసిన వ్యయం.. కాంట్రాక్టర్లకు అప్పగించిన పనుల్లో మిగిలిన పనుల వ్యయం.. చంద్రబాబు నిర్వాకంవల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పునర్నిర్మాణం వంటి అదనంగా చేపట్టాల్సిన పనులు.. లైడార్ సర్వేలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోకి వచ్చే 36 గ్రామాల ప్రజలకు పునరావా సంకల్పించడానికి అయ్యే వ్యయాలను పరిగణనలోకి తీసు కుని సవరించిన అంచనా వ్యయాన్ని సీడబ్ల్యూసీ ఆమోదించింది. దీని ప్రకారం.. పోలవరం ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.31,625.38 కోట్లు. ఇందులో రూ.16,119.57 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రూ.15,505.81 కోట్ల పనులు మిగిలాయి. కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తే నిధుల సమస్య పరిష్కారమవుతుంది.

బాగుగానే బాబు ఆరోగ్యం

- 67 కిలోల బరువు ఉన్నారు
- జీజీహెచ్ నుంచి ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటు చేశాం
- జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉందని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ స్పష్టం చేశారు. ఆయన వైద్య పరీక్షలకు ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. చంద్రబాబు ఆరోగ్యంపై ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలపై జీజీహెచ్ వైద్య బృందం, జిల్లా ఎస్పీ పి.జగదీష్‌లతో డీఐజీ శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రబాబు 67 కిలోల బరువు ఉన్నారన్నారు. ఆయనకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఎటువంటి మార్పు లేదని తెలిపారు. జీజీహెచ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్కండేయులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డెర్మటాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతాదేవి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అనస్థీషియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేంద్ర, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. హిమజ బృందం చంద్రబాబు ఆరోగ్యాన్ని పూర్తిగా పరిశీలించిందని వెల్లడించారు.

స్టెరాయిడ్స్ ఇవ్వడం లేదు..


ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ.. చంద్రబాబు ఆరోగ్యానికి సంబంధించి అన్నీ బాగున్నాయని చెప్పారు. తమతో ఆయన బాగా మాట్లాడారన్నారు. అన్ని విషయాలు అడిగామన్నారు. షుగర్ కూడా బాగానే ఉందని తెలిపారు. చంద్రబాబు వాడుతున్న మందులను కూడా పరిశీలించామన్నారు. శరీరంపై దద్దుర్లు ఉన్నాయని.. వాటికి ఆయన వాడుతున్న మందులతో పాటు తాము కొన్ని రకాల మందులు ఇచ్చామని వివరించారు. స్టెరాయిడ్స్ ఇస్తున్నారన్న మాట పూర్తిగా అసత్యమన్నారు. శరీరంపై ఉన్న దద్దుర్ల దృష్ట్యా చల్లని వాతావరణంలో ఆయన ఉండాలని చెప్పారు. జీజీహెచ్‌లో చంద్రబాబుకు వైద్య పరీక్షల నిమిత్తం ప్రత్యేక గది ఏర్పాటు చేయలేదన్నారు. నిత్యం జీజీహెచ్‌లో ఒక ప్రత్యేక గది ఉంటుందని స్పష్టం చేశారు. వైద్య బృందం ఇచ్చిన నివేదికను కోర్టుకు అందజేస్తామన్నారు, కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. జైలు లోపల 85 ఏళ్ల వృద్ధ ఖైదీ కూడా ఉన్నారన్నారు. జైలు లోపల ఉన్న అందరినీ జాగ్రత్తగా చూస్తామని చెప్పారు. చంద్రబాబు ప్రత్యేక ఖైదీ అయినందున మరింత శ్రద్ధ తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. జైలులో జరుగుతున్న ప్రతి విషయాన్ని కోర్టుకు నివేదిస్తున్నామని వివరించారు.

రిపోర్టును బయట ఎవరికీ ఇవ్వలేదు..

చంద్రబాబుకు నిర్వహించిన వైద్య పరీక్షల రిపోర్టును జీజీహెచ్ వైద్య బృందం తమకు అందించిందని డీఐజీ రవికిరణ్ చెప్పారు. ఆ రిపోర్టును తాము బయట ఎవరికీ ఇవ్వలేదన్నారు. చంద్రబాబు తరఫున వచ్చిన లాయర్లు ఇవ్వాలని అడిగితే ఆయన అనుమతి తీసుకుని, సంతకం చేయించుకుని రిపోర్టును లాయర్లకు అందజేశామని తెలిపారు. అందులో ఒక లైనును జైలు అధికారులు బ్లాక్ మార్కర్‌తో కనిపించకుండా చేశారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఆ లెటర్‌పై బ్లాక్ మార్కు చేసి ఎవరు వైరల్ చేస్తున్నారో తమకు తెలియదని చెప్పారు. కాగా తమ పట్ల డీఐజీ దురుసుగా ప్రవర్తించారని లోకేశ్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ములాఖత్ సమయం ముగిసిందని.. నిబంధనల ప్రకారం మీరు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని మాత్రమే చెప్పానన్నారు.

ఉద్రిక్తత నడుమ ప్రవల్లిక అంత్యక్రియలు

బిక్కాజిపల్లిలో పోలీసుల భారీ బందోబస్తు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సాక్షి వరంగల్/చిక్కడపల్లి/దుగ్గొండి: గ్రూప్–2 పరీక్షలు వాయిదా పడడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డ వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజిపల్లికి చెందిన మర్రి ప్రవల్లిక అంత్యక్రియలు స్వగ్రామంలో ఉద్రిక్తతల నడుమ ముగిశాయి. హైదరాబాద్ నుంచి పోలీసు ఎస్కార్ట్‌తో మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంది. తండ్రి లింగయ్య, తల్లి విజయ, సోదరుడు ప్రణయ్ గుండెలవిసేలా రోదించారు. ప్రవల్లికకు ఇంకా పెళ్లికాకపోవడంతో హిందూ సంప్రదాయం ప్రకారం మొదట జిల్లేడుచెట్టుతో పెళ్లి జరిపించారు. అంతిమయాత్రలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ప్రవల్లిక అంత్యక్రియల నేపథ్యంలో శుక్రవారం రాత్రి నుంచే పోలీసులు బిక్కాజిపల్లిలో మోహరించి, భారీ బందోబస్తు చేపట్టారు.

ఎక్కడికక్కడ అరెస్టులు

ప్రవల్లిక మృతదేహాన్ని వివిధ విద్యార్థి సంఘాల నేతలు సందర్శించి నివాళులర్పించారు. మృతదేహం వద్దకు వచ్చేందుకు ప్రయత్నించిన బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. బిక్కాజిపల్లికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశా రు. ప్రవల్లిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గిర్నిబావిలో కాంగ్రెస్, బీఎస్ పీ, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.

పోలీసులపై రాళ్లు... లాఠీచార్జి

అంతకుముందు హైదరాబాద్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి దాటాక ప్రవల్లిక మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేసారు. విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ప్రవల్లిక మృతదేహాన్ని తరలించకుండా ఆందోళనకు దిగారు. ఓయూ జేఏసీ నేతలు, బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ప్రవల్లిక సూసైడ్‌నోట్ చూపించాలని డిమాండ్ చేశారు. అయితే పోలీసులు బలగాలను రప్పించి మృతదేహాన్ని తరలిస్తుండగా నిరసనకారులు అడ్డుకుని రాళ్లు రువ్వారు. పోలీసులు స్వల్పలాఠీచార్జీ చేసి ఆందోళనకారులకు చెదరగొట్టి మృతదేహాన్ని తరలించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగిన లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు.

ఉద్యోగం సంపాదించాకే పెళ్లి చేసుకుంటానంది..

ప్రవల్లిక పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ఉద్యోగం సంపాదించాకనే పెళ్లి చేసుకుంటానంది. ఉద్యోగం వచ్చే వరకు కోచింగ్ తీసుకుంటాననేది. పరీక్షలు వాయిదాపడటంతో మళ్లీ ఎప్పుడు పెడతారో తెలియదని, పరీక్ష కోసం సిద్ధమయ్యాయని, ఆలస్యమైతే పరీక్ష సరిగ్గా రాయలేనని ఇటీవల తరచూ ఫోన్‌లో అనేది. మా కూతురు దేవత, ఎలాంటి తప్పు చేసే మనిషి కా దు. ఉద్యోగం రాకున్నా మంచిదే బిడ్డా.. ఇంటి కాడనే ఉండూ అంటే వినకుండా వెళ్లి కడుపుకోత మిగిల్చింది.

– మర్రి లింగయ్య, విజయ (ప్రవల్లిక తల్లిదండ్రులు)

న్యూ బోర్న్ బేబీనే కాదు.. న్యూ బోర్న్ స్టేట్‌నూ హ్యాండిల్ చేయగలను!

- నేను గైనకాలజిస్టును 'ట్విన్స్'ను మేనేజ్ చేసినట్లే 'ట్విన్ స్టేట్స్'ను మేనేజ్ చేయడమూ తెలుసు
- గవర్నర్ తమిళిసై వ్యాఖ్య
- యూరో గైనకాలజీ సదస్సులో ప్రసంగం



రాంగోపాల్‌పేట్: గైనకాలజిస్టులకు చిన్న పిల్లలను ఎలా హ్యాండిల్ చేయాలో బాగా తెలుసని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఒక డాక్టర్‌ను గవర్నర్‌గా నియమిస్తే ఎలా హ్యాండిల్ చేస్తారని చాలామంది అన్నారని... 'న్యూ బోర్న్ బేబీ'ని హ్యాండిల్ చేసినట్లుగానే 'న్యూ బోర్న్ స్టేట్'ను చేస్తానని తాను చెప్పినట్లు పేర్కొన్నారు. పుదుచ్చేరి గవర్నర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చే సమయంలో కొంతమంది రెండు రాష్ట్రాలు ఎలా మేనేజ్ చేయగలుగుతారని అన్నారని.. గైనకాలజిస్టు 'ట్విన్స్ (కవలలు)'ను మేనేజ్ చేసినట్లే 'ట్విన్ స్టేట్స్'ను మేనేజ్ చేయడం తనకు తెలుసని అన్నట్లు గుర్తుచేసుకున్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి, యూపీఏఐ సంయుక్తంగా కిమ్స్ ప్రాంగణంలో యూరో గైనకాలజీ రంగంలో వస్తున్న అత్యాధునిక చికిత్సా పద్ధతులపై నిర్వహించిన సదస్సులో గవర్నర్ మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు యూరో గైనకాలజీపై అవగాహన స్థాయి మారుతుందని, అందువల్ల గ్రామీణ ప్రజలకు ఈ సమస్యల గురించి అవగాహన పెంచాలని సూచించారు. యూరో గైనకాలజీ అనేది సరికొత్త స్పెషాలిటీ అని, పెద్ద వయసు మహిళల్లో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. ఇలాంటి స్పెషాలిటీ సేవలు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అక్టోబర్ రొమ్ము కేన్సర్ అవగాహన మాసమని, ఈ అంశంపై కిమ్స్ ఆస్పత్రి గ్రామీణ ప్రాంతాల్లోనూ అవ గాహన పెంపొందించేందుకు అద్భుతంగా పనిచే స్తోందని కితాబునిచ్చారు. కిమ్స్ యూరో గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అనురాధ కోడూరి మాట్లాడుతూ.. మహిళల్లో చాలామంది మూత్రం ఆపుకోలేకపోవడం, కడుపు కిందిభాగంలో నొప్పి, కొన్ని అంతర్గత అవయవాలు కిందికి జారిపోవడం లాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇలాంటి సమ స్యలు చెప్పుకోవడానికి మహి ళలు వైద్యుల దగ్గరకు వెళ్లలేక, మొహమాట పడుతుంటారని, దీంతో అవి తీవ్రమవుతాయని పేర్కొన్నారు. యూరో గైనకాల జీలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఇలాంటి సదస్సులతో అవగాహన పెరుగుతుందని వెల్లడించారు. ఈ సదస్సులో దేశ విదేశీ గైనకాలజిస్టులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్ రావు, సదస్సు చైర్ పర్సన్లు డాక్టర్ బాలాంబ, డాక్టర్ సీనా దేశాయ్, ప్రొఫెసర్ పీటర్ ఎస్ రోసెన్‌బ్లాట్, హోలి ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.



హైటెక్స్‌లో భారీ తెర. రికార్డ్ పత్రాన్ని అందుకుంటున్న సినీ నటి శ్రేయ

బాహుబలి తెరకు 'ప్రపంచ' రికార్డు

హైటెక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌ల వీక్షణానికి భారీ తెర

మాదాపూర్ (హైదరాబాద్): ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్‌లను అభిమానులు వీక్షించేందుకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన భారీ తెర వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. హైటెక్స్ బయట 80 అడుగుల వెడల్పు, 36 అడుగుల ఎత్తు భారీ తెరను, హైటెక్స్‌లోని హాల్‌– 2లో 64 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తు తెరను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నటి శ్రేయశరణ్ తెరను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంధ క్రికెటర్లకు బ్యాట్లు, బంతులు అందజేశారు. కార్యక్రమంలో పెర్నోడ్ రికార్డ్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ, ఏపీ రీజియన్ హెడ్ అనంత్‌స్వరూప్, మార్కెటింగ్ హెడ్ నవనీత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కారు' ఎక్కనున్న టీఎన్జీఓ అధ్యక్షుడు రాజేందర్!

- రేపు ప్రభుత్వ ఉద్యోగానికి, సంఘం పదవికి రాజీనామా
- త్వరలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- సంగారెడ్డి నియోజకవర్గ ప్రచార, సమన్వయ బాధ్యతలు?



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణ ఎన్జీఓస్ యూనియన్ (టీఎన్జీఓ) రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్ త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజేందర్ సోమవారం తన ఉద్యోగంతోపాటు, యూనియన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయనున్నారు. రాజీనామా ఆమోదం పొందిన వెంటనే ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగే ఏదో ఒక బహిరంగ సభ వేదిక ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరతారు. గతంలో మెదక్ జిల్లా టీఎన్జీఓ యూనియన్ అధ్యక్షుడిగా రాజేందర్ పనిచేయడంతోపాటు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. ఇటీవల కేసీఆర్‌తో జరిగిన భేటీ సందర్భంగా రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరిక అంశం ప్రస్తావనకు రాగా గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కూడా రాజేందర్ రాజకీయ అరంగేట్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది.

ముదిరాజ్ కమ్యూనిటీని ప్రోత్సహించేందుకే?

తమ సామాజిక వర్గానికి ఒక్క అసెంబ్లీ టికెట్ కూడా ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఇటీవలి కాలంలో ముదిరాజ్ కమ్యూనిటీ పలు సభలు, సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో అదే కమ్యూనిటీకి చెందిన మామిండ్ల రాజేందర్ బీఆర్ఎస్‌లో చేరుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ ఎస్‌లో చేరుతున్న రాజేందర్‌కు సంగారెడ్డి నియోజకవర్గంలో సమన్వయ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి రాజేందర్ బాల్య మిత్రుడు కావడంతో సంగారెడ్డి రాజకీయాలు ఆసక్తికరంగా మారనున్నాయి. ఇదిలాఉంటే పార్టీలో చేరుతున్న రాజేందర్‌కు ఎమ్మెల్సీ లేదా ఇతర గౌరవప్రదమైన పదవి ఇస్తామనే హామీ బీఆర్ఎస్ నుంచి లభించినట్లు సమాచారం.

మాజీ అధ్యక్షుల బాటలోనే..

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో టీఎన్జీఓ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన స్వామిగౌడ్, దేవీ ప్రసాద్ రావుకు బీఆర్ఎస్‌లో కీలక పదవులు దక్కిన విషయం తెలిసిందే. స్వామిగౌడ్ ఎమ్మెల్సీగా, శాసన మండలి ఛైర్మన్‌గా పనిచేయగా, దేవీ ప్రసాదరావు బ్రూవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నామినేట్ అయ్యారు. ఆ తర్వాత యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసిన కారెం రవీందర్‌రెడ్డి ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజేందర్ చేరిక నిర్ణయం ఆసక్తికరంగా మారింది.

బాబుకు టవర్ ఏసీ ఏర్పాటు చేయండి

ఏసీబీ కోర్టు ఆదేశం..

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబుకు టవర్ ఏసీ సదుపాయం కల్పించాలని జైలు అధికారులను ఏసీబీ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు బాబు ఉంటున్న బ్యారెక్‌లో చల్లదనం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించింది. అందులో భాగంగా ఆయన గదిలో టవర్ ఏసీ ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేసింది. వాతావరణం కారణంగా బ్యారెక్‌లో ఉక్కపోతగా ఉండటంతో ఇప్పటికే తనకున్న చర్మ సమస్యల కారణంగా చంద్రబాబు ఇబ్బంది పడుతున్నారు. అయితే జైలులో ఏసీ ఏర్పాటు చేసేందుకు జైలు నిబంధనలు అనుమతించకపోవడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. వైద్యుల సూచనల మేరకు తన బ్యారెక్‌లో చల్లదనం ఉండేలా ఏర్పాటు చేయాలని జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ శనివారం రాత్రి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏసీబీ కోర్టు ఆన్‌లైన్‌లో విచారణ జరిపి, ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

పురందేశ్వరి 'సిండికేట్' రాజకీయం

- ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులు
- ఆదాయం కోల్పోయిన మద్యం సిండికేట్లు
- సిండికేట్ల కోసం రంగంలోకి ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు
- రాష్ట్ర ప్రభుత్వంపై కొన్నాళ్లుగా దుష్ప్రచారం
- చంద్రబాబు అరెస్టు తర్వాత ఈ బాధ్యతలు నెత్తికెత్తుకున్న పురందేశ్వరి

ఏపీ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



మహాలక్ష్మి మహా ఘనత

'శ్రీ' సినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం అయిన తమన్నా భాటియా ఆ తరువాత ఎన్నో హిట్ చిత్రాల్లో నటించింది. 'మిల్కీ బ్యూటీ'గా పేరు గాంచింది. '100 పర్సంట్ లవ్' సినిమాలో వీర వెంకట సత్య సాయి నాగ దుర్గ శేష అవతార సీతా మహాలక్ష్మి' పాత్రతో ఫస్ట్ క్లాస్ మార్కులు కొట్టేసింది.

తాజాగా మన మహాలక్ష్మి సరికొత్త రికార్డ్ సృష్టించింది.

జపాన్‌కు చెందిన ప్రసిద్ధ బ్యూటీ అండ్ కాస్మెటిక్స్ మల్టీ నేషనల్ కంపెనీ 'షిసైడో'కు ఫస్ట్ ఇండియన్ బ్రాండ్ అంబాసిడర్‌గా అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకుంది. ఈ ఘనత గురించి తమన్నాను ఆకాశానికి ఎత్తుతూ ఆమె అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నారు. 'అందంతో పాటు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది తమన్నా. ఆమె విజయపరంపరకు ఇదే ప్రధాన కారణం అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కదా.



చూపున్న పాట

'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లు వస్తాయి' అన్నాడు కవి. పట్టలేని ఆనందంలో, ప్రశంసించడానికి మాటలు దొరకని పరిస్థితుల్లో కూడా కన్నీళ్లు వస్తాయి.

మేనుక పొదెల్ పుట్టు అంధురాలు. మంచి గాయకురాలు. ఇండియన్ ఐడల్ 14 సీజన్‌లో 'లగాన్' సినిమాలో లతా మంగేష్కర్ పాడిన 'ఓ పాలన్ హారే' పాట పాడింది. అద్భుతమైన ఆమె పాట వింటూ జడ్జీలలో ఒకరైన శ్రేయా ఘోషల్ ఏడ్చేసింది. ఈ ఎపిసోడ్ ఇంటర్నెట్‌లో వైరల్ అయింది. వైరల్ కావడం మాట ఎలా ఉన్నా 'శ్రేయ ఓవర్‌గా రియాక్ట్ అయ్యారు' అని కొందరు విమర్శించారు.

మరి ఆమె అభిమానులు ఊరుకుంటారా? వాళ్లు ఇలా స్పందించారు...

'రెండు దశాబ్దాలకు పైగా శ్రేయ మ్యూజిక్ ఇండస్ట్రీలో ఉన్నారు. ఎన్నో జాతీయ అవార్డ్‌లు అందుకున్నారు. ఆమెకు ప్రతిభ లేకపోతే ఇలా వచ్చి అలా వెళ్లిపోయేవారు. ఇలాంటి టాలెంటెడ్ సింగర్ గురించి నెగెటివ్ కామెంట్స్ పెట్టడం తగదు'.



ప్లాస్టిక్ బాటిళ్లే స్కూల్ ఫీజులు

అస్సాంలోని పామోహి ప్రాంతంలో ఉన్న 'అక్షర్ స్కూల్' ప్రత్యేకత ఏమిటంటే ఈ స్కూల్లో ఫీజులకు బదులు ప్లాస్టిక్ బాటిల్స్ తీసుకుంటారు. పరిమిత శర్మ, మజిన్ ముఖ్తార్ అనే దంపతులు ఈ స్కూల్‌ను స్థాపించారు. ఫీజుల రూపంలో వచ్చిన బాటిల్స్‌ను వివిధ రూపాల్లో పునర్వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్‌ను ఎలా రీసైకిల్ చేయాలో విద్యార్థులకు నేర్పుతున్నారు. నాగాలాండ్ ఉన్నత విద్యాశాఖ మంత్రి టిమ్‌జెన్ ఈ స్కూల్ గురించి ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియో వైరల్ అయింది. 'గుడ్ ఐడియా' అంటూ నెటిజనులు ప్రశంసలు కురిపించారు.





అమ్మను స్కూటర్‌లో కూచోబెట్టి తిప్పేవాళ్లున్నారు.
కార్లలో తిప్పేవాళ్లున్నారు.
కాని విమానంలో తిప్పేవాళ్లు...
అదీ విమానం నడుపుతూ తిప్పేవాళ్లు కొంచెం అరుదు.
ఈ తల్లికి తన కుమారుడే తను ప్రయాణిస్తున్న ఫ్లయిట్‌కి పైలెట్ అని తెలియదు.
కాని తెలిసి గొప్పగా ఆనందించింది.
మురిసిపోయింది.
నెటిజన్లు బోలెడు ముచ్చటపడ్డారు

కొడుకు 'ఎత్తు'కు ఎగిరినప్పుడు



అది ఇండిగో విమానం. కొచ్చి నుంచి బయలుదేరబోతోంది. ఒకామె అదే ఫ్లయిట్‌లో చాలా క్యాజువల్‌గా ఎక్కింది. ఇంతలో 'అమ్మా' అనే పిలుపు. తిరిగి చూస్తే కాక్‌పిట్ నుంచి బయటికొచ్చి నిలబడిన పైలెట్. 'హర్ని.. నువ్వేనా' అని ఆమె సంబరంగా నోరు తెరిచేసింది. ఎందుకంటే ఆ పైలెట్ ఆమె కొడుకే. అతని పేరు విమల్ శశిధరన్. తను ప్రయాణించే ఫ్లయిట్‌కి కొడుకే పైలెట్ అని తెలిసిన తల్లి సంతోషంగా కొడుకును హగ్ చేసుకుంది. ఆ స్వీట్ సర్‌ప్రయిజ్‌కి మురిసిపోయింది.

కొచ్చికి చెందిన విమల్ శశిధరన్ ఇదంతా వీడియో తీయించి ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. 'ఇలాంటి క్షణాలే జీవితాన్ని అత్యద్భుతం చేస్తాయి' అని కామెంట్ చేశాడు. ఆ వీడియోలో కన్నకొడుకు ఉన్నతి చూసి గర్వపడే తల్లిని, తల్లిని ఆనందపరిచే కొడుకును చూసి నెట్‌లోకం పులకించింది. కామెంట్లు, లైక్‌లు మామూలే. 'మీ అమ్మ వయసులో చిన్నదిగా కనిపిస్తోంది. పిల్లలు బాగా చూసుకుంటే తల్లిదండ్రుల వయసు తగ్గుతుంది' అని ఒకరు రాస్తే 'ఆ అమ్మ నవ్వు ఎంత బాగుంది' అని మరొకరు రాశారు. ఏమైనా అమ్మను విమానంలో కూచోబెట్టి తానే నడిపి తిప్పే అదృష్టం ఎంతమందికొస్తుంది చెప్పండి.

వైరల్



సినిమాల అట్ల... సూరత్‌ల ఇట్ల

అమెరికన్ సైన్స్ ఫిక్షన్, యాక్షన్, కామెడీ ఫిల్మ్ 'మెన్ ఇన్ బ్లాక్'లో ఏజెంట్స్ కె అండ్ జె ఉపయోగించే గైరోసైకిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'అంత కాకపోయినా నా లెవెల్లో నేను' అన్నట్లుగా గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఒక వ్యక్తి గైరోసైకిల్‌ను పోలిన సెల్ఫ్–మేడ్ వాహనంతో రోడ్ల మీద చక్కర్లు కొడుతున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్‌గా మారింది.

'కాక ఈజ్ టైమ్ ట్రావెలర్ ఫ్రమ్ ఫ్యూచర్' అని ఒకరు ప్రశంసాపూర్వకంగా కామెంట్ పెడితే, 'వర్షం పడినప్పుడు రోడ్డు మీది బురద నెత్తి మీద పడడం ఖాయం' అని మరొకరు వెక్కిరించారు.

వినోద్ ఖన్నా ఆ రోజు అలా ఎందుకు మాయం అయ్యాడు?!

78 సంవత్సరాల వయసులో ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగు పెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది ప్రసిద్ధ బాలీవుడ్ నటి సైరాభాను. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సందర్భానుసారంగా తన జ్ఞాపకాలను సినిమా ప్రేమికులతో పంచుకుంటోంది. తాజాగా వినోద్ ఖన్నా గురించి కొన్ని జ్ఞాపకాలను రాసింది. వాటిలో నుంచి రెండు... 'ఆరోప్ సినిమాలోని సీన్ కోసం నేను, వినోద్, జానీవాకర్ భయ్యా రిహార్సల్స్ చేస్తున్నాం, సాహెబ్(దిలిప్ కుమార్) స్టూడియోలోకి అడుగు పెట్టే సమయానికి వినోద్ మాయమయ్యాడు. సాహెబ్ వెళ్లిన తరువాతగానీ రాలేదు. ఇప్పటి వరకు ఎక్కడ ఉన్నావు? అని అడిగితే... ది మాస్టర్ ఆఫ్ యాక్టింగ్ ముందు నేను నటించగలనా? వణుకు రావడం ఖాయం. అందుకే మాయమయ్యాను అని చెప్పాడు వినోద్'. 'కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు వినోద్ ఓషో శిష్యుడిగా మారి తన అభిమానులను, ఇండస్ట్రీని షాక్‌కు గురి చేశాడు. నీకు అద్భుతమైన భవిష్యత్ ఉంది. దయచేసి సినిమాలకు విరామం ఇవ్వవద్దు. అక్కడికి వెళ్లవద్దు అని ఎన్నోసార్లు చెప్పాను'



సినిమా

ఆస్కార్ రేసులో...



● అక్షయ్ కుమార్

ఆస్కార్ రేసులో హిందీ చిత్రం 'మిషన్ రాణిగంజ్'ను ప్రవేశపెట్టారు. టినూ సురేష్ దేశాయ్ దర్శకత్వంలో అక్షయ్ కుమార్, పరిణీతీ చోప్రా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిషన్ రాణిగంజ్'. ఈ నెల 6న విడుదలైన ఈ సినిమా వసూళ్ల పరంగా చెప్పుకోదగ్గ విధంగా లేనప్పటికీ మేకింగ్ పరంగా మెప్పించింది. పశ్చిమ బెంగాల్‌లోని ఓ బొగ్గు గనిలో వరదలు సంభవించినప్పుడు జస్వంత్ సింగ్ గిల్ అనే ఇంజనీర్ 65 మంది కార్మికులను ఏ విధంగా రక్షించాడు? అన్నదే ఈ చిత్రకథ. జస్వంత్ సింగ్ గిల్‌గా అక్షయ్ కుమార్ నటించారు. ఇక 96వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి జనరల్ కేటగిరీలో ఇండిపెండెంట్‌గా ఆస్కార్ నామినేషన్ కోసం ఈ చిత్రం యూనిట్ దరఖాస్తు చేసిందని బాలీవుడ్ టాక్. ఇదే తరహాలో 'ఆర్ఆర్ఆర్' చిత్రం కూడా ఆస్కార్ రేసులో నిలిచి, బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు గెలుచుకుంది. మరి.. 'మిషన్ రాణిగంజ్'కు ఆస్కార్ నామినేషన్ దక్కుతుందా? నామినేషన్ దక్కించుకుంటే.. 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్‌ని తీసుకువచ్చినట్లే ఈసారి ఈ సినిమా తెస్తుందా? అనేది 2024 మార్చిలో తెలిసిపోతుంది. మార్చి 10న ఆస్కార్ అవార్డుల ప్రదానం జరగనుంది. మరోవైపు ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం మలయాళ చిత్రం '2018' పోటీలో ఉన్న విషయం తెలిసిందే.

పొలిమేర 3 ఉంటుంది

- నిర్మాత 'బన్నీ' వాసు


● కార్తికేయ, 'సత్యం' రాజేశ్, హరీష్ శంకర్, 'బన్నీ' వాసు

'సత్యం' రాజేశ్, డా. కామాక్షీ భాస్కర్ల, 'గెటప్' శ్రీను, రాకేందు మౌళి, బాలాదిత్య ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరు గణబాబు సమర్పణలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ హక్కులను పంపిణీదారుడు వంశీ నందిపాటి సొంతం చేసుకున్నారు. ఈ చిత్రం నవంబరు 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన వేడుకకు అతిథులుగా హాజరైన దర్శకుడు హరీష్ శంకర్, హీరో కార్తికేయ, నిర్మాత 'బన్నీ' వాసు ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. కార్తికేయ మాట్లాడుతూ– ''ఈ తరహా సినిమాలను థియేటర్స్‌లో చూస్తే ఆడియన్స్ కొత్త అనుభూతికి లోనవుతారు'' అన్నారు. ''పొలిమేర 1' మాదిరి 'పొలిమేర 2' కూడా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు హరీష్ శంకర్. ''ఫస్ట్ పార్ట్ చూడనివారికి కూడా 'పొలిమేర 2' స్క్రీన్‌ప్లే అర్థం అవుతుంది. 'పొలిమేర 3' కూడా ఉంటుంది'' అన్నారు 'బన్నీ' వాసు. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు వంశీ నందిపాటి. ''పొలిమేర'కు మించి 'పొలిమేర 2' ఉంటుంది. సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు 'సత్యం' రాజేశ్, గౌరీకృష్ణ, అనిల్ విశ్వనాథ్.


● గౌతమి, రాజేంద్ర ప్రసాద్

నా కెరీర్‌లో స్పెషల్ ఫిల్మ్ ఇది

- రాజేంద్ర ప్రసాద్

రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రధారులుగా రాజ్ మదిరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం '#కృష్ణారామా'. వెంకట కిరణ్, కుమార్ కళ్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా టీజర్ రిలీజ్ వేడుకలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''సోషల్ మీడియా నేపథ్యంలో ఓ రిటైర్డ్ ఓల్డ్ పెయిర్ కోణంలో సాగే చిత్రం ఇది. అన్ని తరాల ప్రేక్షకులకు తగ్గట్లుగా నటించే అవకాశాలు నాకు వస్తుండటం నా అదృష్టం. ఈ తరానికి చెందిన కథ ఇది. నా కెరీర్‌లో స్పెషల్ ఫిల్మ్'' అన్నారు. ''మోడ్రన్ సబ్జెక్ట్‌తో రూపొందిన చిత్రం ఇది'' అన్నారు గౌతమి. 'ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు రాజ్ మదిరాజు.



● సోమ సుందరం, మెహరీన్, విక్రాంత్, హేషమ్

నా మూడేళ్ల కల స్పార్క్

- విక్రాంత్

విక్రాంత్ హీరోగా పరిచయం అవుతూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఈ'. మెహరీన్, రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్లు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం నవంబరు 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విక్రాంత్ మాట్లాడుతూ – ''నాకు సినిమాలంటే ఇష్టం. అమెరికాలో జాబ్ చేస్తున్న క్రమంలో సంపాదనలో పడి కలను మర్చిపోకూడదని ఈ సినిమా తీశాను. ఏడాదిన్నర పాటు 'స్పార్క్' కథ రాసుకుని, కష్టపడి మరో ఏడాదిన్నర పాటు ఈ సినిమాను నిర్మించాం. 'స్పార్క్' నా మూడేళ్ల కల. యాక్షన్, థ్రిల్, లవ్, కామెడీ, డ్రామా.. అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. యూనివర్సల్ అప్పీల్ ఉన్న మల్టీజానర్ ఫిల్మ్ ఇది'' అన్నారు. ''ఈ చిత్రంలో నా పాత్ర కొత్తగా ఉంటుంది'' అన్నారు తమిళ నటుడు గురు సోమసుందరం. ''టైటిల్‌కు తగ్గట్లే మా సినిమా 'స్పార్క్'లా ఉంటుంది'' అన్నారు మెహరీన్. ''ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పాటలకు మంచి స్పందన వస్తుండటం హ్యాపీ'' అన్నారు చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్.

మార్టిన్ వస్తున్నాడు


● సంపూర్ణేష్

సంపూర్ణేష్ బాబు టైటిల్ రోల్‌లో వీకే నరేశ్, శరణ్య ప్రదీప్, వెంకటేశ్ మహా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజ కొల్లూరు దర్శకత్వంలో ఎస్. శశికాంత్, చక్రవర్తి రామచంద్ర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. తెలుగు రాష్ట్రాల్లో నిర్మాత 'దిల్' రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పంపిణీ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ''స్థానికంగా చెప్పులు కుట్టే వ్యక్తి కథే ఈ చిత్రం. అతని గ్రామంలో ఎన్నికలు వచ్చినప్పుడు, అతని ఓటు విజేతను నిర్ణయించే పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆ వ్యక్తి జీవితం రాత్రికి రాత్రే ఏ విధంగా మలుపు తిరిగింది? అనేది ఈ చిత్రం ప్రధానాంశం'' అని యూనిట్ పేర్కొంది.

హెల్త్

WORLD TRAUMA DAY

అకస్మాత్తు ప్రమాదాలూ... అవసరమైన చికిత్సలు!



జీవితం అనిశ్చితం. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియదు. అకస్మాత్తుగా ఏదో రోడ్డు ప్రమాదానికో గురై గాయాలు కావచ్చు. అనుకోకుండా మంటలు చెలరేగి చర్మం కాలవచ్చు. హఠాత్తుగా వర్క్‌ప్లేస్‌లోనో లేదా పెద్దవయసువారు బాత్‌రూమ్‌లోనో పడిపోయి, గాయం కావచ్చు. ఇలా అనుకోకుండా ప్రమాదం జరగడం, యాక్సిడెంటల్‌గా బాధలకు గురికావడాన్ని వైద్య పరిభాషలో 'ట్రామా' కేసులుగా పరిగణిస్తారు. ఇలాంటి ప్రమాదాలప్పుడు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కోసం ప్రతి ఏడాదీ అక్టోబరు 17వ తేదీని 'వరల్డ్ ట్రామా డే'గా నిర్వహిస్తుంటారు. ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, అందించాల్సిన ప్రథమ చికిత్సలపై అవగాహన కోసం ఈ కథనం.

సాధారణంగా రోడ్డు ప్రమాదాల్లోనే ట్రామా కేసులెక్కువ. దీనివల్ల తలకు గాయాలు, ఎముకలు విరగడాలు వంటివి జరుగుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డం వల్ల ఏటా 50 లక్షల మంది మృతిచెందుతున్నారు. ప్రతి ఆరు సెకండ్లకు మరణం సంభవిస్తోంది. ఇలా మన దేశంలో ఏటా 10 లక్షల మంది మృతిచెందడంతో పాటు రెండు కోట్ల మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. యువతలో సంభవించే మరణాల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందేవారూ, అందునా 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసువారే ఎక్కువ.

యాక్సిడెంట్లలో లేదా పెద్ద వయసు కారణంగా తలకు గాయాలు, ఎముకలు విరగడాలు


రోడ్డు లేదా ఇతరత్రా ప్రమాదాల్లో తలకు గాయం కావడం మామూలే. పెద్దవయసు వారిలో మజిల్‌మాస్ తగ్గడం, కాళ్లలో స్పర్శ జ్ఞానం మందగించడం, అకస్మాత్తుగా స్పృహ తప్పడం, అకస్మాత్తుగా బీపీ తగ్గిపోవడం, కొందరిలో పక్షవాతం, పార్కిన్‌సన్స్ డిసీజ్ వంటి కారణాలతో పడిపోతే తలకు గాయాలు, ఎముకలు... ప్రధానంగా తుంటి ఎముక వంటివి విరగడం లాంటి ప్రమాదాలు జరగవచ్చు.

ముందుగా పరిశీలించాల్సిన లక్షణాలు...

● స్పృహ కోల్పోవడం ● ఫిట్స్ రావడం ● రెండు, అంతకన్నా ఎక్కువ వాంతులు కావడం ● చెవి, ముక్కులోంచి రక్తం రావడం. ● ప్రమాదానికి ముందు మొదలుకొని 30 నిమిషాల లోపు జరిగిన సంఘటనలు గుర్తులేకపోవడం.

తలకు గాయాలు తక్షణ సాయాలు

ముందుగా అంబులెన్స్ ద్వారా పారామెడికల్ లేదా ఎమర్జెన్సీ వైద్య సిబ్బంది నుంచి సహాయం అందాలి. ఆసుపత్రికి తీసుకొచ్చాక ఎమర్జెన్సీలోనే చికిత్స ప్రారంభం కావాలి. ఎందుకంటే మెదడుకు జరిగిన నష్టాన్ని మళ్లీ భర్తీ చేయడం కష్టం కాబట్టి చికిత్స వీలైనంత త్వరగా అందాలి. ● రక్తస్రావం అవుతుంటే దాన్ని ఆపాలి.


డా॥ రాహుల్ కట్టా, ట్రామా కేర్ స్పెషలిస్ట్

రోడ్డు ప్రమాదాలూ.. ప్రథమ చికిత్స

● సహాయం కోసం పిలవడం (కాల్ ఫర్ హెల్ప్): దీనివల్ల సమీప హాస్పిటల్‌కు బాధితుల్ని వీలైనంత త్వరగా తరలించడానికి వీలవుతుంది. దగ్గర్లోని ఆసుపత్రి వివరాలను, అంతకంటే ప్రధానంగా అంబులెన్స్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.



● సీన్ సేఫ్టీ : బాధితులను పక్కన చేర్చే సమయంలో అక్కడ సురక్షితంగా ఉందా అన్నది చూసుకోవాలి. ఉదా: ప్రమాద బాధితుల్ని రోడ్డు మధ్యన ఉంచడం కంటే ఓ పక్కగా తీసుకురావడం సురక్షితం.



● తలను కదల్చకుండా ఉంచడం (హెడ్ ఇమ్మొబిలైజేషన్): తలను కదల్చకుండా ఉంచాలి. ఎందుకంటే... తలకు గాయాలైన సందర్భాల్లో మెడకూ, వెన్నుపూసకూ గాయాలైనప్పుడు, తలను కదల్చకుండా ఉంచడం వల్ల వెన్నుపూసలకు సంబంధించిన అనర్థాలను నివారించినట్లు అవుతుంది.

● రక్తస్రావాన్ని అరికట్టడం : రక్తస్రావం జరగడం... రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయాలకు దారితీసే ప్రధాన అంశం. అందుకే రక్తస్రావాన్ని అరికట్టడం... రోడ్డు ప్రమాద చికిత్సలో చాలా కీలకమైన అంశం. అందుకోసం చేయాల్సినవి...

● రక్తస్రావానికి కారణమైన గాయం ఏదైనా ఉందేమో పరిశీలించాలి. గాయం కనిపిస్తే, దానిపై తగినంత ఒత్తిడితో రక్తస్రావం ఆగేలా చేయాలి. శుభ్రమైన గుడ్డ లేదా గాజుగుడ్డను కూడా ఇందుకు ఉపయోగించవచ్చు. గాయంపై శుభ్రమైన గుడ్డతో రెండు చేతులతో ఒత్తిడి కలిగిస్తూ పదినిమిషాలు అలాగే ఉంచాలి.

టార్నికేట్ : ఒకవేళ పైన చెప్పినట్టు పదినిమిషాల పాటు ఒత్తిపట్టినా రక్తం ఆగకపోతే ఏదైనా గుడ్డతో గాయంపై రక్తం ఆగేందుకు గట్టిగా కట్టుకట్టి, అలా ఎంతసేపు కట్టి ఉంచారో వైద్య బృందాలకు తెలపాలి. అయితే ఇలా గట్టిగా ఒత్తిపట్టి ఉంచడమన్నది కాళ్లు లేదా చేతుల విషయంలోనే జరగాలి తప్ప శరీర భాగాల్లోని మిగతా చోట్ల చేయకూడదు.

కంటి గాయాలు

కంటికి అనేక రకాలుగా గాయాలయ్యే అవకాశముంది. రైతులు పొలాల్లో, డొంకల్లో నడిచేప్పుడు ముళ్ల చెట్లు, తుప్పలు కంటికి కొట్టుకోవడం, ఇటుక, ఇనకలారీల్లోంచి పార్టికిల్స్ వచ్చి కళ్లలో పడటం, రాత్రి ప్రయాణాల్లో పురుగులు కళ్లకు కొట్టుకోవడం, వంటి ప్రమాదాలు జరిగి, కళ్లు గాయపడవచ్చు. ఇక పిల్లల విషయంలో బంతి / షటిల్‌కాక్ వేగంగా ఎగిరొచ్చి కంటికి ఢీకొనవచ్చు.

పరిశీలించాల్సిన లక్షణాలు...

● కన్నునొప్పి, కంటివాపు ● కంట్లో ఏదైనా పడినట్లు (ఫారిన్ బాడీ) అనిపించడం ● మసగ్గా కనిపించడం ● ఏమీ కనిపించకపోవడం

అందించాల్సిన ప్రథమ చికిత్సలు

● పొలాల్లో మందు పిచికారి చేస్తున్నప్పుడు కంట్లో పడితే, దాని ప్రభావం తగ్గించడం కోసం నీళ్లతో కంటిని కడగాలి. ● రోడ్డు ప్రమాణంలో ఫుల్ ఫేస్ హెల్మెట్ వాడాలి. ● బంతి/షటిల్‌కాక్ కళ్లకు తగలగానే వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. ● ఒక గ్లాసు నీళ్లు తీసుకుని, కన్ను ముంచి, రెప్పలను ఆడిస్తూ ఉండాలి. కొద్ది కొద్దిసేపటికి ఈ నీళ్లను మారుస్తూ ఉండాలి. ● కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లేలోపు కంటిని ఎట్టిపరిస్థితుల్లో నలపకూడదు.

కాలిన గాయాలు... తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● గాయం కాగానే... కంగారు పడకుండా దానిపై నీళ్ల ధారగా పడేలా చూడాలి. అలా కనీసం 10 నిమిషాల పాటు, మంట తగ్గేవరకు కడగాలి. ● కాలినప్పుడు బట్ట చర్మానికి అంటుకుంటే దాన్ని తీయకూడదు. డాక్టర్ మాత్రమే దాన్ని తొలగిస్తారు. ● కాలిన గాయలపై 'క్లింగ్ ర్యాప్' (తినే పదార్థాలపై కప్పే ట్రాన్స్‌పరెంట్ షీట్)తో చుట్టడం గానీ లేదా కప్పడం గానీ చేయాలి. ● గాయాన్ని కడగడానికి గది ఉష్ణోగ్రతతో ఉన్న నీళ్లనే వాడాలి. ఐస్ వాటర్ వద్దు. ● కాలిన గాయం మందం... మన అరచేయి మందంలో సగానికంటే ఎక్కువగా ఉన్నప్పుడూ లేదా రసాయనాల వల్ల కాలిన గాయమైతే బాధితుల్ని వెంటనే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలి. ● గాయాన్ని ఎప్పుడూ రుద్దకూడదు. ● గాయాలపై పసుపు, పేస్టు, నెయ్యి వంటివి రాయకూడదు.



కోహ్లి 'జెర్సీ' మారింది!

పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో కోహ్లి కాస్త గందరగోళానికి కేంద్రంగా మారాడు. మైదానంలోకి దిగినప్పుడు అతను వేసుకున్న జెర్సీ సహచరుల జెర్సీకంటే భిన్నంగా ఉండటంతో సమస్య మొదలైంది. సాధారణంగా టీమ్ కిట్ స్పాన్సర్ 'అడిడాస్'కు సంబంధించిన మూడు అడ్డగీతలు మన ఆటగాళ్ల జెర్సీల భుజాలపై తెల్ల రంగులో కనిపిస్తాయి. కానీ వరల్డ్ కప్ కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన జెర్సీపై త్రివర్ణ పతాకాన్ని పోలిన రంగులతో ఈ గీతలు కనిపిస్తాయి. అయితే కోహ్లి తెలుపు గీతల టీ షర్ట్‌తోనే వచ్చేశాడు. ఆరు ఓవర్లు ముగిసేవరకు దీనిని ఎవరూ గుర్తించలేదు. ఆ తర్వాత విషయం తెలియడంతో కోహ్లి ఏడో ఓవర్‌లో డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి జెర్సీని మార్చుకొని తర్వాతి ఓవర్లో గ్రౌండ్‌లోకి వచ్చాడు.

3.5 కోట్ల వీక్షకులు! డిస్నీ హాట్‌స్టార్ రికార్డు

భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన వరల్డ్‌కప్ మ్యాచ్ మొబైల్ స్ట్రీమింగ్‌లో కొత్త రికార్డు సృష్టించింది. ఒకదశలో మ్యాచ్‌ను ఒకేసారి గరిష్టంగా 3.5 కోట్ల మంది వీక్షకులు చూసినట్లు డిస్నీ హాట్‌స్టార్ ప్రకటించింది. ఈ ఏడాది చెన్నై, గుజరాత్ మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్‌ను 3.2 కోట్ల మంది ఏకసమయంలో చూడగా... ఇప్పుడు ఆ రికార్డును తాజా ప్రపంచకప్ మ్యాచ్ బద్దలు కొట్టింది.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X అఫ్గానిస్తాన్
వేదిక: న్యూఢిల్లీ

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

“మా బౌలర్లే ఈ రోజు మ్యాచ్ ఫలితాన్ని శాసించారు. పాక్ కనీసం 290 వరకు వెళుతుందనుకుంటే 191 పరుగులకే కట్టడి చేయడం అద్భుతం. బౌలర్లంతా సమష్టిగా సత్తా చాటారు. అందరూ అన్ని రోజుల్లో బాగా ఆడలేరు. మనదైన రోజును మరో అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోవాలి. నేను అదే పని చేశాను. కెప్టెన్‌గా కూడా నాపై అదనపు బాధ్యత ఉంది. ఈ మ్యాచ్‌లో కూడా పాక్‌ను మేం మరో ప్రత్యర్థిగానే చూశాం తప్ప ఎలాంటి ప్రత్యేకత లేదు. మేం గత రికార్డును పట్టించుకోలేదు. ప్రపంచకప్‌లోకి అడుగు పెట్టక ముందే జట్టులో అందరికీ తమ బాధ్యతలపై స్పష్టత ఉంది. అందుకే అందరూ తమదైన పాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ విజయంతో మేమేమీ అతిగా ఉప్పొంగిపోవడం లేదు. టోర్నీలో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి కాబట్టి జాగ్రత్తగా ముందుకు వెళ్లాలి.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్

'అష్ట' దిగ్బంధనం

ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌కు ఎనిమిదో విజయం

- మరోసారి అదరగొట్టిన టీమిండియా
- 7 వికెట్ల తేడాతో పాక్ చిత్తు
- చెలరేగిన రోహిత్, బౌలర్లు
- గురువారం బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్

వన్డే వరల్డ్ కప్‌లో లెక్క మారలేదు. 31 ఏళ్లుగా పాకిస్తాన్‌పై వేర్వేరు వేదికల్లో కనిపించిన ఆధిపత్యం అహ్మదాబాద్‌లోనూ కొనసాగింది. ఫేవరెట్‌గా భావించిన భారత జట్టు అన్ని రంగాల్లో చెలరేగి పాక్‌ను ఊపిరాడనీయకుండా చేసింది. ఒకవైపు భారత బౌలర్లంతా సమష్టిగా చెలరేగుతుంటే... మరోవైపు లక్ష మంది జనం 'భారత్ మాతాకీ జై' అంటూ హోరెత్తిస్తుంటే... మైదానంలో దాయాది జట్టు బెంబేలెత్తిపోయింది... బ్యాటింగ్‌లో కనీస స్థాయి ప్రదర్శన కూడా ఇవ్వలేక... కనీసం 200 పరుగులు కూడా చేయలేక కుప్పకూలింది... ఆపై మొదటి బంతి నుంచే ఇండియా జోరు మొదలైంది... సిక్సర్లతో చెలరేగిపోతున్న రోహిత్ శర్మను నిలువరించలేక పాక్ బౌలర్లు చేతులెత్తేయగా మరో అలవోక విజయం మన ఖాతాలో చేరింది. ఏకంగా 19.3 ఓవర్లు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించిన టీమిండియా వరల్డ్ కప్‌లో చిరకాల ప్రత్యర్థిపై తన అజేయ రికార్డును ఘనంగా నిలబెట్టుకుంది. 8-0తో సంపూర్ణ ఆధిక్యాన్ని ప్రదర్శించింది.



రిజ్వాన్‌ను అవుట్ చేశాక బుమ్రా సంబరం

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (ఎల్బీ) (బి) సిరాజ్ 20; ఇమామ్ (సి) రాహుల్ (బి) పాండ్యా 36; బాబర్ ఆజమ్ (బి) సిరాజ్ 50; రిజ్వాన్ (బి) బుమ్రా 49; షకీల్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 6; ఇఫ్తికార్ (బి) కుల్దీప్ 4; షాదాబ్ (బి) బుమ్రా 2; నవాజ్ (సి) బుమ్రా (బి) పాండ్యా 4; హసన్ (సి) గిల్ (బి) జడేజా 12; షాహిన్ అఫ్రిది (నాటౌట్) 2; రవూఫ్ (ఎల్బీ) (బి) జడేజా 2; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (42.5 ఓవర్లలో ఆలౌట్) 191. వికెట్ల పతనం: 1-41, 2-73, 3-155, 4-162, 5-166, 6-168, 7-171, 8-187, 9-187, 10-191. బౌలింగ్: బుమ్రా 7-1-19-2, సిరాజ్ 8-0-50-2, పాండ్యా 6-0-34-2, కుల్దీప్ 10-0-35-2, జడేజా 9.5-0-38-2, శార్దుల్ 2-0-12-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) ఇఫ్తికార్ (బి) షాహిన్ 86; గిల్ (సి) షాదాబ్ (బి) షాహిన్ 16; కోహ్లి (సి) నవాజ్ (బి) హసన్ అలీ 16; అయ్యర్ (నాటౌట్) 53; కేఎల్ రాహుల్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (30.3 ఓవర్లలో 3 వికెట్లకు) 192. వికెట్ల పతనం : 1-23, 2-79, 3-156. బౌలింగ్: షాహిన్ అఫ్రిది 6-0-36-2, హసన్ అలీ 6-0-34-1, నవాజ్ 8.3-0-47-0, రవూఫ్ 6-0-43-0, షాదాబ్ 4-0-31-0.



శ్రేయస్ అయ్యర్



కుల్దీప్



రోహిత్ శర్మ

అహ్మదాబాద్: ప్రపంచకప్‌లో తిరుగులేకుండా దూసుకుపోతున్న భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. పటిష్టమైన టీమిండియా అంచనాలకు అనుగుణంగా చెలరేగి పాకిస్తాన్‌పై ఏకపక్ష విజయాన్ని అందుకుంది. శనివారం నరేంద్ర మోదీ స్టేడియంలో ఎలాంటి హోరాహోరీ, పోటాపోటీ లేకుండా సాగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 42.5 ఓవర్లలో 191 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (58 బంతుల్లో 50; 7 ఫోర్లు), మొహమ్మద్ రిజ్వాన్ (69 బంతుల్లో 49; 7 ఫోర్లు) మినహా ఇతర బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఒకదశలో 155/2తో మెరుగైన స్థితిలో కనిపించిన పాక్ 36 పరుగుల తేడాలో 8 వికెట్లు కోల్పోయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (2/19) రెండు కీలక వికెట్లు తీయగా... పాండ్యా, కుల్దీప్, జడేజా, సిరాజ్ కూడా తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 30.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 192 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ రోహిత్ శర్మ (63 బంతుల్లో 86; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ గెలుపును సులువుగా మార్చగా... శ్రేయస్ అయ్యర్ (62 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను గురువారం పుణేలో బంగ్లాదేశ్‌తో ఆడుతుంది.



బాబర్ ఆజమ్ బౌల్డ్

ఆ భాగస్వామ్యం మినహా...

పాకిస్తాన్ తమ ఇన్నింగ్స్‌ను సానుకూలంగానే ప్రారంభించింది. ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ (38 బంతుల్లో 36; 6 ఫోర్లు), అబ్దుల్లా షఫీక్ (20) ఒత్తిడికి లోనుకాకుండా చక్కటి షాట్లతో పరుగులు రాబట్టారు. అయితే షఫీక్‌ను సిరాజ్ ఎల్బీగా అవుట్ చేయడంతో పాక్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కొద్ది సేపటికే ఇమామ్‌ను పాండ్యా వెనక్కి పంపించాడు. ఈ దశలో జట్టును ఆదుకునే బాధ్యత సీనియర్లు బాబర్, రిజ్వాన్‌లపై పడింది. జడేజా తన తొలి ఓవర్లోనే రిజ్వాన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నా... బ్యాటర్ రివ్యూలో అది నాటౌట్‌గా తేలింది. ఇద్దరు బ్యాటర్లు జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశారు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు మూడో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. ఈ క్రమంలో 57 బంతుల్లో బాబర్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే సిరాజ్ వేసిన చక్కటి బంతి స్టంప్స్ పైభాగాన్ని తాకడంతో బాబర్ అదే స్కోరు వద్ద నిరాశగా నిష్క్రమించాడు. అంతే... ఆ వికెట్ తర్వాత పాక్ పతనం వేగంగా సాగింది. కుల్దీప్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి దెబ్బ కొట్టగా, బుమ్రా ఆఫ్‌కటర్‌కు రిజ్వాన్ బౌల్డ్ కావడంతో భారీ స్కోరుపై పాక్ ఆశలు వదులుకుంది. మిగిలిన నాలుగు వికెట్ల లాంఛనాన్ని పూర్తి చేయడానికి భారత్‌కు ఎంతో సమయం పట్టలేదు. పాకిస్తాన్‌పై 2011 వరల్డ్ కప్ సెమీఫైనల్ (మొహాలిలో) తరహాలోనే భారత్ తరఫున ఐదుగురు బౌలర్లు తలా 2 వికెట్లు పంచుకోవడం విశేషం.



సిరాజ్



హార్దిక్ పాండ్యా



జడేజా

మెరుపు బ్యాటింగ్...

డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లెగ్, వైడ్ లాంగాన్, మిడాన్, కవర్స్, స్క్వేర్ లెగ్, డీప్ మిడ్ వికెట్... రోహిత్ శర్మ అలవోకగా వేర్వేరు దిశల్లో బాదిన ఆరు సిక్సర్లు ఇవి! స్వల్ప లక్ష్యాన్ని భారత్ ఛేదించేందుకు సిద్ధమైన తరుణంలో స్టేడియంలోని అభిమానులకు ఇదే తరహా రోహిత్ ఆట వినోదం పంచింది. ఇన్నింగ్స్ తొలి బంతిని ఫోర్‌తో మొదలు పెట్టిన రోహిత్ ఎప్పుడెప్పుడు మ్యాచ్‌ను ముగిద్దామా అన్నట్లుగా వేగంగా దూసుకుపోయాడు. మరో ఎండ్‌లో శుబ్‌మన్ గిల్ (11 బంతుల్లో 16; 4 ఫోర్లు), కోహ్లి (18 బంతుల్లో 16; 3 ఫోర్లు) మాత్రం విఫలమయ్యారు. షాదాబ్ చక్కటి క్యాచ్‌కు గిల్ వెనుదిరగ్గా, పేలవ షాట్ ఆడి కోహ్లి నిష్క్రమించాడు. అయితే రోహిత్ జోరును మాత్రం పాక్ అడ్డుకోలేకపోయింది. 36 బంతుల్లోనే అతను 3 ఫోర్లు, 4 సిక్సర్లతో రోహిత్ అర్ధసెంచరీ పూర్తయింది. ఆ తర్వాతా పాక్ బౌలర్లను వదలకుండా మరో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదిన రోహిత్ జట్టును గెలుపు దిశగా తీసుకెళ్లాడు. కానీ విజయానికి మరో 36 పరుగులు చేయాల్సిన స్థితిలో అవుటై రోహిత్ వరల్డ్ కప్ చరిత్రలో ఎనిమిదో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. అనంతరం అయ్యర్, కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు) కలిసి ఎలాంటి ఇబ్బంది లేకుండా మ్యాచ్‌ను ముగించారు. నవాజ్ వేసిన 31వ ఓవర్ మూడో బంతిని నేరుగా శ్రేయస్ బౌండరీకి తరలించగా అతని అర్ధసెంచరీతో పాటు భారత్ విజయం పూర్తయింది.

విజేతలు రిషిత, హృతిక్





న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు బసిరెడ్డి రిషితా రెడ్డి, కటకం హృతిక్ మెరిశారు. రిషిత అండర్-16 బాలికల సింగిల్స్ విభాగంలో... హృతిక్ అండర్-14 బాలుర సింగిల్స్ విభాగంలో చాంపియన్స్‌గా నిలిచారు. శనివారం ఇక్కడి డీఎల్‌టీఏ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్స్‌లో రిషిత 6-4, 6-3తో ఐషి బిష్త్ (ఢిల్లీ)పై, హృతిక్ 6-4, 6-3తో ప్రకాశ్ శరణ్ (కర్ణాటక)పై విజయం సాధించారు.

షాంఘై ఓపెన్ టోర్నీ ఫైనల్లో బోపన్న జోడీ



షాంఘై: ఈ ఏడాది మూడో టైటిల్ సాధించేందుకు రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ విజయం దూరంలో నిలిచింది. షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో బోపన్న-ఎబ్డెన్ ద్వయం టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 7-6 (7/0), 4-6, 10-2తో 'సూపర్ టైబ్రేక్'లో సాదియో డుంబియా-ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ఎనిమిది ఏస్‌లు సంధించారు. నేడు జరిగే ఫైనల్లో మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా)లతో బోపన్న-ఎబ్డెన్ తలపడతారు. ఈ ఏడాది బోపన్న-ఎబ్డెన్ ద్వయం ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్ టోర్నీలో, దోహా ఓపెన్‌లో టైటిల్స్ సాధించి... యూఎస్ ఓపెన్, మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ టోర్నీ, రోటర్‌డామ్ ఓపెన్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది.

పోరాడి ఓడిన రష్మిక



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. బ్యాంకాక్‌లో శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో రష్మిక 7-6 (7/5), 6-7 (5/7), 2-6తో టాప్ సీడ్ పటాచారిన్ చీప్‌చందెజ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

సెమీఫైనల్లో సింధు పరాజయం



వాంటా (ఫిన్‌లాండ్): ఈ ఏడాది తొలి టైటిల్ కోసం భారత స్టార్ షట్లర్ పీవీ సింధు నిరీక్షణ కొనసాగుతోంది. ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 63 నిమిషాల్లో 12-21, 21-11, 7-21తో ప్రపంచ 11వ ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా) చేతిలో ఓడిపోయింది. గతంలో వాంగ్ జి యితో ఆడిన రెండుసార్లూ గెలిచిన సింధు మూడోసారి మాత్రం పరాజయం చవిచూసింది. సెమీఫైనల్లో ఓడిన పీవీ సింధుకు 6,090 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 5 లక్షలు)తోపాటు 6,420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాదిలో సింధు ఇప్పటి వరకు 18 టోర్నమెంట్‌లు ఆడగా... స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచి, మరో మూడు టోర్నీల్లో సెమీఫైనల్ చేరింది.

2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై భారత్ దృష్టి

ఐఓసీ సెషన్స్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్‌తో మోదీ

ముంబై: విశ్వక్రీడల ఆతిథ్యంపై భారత్ దృష్టి పెట్టినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సెషన్స్ ప్రారంభోత్సవ సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన మోదీ మాట్లాడుతూ 'ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారతీయులంతా ఎదురుచూస్తున్నారు. 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చే ప్రణాళికల్లో ఉన్నాం. ఇది 140 కోట్ల భారతీయుల కల. దీన్ని ఐఓసీ సహకారంతో సాకారం చేస్తాం. దీనికంటే ముందు 2029లో యూత్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు మేం రెడీగా ఉన్నాం' అని మోదీ అన్నారు. క్రీడాస్ఫూర్తి అనేది విశ్వవ్యాప్తమని, ఇందులో పరాజితులెవరూ ఉండరని... కేవలం విజేతలు, నేర్చుకునేవారే ఉంటారని మోదీ చెప్పారు. 141వ ఐఓసీ సెషన్స్ శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయి. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో కొత్త క్రీడాంశాలకు చోటు కల్పించడం, ఓటింగ్, ఆమోదం తదితర నిర్ణయాలను ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు తీసుకుంటుంది.

'భారీ విజయాలపై ఇంగ్లండ్ దృష్టి పెట్టాలి'

కృష్ణమాచారి శ్రీకాంత్

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు ఆదివారం అఫ్గానిస్తాన్‌తో పెద్దగా సవాలైతే ఎదురుకాదు. ఢిల్లీలో అఫ్గాన్ స్పిన్నర్లకు పిచ్ నుంచి సానుకూలత లేకపోతే మ్యాచ్ ఏకపక్షమయ్యే ఫలితంలో ఏ మార్పు ఉండదు. ఈ నేపథ్యంలో నేడు అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు పెద్దగా ప్రాధాన్యం లేదనే చెప్పొచ్చు. అయితే గాయం నుంచి కోలుకున్న బెన్ స్టోక్స్ బరిలోకి దిగేందుకు, ఫామ్‌ను అందిపుచ్చుకునేందుకు ఈ మ్యాచ్ ఉపయోగపడుతుంది. ఇంగ్లండ్‌కు ఈ స్టార్ ఆల్‌రౌండర్ ఫిట్‌నెస్ ఎంతో కీలకం. ఏడాది క్రితం వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన స్టోక్స్ ఇంగ్లండ్ ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఫార్మాట్‌లో పునరాగమనం చేశాడు. 50 ఓవర్ల మ్యాచ్‌లో అతను ఎప్పుడైనా ప్రమాదకర ఆటగాడని ఇదివరకు ఎన్నో సార్లు రుజువు చేశాడు. మరోవైపు దక్షిణాఫ్రికా చేతిలో ఆస్ట్రేలియా చిత్తుగా ఓడటం ఇంగ్లండ్ సహా సెమీస్ బరిలో ఉంటామనుకున్న మిగతా జట్ల ఉత్సాహంపై నీళ్లుచల్లింది. ఎందుకంటే ఇంగ్లండ్ కూడా న్యూజిలాండ్ చేతిలో అలాంటి పరాజయాన్నే చవిచూసింది. ఇలాంటి అత్యల్ప స్కోర్ల మ్యాచ్‌లతో నాకౌట్ దశ చేరేందుకు చివరికొచ్చేసరికి రన్‌రేట్ కీలకమవుతుంది. కాబట్టి సెమీస్‌లో ఎవరూ ఖాయమని అనుకోవడానికి లేదు. అయితే ఇంగ్లండ్... అఫ్గాన్ తదితర జట్లపై భారీ విజయాలపై దృష్టి పెడితే మంచిది. ఢిల్లీ లాంటి పిచ్‌పై ఇంగ్లండ్ బ్యాటర్లు చెలరేగేందుకు చక్కని అవకాశం కల్పిస్తుంది.

విలియమ్సన్‌కు గాయం: మూడు మ్యాచ్‌లకు దూరం



చెన్నై: ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ! అనుభవజ్ఞుడైన కెప్టెన్ కేన్ విలియమ్సన్ బొటన వేలి గాయంతో ఏకంగా మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా బ్యాటింగ్‌లో పరుగు తీస్తున్న సమయంలో ఫీల్డర్ విసిరిన త్రో కారణంగా అతని ఎడమ చేతి బొటన వేలికి గాయమైంది. దీంతో 78 పరుగుల వద్ద కేన్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. అయితే తదనంతరం ఎక్స్‌రే తీయగా వేలికి ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దీంతో తదుపరి మూడు మ్యాచ్‌లకు (18న అఫ్గానిస్తాన్‌తో; 22న భారత్‌తో; 28న దక్షిణాఫ్రికాతో) అతను దూరం కానున్నాడు. అతను గాయం నుంచి కోలుకున్న తర్వాతే వచ్చే నెల మ్యాచ్‌లకు అందుబాటులో ఉండేది లేనిది తెలుస్తుంది.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కోర్టుకు తప్పుడు సమాచారం ఇస్తారా?

పిటిషనర్‌కు రూ.10 వేలు జరిమానా

సాక్షి, హైదరాబాద్: షోకాజ్ నోటీసులు జారీ చేయలేదంటూ హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఓ పిటిషనర్‌కు రూ.10 వేలు జరిమానా విధించింది. అదేవిధంగా ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం కొట్టివేసింది. అక్రమ నిర్మాణాలను 15 రోజుల్లో తొలగించాలంటూ సెప్టెంబర్ 20న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగ్ మున్సిపాలిటీకి చెందిన ప్రశాంత్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ...ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేత ఉత్తర్వులను ఇవ్వడం సరి కాదన్నారు. మున్సిపాలిటీ తరఫు న్యాయవాది రికార్డులను సమర్పిస్తూ..ఆగస్టు 1న షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రశాంత్ కుమారే సంతకం చేసి నోటీసు అందుకున్నారన్నారు. సదరు ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించవచ్చన్నారు. ప్రశాంత్ కుమార్ సంతకాన్ని ధర్మాసనం పరిశీలించింది. తప్పుడు సమాచారం దాఖలు చేసినందున పిటిషనర్‌కు రూ.10 వేలు జరిమానా విధిస్తూ... పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ జరిమానాను తెలంగాణ న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది.

జాబితాలో పేరుంది.. కానీ ప్రొసీడింగ్ లేదు

- గృహలక్ష్మి పథకంలో 28 వేల మంది పరిస్థితి అయోమయం
- వారికి చెక్కులివ్వాలో లేదో.. తేల్చుకోలేక సందిగ్ధంలో అధికారులు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంకట పరిస్థితి
- స్పష్టత ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘానికి వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గృహలక్ష్మి పథకానికి సంబంధించి 28 వేల మంది 'లబ్ధిదారుల' పరిస్థితి అయోమయంలో పడింది. నియోజకవర్గ స్థాయి ఉమ్మడి జాబితాలో కలెక్టర్లు వీరిని లబ్ధిదారులుగా గుర్తించినప్పటికీ ఇంకా వ్యక్తిగత మంజూరు ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వీరిని లబ్ధిదారులుగా గుర్తించవచ్చా లేదా.. అనే అంశంపై సందిగ్ధం ఏర్పడింది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిందిగా అధికారులు ఎన్నికల సంఘాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గృహలక్ష్మి పథకం కింద నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణానికి వీలుగా లబ్ధిదారుల ఎంపికకు గతంలోనే కసరత్తు ప్రారంభించారు. ఈ పథకం కింద దాదాపు 15 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటి నుంచి 11 లక్షల పైచిలుకు దరఖాస్తులను అర్హమైనవిగా తేల్చారు. తొలుత వాటి నుంచి 4 లక్షల మందిని ఎంపిక చేసి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

లబ్ధిదారుల ఎంపిక కసరత్తు ప్రారంభమైన సమయంలో, ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణాన్నయినా విడుదల అయ్యే అవకాశం ఉందన్న సమాచారం అందింది. దీంతో ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. కానీ, అధికార పార్టీ ఎమ్మెల్యేల ప్రమేయం అనివార్యం అయినందున, వారిలో కొందరు వేగంగా స్పందించకపోవటంతో జాబితా రూపొందించే పని సకాలంలో జరగలేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే రోజుకు 2.15 లక్షల మంది లబ్ధిదారులనే గుర్తించారు. మిగతావారికి కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాతే నిధులు అందుతాయని చెపుతున్నారు.

ప్రొసీడింగ్స్ అందనివారి సంగతి ఏమిటి?

ఇదిలా ఉండగా లబ్ధిదారులుగా గుర్తించిన వారిలో 28 వేల మంది విషయంలో గందరగోళం నెలకొంది. వివిధ జిల్లాల్లో కలెక్టర్లు నియోజకవర్గ స్థాయిలో రూపొందించే ఉమ్మడి జాబితాలో పేర్లు నమోదు చేసిన వారికి స్థానిక ఎంపీడీఓలు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ కాపీ అందించాల్సి ఉంటుంది. కానీ, కలెక్టర్లు పేర్లు నమోదు చేసిన వారిలో రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మందికి ఎంపీడీఓలు ఆ ప్రొసీడింగ్స్ అందించలేదు. ఈలోపు కోడ్ అమలులోకి వచ్చింది. ప్రొసీడింగ్స్ వారి చేతికి అందనందున వారిని లబ్ధిదారులుగా గుర్తించవచ్చా లేదా? అన్న మీమాంస తలెత్తింది. ఈ విషయంలో స్పష్టత రాకుండా, వారికి చెక్కులు జారీ చేస్తే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్టవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో వారి విషయంలో స్పష్టత ఇవ్వాల్సిందిగా అధికారులు ఎన్నికల సంఘాన్ని కోరారు. అక్కడి నుంచి స్పష్టత వచ్చాకే చెక్కులు జారీ చేస్తామని చెపుతున్నారు.

మిగతా వారికి కొత్త ప్రభుత్వం వచ్చాకే..

గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో ప్రస్తుతం 2.15 లక్షల పేర్లు (28 వేల మందితో కలిపి) మాత్రమే ఉన్నాయి. 1.85 లక్షల మంది లబ్ధిదారుల పేర్లను ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈలోపు కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే మిగతావారి గుర్తింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందని అధికారులు చెపుతున్నారు.

చైనాతో సత్సంబంధాలతోనే భారత్‌కు ప్రయోజనాలు

- ఇండియా–చైనా మిత్ర మండలి ఆధ్వర్యంలో జాతీయ మహాసభలు
- చైనాలో డెంగ్ జియో పింగ్... తెలంగాణలో కేసీఆర్ ఆదర్శం: వినోద్‌కుమార్



ఇండియా చైనా మిత్ర మండలి జాతీయ స్థాయి సదస్సులో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఖైరతాబాద్ (హైదరాబాద్): ఇండియా చైనా మిత్ర మండలి జాతీయ మహాసభలు శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. 14, 15 తేదీలలో జరిగే ఈ సమావేశాలకు దేశంలోని నలుమూలల నుంచి, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. భారత చైనా మిత్ర మండలి తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జతిన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా షహీద్ భగత్ సింగ్ ఫౌండేషన్ జగన్‌మోహన్‌సింగ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, చైనా దేశంతో మైత్రి అవసరాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. చైనాతో సత్సంబంధాల వల్ల మనదేశం ఎంతో ప్రయోజనం పొందుతుందని తెలిపారు. అనంతరం భారత చైనా మిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు భాస్కర్ తన ఉపన్యాసంలో భారత చైనా మిత్ర మండలి ఏర్పడిన విధానాన్ని, ప్రాముఖ్యతను వివరించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఏ దేశమైనా, రాష్ట్రమైనా శాంతియుత వాతావరణం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉండటం వల్ల ప్రపంచ దేశాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ప్రణాళికాబద్ధంగా చైనాను అభివృద్ధి చేయడంలో డెంగ్ జియో పింగ్ ఆదర్శంగా నిలిచారని, అదే బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపారని పేర్కొన్నారు. భారత చైనా మిత్ర మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ప్రముఖ ప్రజా వైద్యులు డాక్టర్ ప్రతాపరెడ్డి, ప్రముఖ విప్లవ కవి నిఖిలేశ్వర్ తదితరులు మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న చైనా వ్యతిరేక ప్రచారాన్ని వారు ఖండించారు. ఈ సందర్భంగా నవోదయ కళాకారులు భారత్ చైనా మైత్రి ప్రాముఖ్యతను వివరిస్తూ ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

దైవదర్శనానికి వెళ్లొస్తూ... నవరాత్రి ఉత్సవాలకు వెళ్తూ

- మూడు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి
- తిరుమల వెళ్లి వస్తూ శామీర్‌పేట్ ఓఆర్ఆర్‌పై ముగ్గురి మృతి
- దేవీ నవరాత్రులకు ముంబై వెళ్తూ చంద్రాయన్‌పల్లి హైవేపై నలుగురు దుర్మరణం
- మేడ్చల్‌లో కంటైనర్ లారీ ఢీకొని ఇద్దరు బలి



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఇన్నోవా కారు



మారుతి



బాల్‌రాజ్‌గౌడ్



దుర్గేశ్‌ప్రసాద్



ప్రదీప్ (ఫైల్)

శామీర్‌పేట, ఇందల్వాయి(నిజామాబాద్ రూరల్), మేడ్చల్‌రూరల్: తిరుమల దైవదర్శనానికి వెళ్లి వస్తూ ముగ్గురు, ముంబై దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తూ నలుగురు వ్యక్తులు, కంటైనర్ లారీ ఢీకొని ఇద్దరు పాదచారులు రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం పాలైన ఘటనలు శనివారం రాష్ట్రంలో వేర్వేరు చోట్ల చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం మేరకు.. కుత్బుల్లాపూర్‌కు చెందిన బైరి మారుతి (31), బాల్‌రాజ్‌గౌడ్(43) మరో నలుగురితో కలిసి తిరుమల దర్శనానికి వెళ్లి అనంతరం తిరిగి వస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో వీరి ఇన్నోవా కారు శామీర్‌పేట్ పరిధి ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తుండగా కిలోమీటర్ నం 64 వద్ద ఆగి ఉన్న అశోక్ లేలాండ్ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు డ్రైవర్ మారుతితోపాటు డ్రైవర్ వెనక భాగంలో కూర్చున్న బాల్‌రాజ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మరో నలుగురికి గాయాలయ్యాయి. కారు ఢీ కొట్టడంతో అశోక్ లేలాండ్ వాహన డ్రైవర్, ఏపీ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రసాద్(24)కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అవ్వడంతో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు శామీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను గాంధీ మార్చురీకి తరలించారు. కాగా, ఇన్నోవా కారు డ్రైవర్ నిద్ర మత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు దర్యాప్తులో పేర్కొన్నారు.

నలుగురు యూపీ వాసులు దుర్మరణం

హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన పెయింటింగ్ కూలీలు దేవి నవరాత్రి ఉత్సవాల నిమిత్తం సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రైవేట్ బస్సు ఎక్కారు. రాత్రి 9.30గంటలకు నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి వద్ద ట్రాఫిక్ జామ్‌లో ఆగిన ఓ లారీని బస్సు డ్రైవర్ ఢీకొట్టాడు. ఏం జరిగిందో తెలుసుకోవడానికి బస్సులోంచి పలువురు దిగి రోడ్డు పక్కన నిల్చున్నారు. ఇంతలో కామారెడ్డి వైపు నుంచి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ వారిని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో యూపీలోని సిద్ధార్థ్‌నగర్‌కు చెందిన జిత్తు(32), గోరఖ్‌పూర్ జిల్లాకు చెందిన ప్రదీప్ (21) అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన బలరాంపూర్ జిల్లాకు చెందిన గణేశ్(22) దుర్గేశ్‌ప్రసాద్ (16)లను నిజామాబాద్ జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృత్యువాతపడ్డారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని డీసీఎం, బస్సులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మేడ్చల్‌లో కంటైనర్ లారీ భీభత్సం

మెదక్ జిల్లా నుంచి నగరం వైపు 44వ జాతీయ రహదారిపై వస్తున్న కంటైనర్ లారీ మేడ్చల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా రోడ్డు దాటుతున్న యశోద(26)పైకి దూసుకెళ్లింది. దీంతో యువతి అక్కడికక్కడే మరణించడంతో ఆ వాహనాన్ని స్థానికులు ఆపే ప్రయత్నం చేశారు. దీంతో భయాందోళనకు గురైన కంటైనర్ డ్రైవర్ వాహనం నుంచి కిందకు దూకి పరారయ్యాడు. దీంతో కంటైనర్ ఆగకుండా ముందుకు వెళ్లడంతో అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న స్థానిక ఎన్‌జీవోస్ కాలనీ వాసి సుభాష్ చంద్ర(40)ను ఢీకొని అక్కడే ఉన్న మార్బుల్ షాప్‌లోకి దూసుకెళ్లి గ్రానైట్‌కు ఢీ కొట్టి ఆగింది. ఈ ఘటనలో సుభాష్ చంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట విషాదం

చెరువులో పడి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల మృతి



చెరువు వద్ద గుమిగూడిన గ్రామస్తులు

జగదేవ్‌పూర్ (గజ్వేల్): బతుకమ్మ చెరువు కట్ట, మెట్లను శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఐదుగురు పారిశుద్ధ్య కార్మికులు చెరువులో పడిపోయారు. వారిలో ముగ్గురు కార్మికులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గిరిపల్లి భారతి (45), ఎల్లం యాదమ్మ (42), కర్రెమొల్ల బాబు (26), చంద్రయ్య, నాగేష్, మధు, రాజు శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పటాస్ చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మ మెట్ల వద్ద నాచును శుభ్రం చేశారు. పనులు పూర్తయిన అనంతరం కాళ్లుచేతులు శుభ్రం చేసుకుంటున్న క్రమంలో యాదమ్మ ప్రమాదవశాత్తు చెరువులో పడింది. ఆమెను కాపాడేందుకు బాబు యాదమ్మ చేతిని, బాబు చేతిని భారతి ఇలా ఒకరి చేతిని ఒకరు పట్టుకున్నారు. అయితే అప్పటికే ముగ్గురూ నీట మునిగారు. మృతదేహాలను గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీశారు. పండుగ రోజు చెరువులో పడి ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.